RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 16.01.2025 | సంపుటి : 11 సంచిక : 188 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్









## పలు ప్రవేశ పరీక్షల షెడ్యూల్ ఖరారు

ప్రకటించిన ఉన్నత విద్యామండలి

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో ప్రవేశ పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. ఏప్రిల్ 29 నుంచి జూన్ 19 వరకు ఎంట్రన్స్ టెస్ట్‌లు నిర్వహించనున్నట్టు ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. ఈఏపీసెట్ ఏప్రిల్ 29 నుంచి మే 5 వరకు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్,

మిగతా 3లో..



## గల్లంతైన వారు ఇక మృతులకిందికే..

కేరళ విపత్తులపై సర్కార్ కీలక నిర్ణయం

కేరళ(జనంసాక్షి): కేరళలోని వయనాడ్‌లో గతేడాది సంభవించిన ఘోరవిపత్తు ఘటనపై పినరయి విజయన్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. కొండచరియలు విరిగిపడిన ఘటనలో గల్లంతైన వారిని మృతులుగా ప్రకటించాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు

మిగతా 3లో..

# ఆర్‌ఎస్‌ఎస్ అడుగుజాడల్లో బీఆర్‌ఎస్

రెండింటికీ మధ్య తేడా లేదు

## భారాసపై మండిపడ్డ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం చట్ట ప్రకారం ముందుకెళుతోంది

మాది పక్షపాత ధోరణి కాదు

బీజేపీ జూటా మాటల పార్టీఅని ఎద్దేవా

న్యూఢిల్లీ,జనవరి15(జనంసాక్షి): బీఆర్ఎస్ కాదని, అది బీఆర్ఎస్ఎస్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరాభవన్ ప్రారంభోత్సవానంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో బీజేపీ కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తే.. తెలంగాణలో బీఆర్ఎస్ అదే ఫాలో అవుతోందని విమర్శించారు. ఆ పార్టీ తమకు నేర్పించాల్సిన అవసరం లేదన్నారు. తమ ప్రభుత్వం చట్ట ప్రకారం ముందుకెళుతోందని చెప్పారు. తెలంగాణలో ఎక్కడ శాంతిభద్రతల సమస్య ఎదురైనా అక్కడ పోలీసులు ఉంటారని చెప్పారు. తమకు పక్షపాత ధోరణి లేదని కుండబద్దలు కొట్టారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ పార్టీ ఆఫీసులపైనా దాడులు జరిగాయని అన్నారు. బీజేపీ జూటా మాటలు చెప్పే పార్టీ అని విమర్శించారు. బీజేపీ నేతల వ్యాఖ్యలపై ఫోకస్

మిగతా 2లో..

## పార్లమెంటు దిగ్గజం జైపాల్‌రెడ్డికి సీఎం రేవంత్ ఘన నివాళి

న్యూఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణ యోధుడు, ఉత్తమ పార్లమెంటేరియన్, కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి జయంతి (జనవరి 16) సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాకారంలో జైపాల్ రెడ్డి పోషించిన పాత్ర ప్రజలెప్పుడూ మరిచిపోరని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, ప్రజల మనోభావాలని కేంద్రం ముందు వివరించి సఫలీకృతుడైన నాయకుడు జైపాల్ రెడ్డిఅని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం నిశ్శబ్ద సైనికుడిలా జైపాల్ రెడ్డి

మిగతా 2లో..



కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ ముఖ్యనేతల

## కీలక సమావేశం

రాజకీయవర్గాల్లో ఉత్కంఠ • కేటీఆర్ అరెస్టుపై చర్చించినట్లా!

ఫిబ్రవరిలో సూర్యాపేట లేదా ఖమ్మంలో రాహుల్‌గాంధీ సభ

ఈ నెలాఖరులోపు నామినేటెడ్, కార్పొరేషన్ ఛైర్మన్ల భర్తీ

కేబినెట్ విస్తరణపై నిర్ణయం సీఎం, అధిష్ఠానానిదే..

మీడియాతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ 2లో

## నీటి కేటాయింపుల్లో మన వాదన బలంగా వినిపించండి

గోదావరి-బనకచర్లపై అభ్యంతరాలతో జల్‌శక్తి మంత్రి, ఏపీ ముఖ్యమంత్రికి లేఖలు రాయాలి

ఐఎస్‌ఆర్‌డబ్ల్యూడీఏ-1956 సెక్షన్ 3ని పరిగణనలోకి తీసుకోవాలి

పోలవరం ముంపుపై నిర్దేశిత సమయంలో ఐఐటీతో అధ్యయనం చేయించాలి 2లో

సమ్మక్క సారక్క బ్యారేజీ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలి

నీటి పారుదల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ఆంధ్రా,తెలంగాణ రాష్ట్రాలకు

## ఆరుగురు కొత్త జడ్జీలు

తెలంగాణ హైకోర్టు సిజెగా జస్టిస్ట్ సంజయ్ పాల్ నియామకం

సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు

న్యూఢిల్లీ,జనవరి15(జనంసాక్షి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులకు జడ్జిలుగా పలువురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. తెలంగాణ హైకోర్టుకు నలుగురు, ఏపీ హైకోర్టుకు ఇద్దరి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. తెలంగాణ హైకోర్టుకు వై.రేణుక, నందికొండ నర్సింగరావు, తిరుమల దేవి, మధుసూదన్ రావు; ఏపీ హైకోర్టుకు హరిహరనాథ శర్మ, యడవల్లి లక్ష్మణరావు పేర్లు సిఫార్సు చేసింది. జ్యుడీషియల్ ఆఫీసర్ల కోటాలో ఈ ఆరుగురు పేర్లను కొలీజియం సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది.ఇదిలావుంటే తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజయ్‌పాల్‌ను రాష్ట్రపతి నియమించారు. హైకోర్టు సీనియర్ న్యాయమూర్తిగా

మిగతా 2లో..

సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో

## తెలంగాణకు సహకరించండి

కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు మంత్రి శ్రీధర్‌బాబు వినతి

వార్త 2లో

## ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం

కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ,జనవరి 15 (జనంసాక్షి):ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నూతన కేంద్ర కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. 9 కోట్లా రోడ్డులో ఆరు అంతస్తుల్లో అత్యాధునిక సౌకర్యాలతో ఈ నూతన కార్యాలయాన్ని నిర్మించారు. కొత్త కార్యాలయాన్ని పార్టీ అగ్రనేత సోనియా గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రారంభించారు. కొత్త భవనానికి 'ఇందిరా గాంధీ భవన్'గా పేరు పెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్

మిగతా 2లో..



## మళ్లీ చిక్కుల్లో కేజ్రీవాల్

ఢిల్లీ లిక్కర్ కేసులో ఈడీ విచారణకు కేంద్రం అనుమతి

భాజపా మళ్లీ నీచ రాజకీయాలు మొదలుపెట్టింది • మండిపడ్డ ఆప్



న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సెగలు రేపుతోంది. ఆప్.. బీజేపీ, కాంగ్రెస్ మధ్య హైవోల్టేజ్ డైలాగ్ వార్ నడుస్తోంది. గెలుపే లక్ష్యంగా మూడు పార్టీలు సరికొత్త ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నాయి.. అయితే.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాజీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు మళ్లీ చిక్కులు ఎదురయ్యాయి. సరిగ్గా ఎన్నికలకు ముందు లిక్కర్ కేసు మళ్లీ కదలింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా విచారణకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి బుధవారం అనుమతి ఇచ్చింది.అయితే.. ప్రజా ప్రతినిధుల్ని విచారించాలంటే ముందస్తుగా అనుమతి ఉండాలంటూ గత నవంబర్‌లో సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే అనుమతి కోసం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనాకి చాన్నాళ్ల క్రితమే ఈడీ లేఖ రాసింది. దానిపై ఆయన నిర్ణయం ఇప్పుడు తీసుకున్నారు. ఆ వెంటనే కేంద్రం కూడా ఇడి విచారణకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

మిగతా 2లో..

న్యూఢిల్లీ స్థానానికి కేజ్రీవాల్

### నామినేషన్ దాఖలు

2లో

## కేటీఆర్‌కు సుప్రీంలో చుక్కెదురు

క్వాష్‌పిటీషన్ కొట్టివేసిన సర్వోన్నత న్యాయస్థానం

మాజీ మంత్రికి మరోసారి నోటీసులు ఇవ్వనున్న ఏసీబీ

న్యూఢిల్లీ,జనవరి15(జనంసాక్షి):మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఫార్ములా-ఈ కారు రేసుకు సంబంధించిన కేసులో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. ఏసీబీ నమోదు చేసిన కేసును క్వాష్ చేయాలని తెలంగాణ హైకోర్టులో కేటీఆర్ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. ఇందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. దీంతో ఈ నెల 8న ఆయన సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. కేటీఆర్ పిటిషన్‌పై జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ ప్రసన్న ధర్మాసనం విచారణ జరిపింది. దీంతో ఆయనకు ఇక ఎసిబి విచారణ తప్పదు. అలాగే అరెస్ట్ చేయడం



కూడా ఖాయమని అంటున్నారు. రాజకీయ కారణాలతోనే కేసు నమోదు చేశారని.. ప్రస్తుతం కేటీఆర్ విపక్షంలో ఉన్నారని ఆయన తరఫు న్యాయవాది సుందరం సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపక్ష నేతగా ఉండటంతోనే కేసులు పెడుతున్నారని వాదించారు. అయితే.. ప్రతిపక్ష నేతగా ఉంటే కేసులు ఎదుర్కోవాలి కదా..? అని జస్టిస్ బేలా ఎం త్రివేది ప్రశ్నించారు. హైకోర్టు తీర్పులో తాము జోక్యం చేసుకోలేమంటూ పిటిషన్‌ను

మిగతా 2లో..



## విచారణకు రండి

ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి మాసబ్ ట్యాంక్ పోలీసుల నోటీసులు

హైదరాబాద్(జనంసాక్షి):భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మాసబ్ ట్యాంక్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. గురువారం విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. కరీంనగర్ కోర్టుకు హాజరుకావాల్సి ఉందని, విచారణకు ఈనెల

మిగతా 2లో..

## దక్షిణ కొరియా అధ్యక్షుడి అరెస్టు

సియోల్(జనంసాక్షి):అనూహ్యంగా ఎమర్జెన్సీ ప్రకటించి పెను చిక్కులు తెచ్చుకున్నారు దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్. ఇప్పటికే ఆయన అభిశంసనకు గురైన సంగతి తెలిసిందే.తాజాగా ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. 'మార్షల్ లా' విధించి చట్టాన్ని ఉల్లంఘించినందుకు గానూ యోల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బుధవారం తెల్లవారుజామున వందలమంది దర్యాప్తు అధికారులు అధ్యక్ష నివాసానికి చేరుకున్నారు. తొలుత అధ్యక్ష భద్రతా దళాలు వీరిని

మిగతా 2లో..

బలవంతంగా మద్యం తాగించి యువతిపై అత్యాచారం'..

### హరియాణా భాజపా అధ్యక్షుడిపై కేసు

వార్త 2లో

వెనక్కుతగ్గేదేలే.. మళ్లీ ఉధృతమవుతున్న

## రైతు ఉద్యమం

70 ఏళ్ల వృద్ధ రైతు దీక్షకు మద్దతుగా 111 మంది రైతుల ఆమరణ దీక్ష

న్యూఢిల్లీ(జనంసాక్షి): పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ పంజాబీ రైతు జగ్జిత్ సింగ్ దల్లేవాల్.. గత 50 రోజుల నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. హర్యానాలోని ఖనౌరి బోర్డర్ సమీపంలో ఆ 70 ఏళ్ల వృద్ధ రైతు దీక్ష చేస్తున్నాడు. ఆ రైతుకు

మిగతా 2లో..



## పీఠమెక్కనున్న ట్రంప్



- 20న అమెరిక అధ్యక్ష బాధ్యతల స్వీకరణ
- భారీగా ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం
- ప్రపంచవ్యాప్తంగా ప్రముఖుల రాక
- భారత్ తరఫున జైశంకర్ హాజరు

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడిగా మరోమారు విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ జనవరి 20న అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. అధికార మార్పిడి

మిగతా 2లో..



## రోబో పరేడ్..

మహారాష్ట్రలోని పుణె సిటీలో ఆర్మీ రోబోటిక్ డాగ్స్‌తో మార్చ్‌పాస్ట్

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత 77వ సైనిక దినోత్సవం సందర్భంగా మహారాష్ట్రలోని పుణె సిటీలో నిర్వహించిన ఆర్మీ పరేడ్‌లో రోబోటిక్ డాగ్స్‌తో చేసిన మార్చ్‌పాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రస్తుతం ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. పుణెలోని బాంబే ఇంజినీరింగ్ గ్రూప్‌కు చెందిన పరేడ్ మైదానంలో ఈ మార్చ్ ఫాస్ట్ జరిగింది. భారత సైన్యానికి చెందిన ప్రత్యేక టీమ్ ఈ మార్చ్‌పాస్ట్ నిర్వహించింది. ఈ టీమ్‌లోని సైనికులు నాలుగు పాదాలతో కూడిన 8 రోబోలను రిమోట్‌తో ఆపరేట్ చేశారు. మార్చ్ ఫాస్ట్‌లో ఈ రోబోలు క్రమశిక్షణతో ముందుకు సాగుతుండగా వాటి వెనుకే సైనికులు నడిచారు. రోబోల నడక శైలి వీక్షకులను ఆకట్టుకుంది. నాలుగు పాదాలతో కూడిన ఈ రోబోలను భారత సైన్యం అత్యాధునిక సాంకేతికతతో తయారు చేయించింది. రక్షణ రంగ పరిశీలకులు వీటిని సాంకేతికతను సంతరించుకున్న కుక్కలు అని అంటున్నారు. ఈ రోబోలను ఢిల్లీకి

మిగతా 2లో..

భారత సముద్ర తీరం ఇక..

## శత్రుదుర్భేధ్యం

అధునాతన యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లను జాతికి అంకితం చేసిన మోడీ

సైనికుల సేవలు ఎనలేనివి • నౌకాదళం మరింత బలోపేతం • అత్యాధునిక ఆస్త్రాలను జోడిస్తున్నామని వెల్లడి




ముంబయి(జనంసాక్షి):భారత నౌకాదళ అమ్ములపొదిలో మరో మూడు అస్త్రాలు చేరాయి. అధునాతన యుద్ధ నౌకలు, ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లను బుధవారం నౌకాదళంలో చేర్చుకున్నారు. ముంబయిలోని నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరై.. యుద్ధ నౌకలను జాతికి అంకితం చేశారు. వీటి రాకతో నౌకదళ బలం మరింత పటిష్టం కానుంది. ఆయుధ తయారీ, సముద్ర భద్రతలో అగ్రగామి కావాలని ముందుకుసాగుతున్న భారత్ లక్ష్యసాధనకు ఇది పెద్ద ముందడుగుగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'దేశ రక్షణలో సైనికుల సేవలు ఎనలేనివి. దేశ భద్రత కోసం వారు ప్రాణాలను సైతం లెక్క చేయరు. నౌకాదళం బలోపేతానికి నేడు మరో ముందడుగు పడింది. తొలిసారిగా.. రెండు యుద్ధ నౌకలు, జలాంతర్గామిని ఒకేసారి మనం ప్రారంభించుకున్నాం. ఇవన్నీ భారత్‌లో తయారైనవే. వీటితో నౌకాదళానికి నూతన బలం, దార్శనికత అందుతుంది' అని వివరించారు. 'సముద్ర తీర రక్షణకు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. గత పదేళ్లలో 33 యుద్ధ నౌకలు, ఏడు జలాంతర్గాములు నేవీలో చేరాయి. రక్షణరంగ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నాం. దేశ రక్షణ ఉత్పత్తుల విలువ రూ. 1.25 లక్షల కోట్లు దాటింది. మన రక్షణ పరికరాలను 100కు పైగా దేశాలకు ఎగుమతి

మిగతా 2లో..

# పార్లమెంటు దిగ్గజం జైపాల్‌రెడ్డికి సీఎం రేవంత్ ఘన నివాళి

దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో సమన్వయం చేసి అతికీలక పాత్ర పోషించిన మట్టి బిడ్డ అని కొనియాడారు.తెలంగాణ పల్లె నుంచి ఢిల్లీ దాకా ఎదిగిన జైపాల్ రెడ్డి దేశంలో అరుదైన రాజకీయ వేత్త అని కొనియాడారు. రాజకీయాల్లో నిష్కళంక నేతగా, విలువలకు ప్రతీకగా జైపాల్ రెడ్డి గారు నిలిచారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో శాసనసభ్యుడిగా లోక్‌సభ సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా, విపక్ష నేతగా, కేంద్ర మంత్రిగా నిర్వహించిన అనేక పదవులకు జైపాల్ రెడ్డి వన్నె తెచ్చారని అన్నారు.యునైటెడ్ ఫ్రంట్ కామన్ మినిమం ప్రోగ్రామ్ రూపొందించడం ద్వారా దేశ ప్రాధాన్యాలను గుర్తించిన నాయకుడని శ్లాఘించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఆ ప్రాంతానికి నీరివ్వాలని మొట్టమొదట తలచిన నాయకుడు జైపాల్ రెడ్డిఅని గుర్తుచేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేయడానికి జైపాల్ రెడ్డే పునాదులు వేశారని అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి వారి ఖరారు చేస్తూ ఇటీవల మంత్రిమండలి తీర్మానించిన విషయాన్ని ప్రస్తావించారు. వారు కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే హైదరాబాద్ మెట్రో రైలు మంజూరైందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. విశిష్ట విలువలతో జీవితాంతం ప్రజాసేవకే అంకితమైన జైపాల్ రెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న ఈ తరుణంలో వారి ఆశయాలు, ఆకాంక్షలను ముందుకు తీసుకుపోవడంలో ప్రతి ఒక్కరు పాటుపడాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# సెమీకండక్టర్ల ఉత్పత్తిలో తెలంగాణకు సహకరించండి



**న్యూఢిల్లీ,జనవరి15(జనంసాక్షి):** సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో తెలంగాణకు సహకరించాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, కేంద్రం కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి శ్రీధర్‌బాబు.. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ప్రత్యేకంగా కలిశారు.తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీకి ముందుకొచ్చే పరిశ్రమలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, ఇతర అంశాలను కేంద్ర మంత్రికి శ్రీధర్ బాబు వివరించారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందని తెలిపారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. పలు ప్రముఖ సంస్థలు తెలంగాణలో తమ డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తాయని, ఇలాంటి తరుణంలో డేటా భద్రత కీలకంగా మారిందన్నారు. అందుకే 'నేషనల్ డిజాస్టర్ రికవరీ జోన్' ఏర్పాటు చేయాల్సి ఉందని ఈ అంశంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 24న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బయో ఏషియా సదస్సుకు హాజరు కావాలని కోరారు.

# ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం

అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సహా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాష్ట్రాల చీఫ్‌లు మొత్తం 400 మంది లీడర్లు పాల్గొన్నారు. కాగా, గత ఐదు దశాబ్దాలుగా అక్బర్ రోడ్డు 24వ నెంబర్ బంగ్లాలో ఏఐసీసీ కార్యకలాపాలు కొనసాగాయి. అయితే, ప్రభుత్వ బంగ్లాల్లో పార్టీ కార్యాలయాలు ఉండకూడదన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో అందుకు అనుగుణంగా అన్ని పార్టీలు సొంత భవనాలను నిర్మించుకుంటున్నాయి. ఇక 2008లో దీన్ దయాల్ ఉపాధ్యాయ మార్గ్‌లో కాంగ్రెస్ పార్టీ నూతన భవన నిర్మాణానికి కేంద్రం స్థలం కేటాయించింది. దీంతో 2009లో కార్యాలయం నిర్మాణ పనులు మొదలు పెట్టగా.. 15 ఏళ్లుగా ఈ నిర్మాణ పనులు సాగాయి.

కుటుంబ సమేతంగా వచ్చిన రేవంత్ రెడ్డి

ఏఐసీసీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబసమేతంగా హాజరయ్యారు. గురు, శుక్రవారం రెండ్రోజులపాటు ఢిల్లీలోనే ఉంటారు. అనంతరం విదేశీ పర్యటనకు బయలుదేరి వెళతారు. కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం కాంగ్రెస్ పెద్దలతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. తెలంగాణ మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీ కార్యవర్గం కూర్పు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలపై వారితో చర్చించనున్నట్లు సమాచారం. అలాగే పలువురు కేంద్ర మంత్రులను సీఎం కలవనున్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి వారితో మాట్లాడనున్నారు. కేంద్రమంత్రులను కలిసే సమయంలో సీఎం వెంట ఆయా శాఖల రాష్ట్ర మంత్రులు ఉంటారు. అనంతరం గురువారం రాత్రి ఢిల్లీ నుంచి సింగపూర్ పర్యటనకు రేవంత్ రెడ్డి వెళతారు. సింగపూర్‌కు చేరుకున్న తర్వాత రేవంత్ బృందం శుక్రవారం అక్కడ జరిగే బిజినెస్ మీట్‌లో పాల్గొంటారు. పలువురు పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అవుతారు.

# బలవంతంగా మద్యం తాగించి యువతిపై అత్యాచారం..

హరియాణా భాజపా అధ్యక్షుడిపై కేసు

సోలన్(జనంసాక్షి):హరియాణా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ లాల్ బడోలీ, గాయకుడు రాకీ మిట్టల్ అకా జై భగవాన్‌పై గ్యాంగ్ రేప్ కేసు నమోదైంది. ఢిల్లీకి చెందిన ఓ యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ గ్యాంగ్ రేప్ ఘటన 2023 జులై 3న జరిగినట్లు యువతి పేర్కొంది. తన యాజమాని, స్నేహితురాలితో కలిసి హిమాచల్ ప్రదేశ్‌కు వచ్చినప్పుడు ఈ అఘాయిత్యం చోటుచేసుకున్నట్లు తెలిపింది."హిమాచల్‌లోని కసౌలీకి నా స్నేహితురాలితో కలిసి పర్యాటకురాలిగా వెళ్లాను. ఓ హోటల్‌లో బడోలీ, మిట్టల్ కలిశారు. తాను నటిగా మారేందుకు అవకాశం ఇస్తానని, తను తీయబోయే ఆల్బమ్‌లో అవకాశం ఇస్తానని మిట్టల్ చెప్పారు. బడోలీ తను సీనియర్ రాజకీయ నాయకుడని, తనకు పెద్ద స్థాయిలో పరిచయాలు ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని ప్రలోభపెట్టారు. అనంతరం తమకు బలవంతంగా మద్యం తాగించారు. నా స్నేహితురాలిని బెదిరించి పక్కకు తీసుకెళ్లారు. అనంతరం నాపై ఇద్దరు కలిసి అఘాయిత్యం చేశారు. ఈ విషయం ఎక్కడైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. నా నగ్న చిత్రాలు, వీడియోలు తీసుకున్నారు" అని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది.నిందితులపై 376డి, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సోలన్ ఎస్పీ గౌరవ్ సింగ్ తెలిపారు. ఇంతవరకు ఎవరినీ అరెస్టు చేయలేదని, విచారణ చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.

# దక్షిణ కొరియా అధ్యక్షుడి అరెస్టు

అడ్డుకున్నాయి. కొంతసేపు ప్రతిష్టంభన నెలకొన్న తర్వాత దర్యాప్తు అధికారులు అధ్యక్ష నివాసం లోపలికి వెళ్లి యూన్ సుక్ యోల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం భారీ భద్రత నడుమ ఆయనను అక్కడినుంచి తరలించారు. గతంలో యోల్‌ను అరెస్టు చేసేందుకు ఓసారి ప్రయత్నించగా.. పెద్దఎత్తున ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఆ పరిణామాలను దృష్టిలోఉంచుకొని నేడు భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ.. గతేడాది డిసెంబరులో దక్షిణ కొరియా అధ్యక్షుడు 'ఎమర్జెన్సీ మార్షల్ లా' విధించారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో యూన్ సుక్ తన ప్రకటనను విరమించుకున్నా.. ఆయన తన పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

# నీటి కేటాయింపుల్లో మన వాదన బలంగా వినిపించండి



**న్యూఢిల్లీ,జనవరి15(జనంసాక్షి):** తెలంగాణకు అంతరాష్ట్ర నదీ జలాల వివాద చట్టం (ఐఎస్ఆర్‌డబ్ల్యూడీఏ)-1956 సెక్షన్ 3 ప్రకారం నీటి కేటాయింపులు చేపట్టాలనే విషయంపై కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-ఎఎ (కేడబ్ల్యూడీటీ-ఎఎ) ఎదుట బలమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం (ఏపీఆర్ఏ)-2014లోని సెక్షన్ 89 ప్రకారం ప్రాజెక్టులవారీగా నీటి కేటాయింపులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఏపీఆర్ఏ ప్రకారం ఏర్పాటైన అపెక్స్ కౌన్సిల్ సైతం సెక్షన్ 3 ఆధారంగా నీటి పంపకాలు రెండు రాష్ట్రాల మధ్య చేపట్టాలని సూచించిందని సీఎం తెలిపారు. కేడబ్ల్యూడీటీ-ఎఎ తదుపరి విధివిధానాలపై (ఫర్‌దర్ టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్) ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించినా అత్యున్నత న్యాయస్థానం ఎటువంటి స్టే ఇవ్వని విషయాన్ని సీఎం గుర్తు చేశారు. రాష్ట్ర నీటి పారుదల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటి పారుదల శాఖ) ఆదిత్యనాథ్ దాస్, నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా తదితరులు పాల్గొన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు చేపట్టడంపై కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు గోదావరి, కృష్ణా నది యాజమాన్య బోర్డులకు (జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీ) తెలంగాణ తరపున అభ్యంతరాలు తెలుపుతూ లేఖలు రాయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల్లో ఏ రాష్ట్రమైనా ఏ నదిపైనైనా ప్రాజెక్టు నిర్మించాలంటే జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీలతో పాటు పొరుగు రాష్ట్రానికి సమాచారం ఇవ్వాలనే విషయాన్ని లేఖల్లో ప్రస్తావించాలని సీఎం సూచించారు. పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలం ముంపు విషయంపై హైదరాబాద్ ఐఐటీతో అధ్యయనం చేయించే అంశాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేయించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమ్మక్క సారక్క బ్యారేజీ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు అనుమతులు సాధించే ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం సూచించారు.

# ఆర్ఎస్ఎస్ అడుగుజాడల్లో బీఆర్ఎస్

- రెండింటికీ తేడా లేదు
- భారాసపై మండిపడ్డ సీఎం రేవంత్ రెడ్డి
- మా ప్రభుత్వం చట్ట ప్రకారం ముందుకెళుతోంది
- మాది పక్షపాత ధోరణి కాదు
- బీజేపీ జూటా మాటలు పార్టీఅని ఎద్దేవా..

పెట్టాల్సిన అవసరం లేదన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ స్వాతంత్ర్య విషయంలో మోహన్ భగవత్ వెంట ఉంటారా..? లేక దేశం కోసం ప్రాణాలు అర్పించిన స్వాతంత్ర్య సమర యోధుల పక్షాన నిలుస్తారా..? అన్నది తేల్చాలని సీఎం డిమాండ్ చేశారు. 140 ఏండ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు సొంత భవనం కల సాకారమైందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏ స్వార్థం లేకుండా దళితులు, గిరిజనులు, మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పనిచేస్తోందని అన్నారు. నిన్న గాక మొన్న వచ్చిన ప్రాంతీయ పార్టీలతో పాటు బీజేపీ సైతం సొంత కార్యాలయ భవనాలను సమకూర్చుకున్నాయని చెప్పారు. ప్రాంతీయ పార్టీల ఆర్థిక స్థితిగతులు ఏవిధంగా ఉన్నాయో చూడాలని అన్నారు. దేశ భవిష్యత్తు కోసం ప్రణాళికా రచన ఈ ఆఫీసు నుంచే జరగబోతోందని చెప్పారు.

# ఆంధ్రా,తెలంగాణ రాష్ట్రాలకు ఆరుగురు కొత్త జడ్జిలు

ఉన్న జస్టిస్ సుజయ్‌పాల్‌కు సీజేగా బాధ్యతలు అప్పగిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే బాంబే హైకోర్టు సీజేగా బదిలీ అయ్యారు. 1964 జూన్ 21న జన్మించిన జస్టిస్ సుజయ్‌పాల్ బీకాం, ఎంఏ, ఎల్ఎల్‌బీ పూర్తిచేసి 1990లో మధ్యప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. పలు బ్యాంకులు, మానవ హక్కుల కమిషన్, బోర్డులకు సేవలు అందించిన ఆయన 2011 మే 27న మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా... 2014 ఏప్రిల్ 14న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుతో 2024 మార్చి 21న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. తాజాగా ఆయన హైకోర్టు సీజేగా నియమితులయ్యారు.

# మళ్లీ ఉధృతమవుతున్న రైతు ఉద్యమం

తోడుగా ఇప్పుడు మరో 111 మంది పంజాబీ రైతులు ఆమరణ దీక్షకు పూనుకున్నారు. నల్ల దుస్తులు ధరించి ఇవాళ నిరసనకు దిగారు. రైతుల చేపడుతున్న ఆమరణ దీక్షను అడ్డుకునేందుకు భారీగా పోలీసుల్ని మోహ రించారు. దల్లేవాల్ ఆమరణ దీక్ష నేటితో 51వ రోజుకు చేరుకున్నది. ఆయన కేవలం నీళ్లు సేవిస్తూ ఇన్నాళ్లు గడిపారు. ఇప్పుడు నీళ్లు తాగడం కూడా ఇబ్బందిగా మారినట్లు పంజాబీ రైతులు పేర్కొన్నారు. అవయవాలు దెబ్బతినే అవకాశం ఉన్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. దల్లేవాల్ ఏమీ తినడం లేదని ఇటీవల రైతులు తెలిపారు. సీనియర్ రైతు దల్లేవాల్ ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు డాక్టర్లు చెప్పారు. అతని కీటోన్ స్థాయి ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. మజిల్ మాస్ కూడా పడిపో యినట్లు వెల్లడించారు. ఇవాళ మధ్యాహ్నం రెండు గంటల నుంచి 111 మంది రైతులు కొత్తగా ఆమ రణ దీక్షకు దిగినట్లు రైతు నేత అభిమన్యు కోహర్ తెలిపారు. దల్లేవాల్ కన్నా ముందే తమ ప్రాణాలు బలి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆ రైతులు చెప్పారు.



# కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ ముఖ్యనేతల కీలక సమావేశం

**న్యూఢిల్లీ,జనవరి15(జనంసాక్షి):** సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నివాసంలో తెలంగాణ ముఖ్యనేతల కీలక సమావేశం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. సుమారు గంటన్నరపాటు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేసీ వేణుగోపాల్‌తో చర్చించారు.ఫిబ్రవరి తొలి లేదా రెండో వారంలో రాష్ట్రంలో రాహుల్ గాంధీ సభ ఉంటుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. కేసీ వేణుగోపాల్‌తో కాంగ్రెస్ నేతల భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "సూర్యాపేట లేదా ఖమ్మంలో రాహుల్ ఉండే అవకాశముంది. ఈ నెలాఖరులోపు నామినేటెడ్, కార్పొరేషన్ ఛైర్మన్ల భర్తీ ఉంటుంది. కేబినెట్ విస్తరణపై సీఎం, అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది. పీసీసీ కార్యవర్గం కూర్పుపై చర్చించాం. ప్రజల్లో ఉన్నవారికే డీసీసీ అధ్యక్ష పదవులు" ఇస్తాం అని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

# భారత్, యూఎస్ ప్రయోజనాలను దెబ్బతీసేయత్నం

**కేంద్రానికి అత్యున్నత స్థాయి అధికారుల విచారణ కమిటీ నివేదిక**

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్, అమెరికా భద్రతా ప్రయోజనాలను దెబ్బతీసే దురుద్దేశంతో కొన్ని శక్తులు పని చేస్తున్న విషయాన్ని అత్యున్నత స్థాయి అధికారుల విచారణ కమిటీ గుర్తించింది.దర్యాప్తులో తెలిసిన అంశాలతో రూపొందించిన తుది నివేదికను తాజాగా భారత ప్రభుత్వానికి అందజేసింది. 2023 నవంబరులో ఏర్పాటైన ఈ కమిటీ విచారణకు అవసరమైన కీలక సమాచారాన్ని అమెరికా అధికారులు భారత్‌తో పంచుకున్నారు. కొన్ని వ్యవస్థీకృత నేర బృందాలు, ఉగ్రవాద సంస్థలు, మాదక ద్రవ్యాల ముఠాలు తదితరులు చేస్తున్న కార్యకలాపాల సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నారు.ఈ సమాచారం ఆధారంగా భారత్‌లో ఏర్పాటైన విచారణ కమిటీ స్వతంత్రంగా దర్యాప్తు చేపట్టింది. యూఎస్ అధికారులు ఇచ్చిన లీడ్‌లు తీసుకొని కూపీ లాగింది. భారత్‌లోని పలు విచారణ సంస్థల్లో పని చేస్తున్న అధికారుల నుంచి కూడా విచారణ కమిటీ కీలక సమాచారం రాబట్టింది.

# విచారణకు రండి

17న హాజరవుతానని కౌశిక్‌రెడ్డి తెలిపారు. బంజారా హిల్స్ ఇన్‌స్పెక్టర్ విధులు అడ్డుకోవడం, బెదిరింపుల వ్యవహారంలో ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ ఫిర్యాదు మేరకు గతంలో కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్‌ను దర్యాప్తు అధికారిగా డీసీపీ విజయ్‌కుమార్ నియమించారు.

## న్యూఢిల్లీ స్థానానికి కేజ్రీవాల్ నామినేషన్ దాఖలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):వచ్చే నెల 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఎన్నికలకు సంబంధించి ఈ నెల 10న నోటిఫికేషన్ విడుదల కాగా.. 17వ తేదీ వరకు నామినేషన్‌లకు అవకాశం కల్పించారు. ఇక గడువు సమీపిస్తుండటంతో రాజధానిలో నామినేషన్‌లు జోరందుకున్నాయి. ఇప్పటికే కల్కాజీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఢిల్లీ సీఎం అతిశీ నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నామినేషన్ దాఖలు చేశారు. కేజ్రీవాల్ న్యూ ఢిల్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇవాళ నామినేషన్ దాఖలు చేశారు. ఇవాళ ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి కన్నాట్ ప్రాంతంలోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రిటర్నింగ్ ఆఫీస్‌కు ర్యాలీగా వెళ్లి.. అక్కడ నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ ఆఫీసర్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ప్రజలను కోరారు. కాగా ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు.

# మళ్లీ చిక్కుల్లో కేజ్రీవాల్

కాగా.. 70 శాసనసభ స్థానాలు ఉన్న ఢిల్లీలో ఫిబ్రవరి 5న ఒకే విడతలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడికానున్నాయి.. ఈ క్రమంలోనే.. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసు విచా రణకు కేంద్రం ఈడీకి అనుమతి ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. అయితే.. ఢిల్లీ లిక్కర్ కేసు సూత్రదారి, కింగ్‌పిన్ ఢిల్లీ మాజీ సీఎం కేజీవ్రాలే అంటూ ఆరోపణలు వచ్చాయి. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ 2021-22లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఈడీ కేసు నమోదు చేసింది.. ఈ కేసులో కేజ్రీవాల్ సహా పలువురిని ఈడీ అరెస్టు చేయడంతోపాటు విచారించింది.. కాగా.. 2024 మార్చి 21న కేజ్రీవాల్‌ను ఇఆ మనీలాండరింగ్ కేసులో అరెస్టు చేసింది. ఇదే కేసులో జూన్ 26న అఃఎ కూడా రంగంలోకి దిగి అవినీతి కేసులో అరెస్టు చేసింది. చివరికి సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు కేజీవ్రాల్‌కు బెయిలిచ్చింది. ఈకేసులో మనీష్ సిసోడియా 17 నెలలపాటు జైల్లో ఉన్నారు. ఇప్పుడు తాజా ఈడీ విచారణకు అనుమతి నేపథ్యంలో.. ఢిల్లీ రాజకీయాలు ఉత్కంఠగా మారాయి. మనీలాండరింగ్ కేసులో మనీష్ సిసోడియాను కూడా ఇఆ ప్రాసిక్యూట్ చేయబోతోందిఅసెంబ్లీ ఎన్నికలకు ముందు మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ను విచారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు కేంద్రం అనుమతివ్వడాన్ని ఆమ్‌ఆద్మీ పార్టీ వ్యతిరేకించింది.

# కేటీఆర్‌కు సుప్రీంలో చుక్కెదురు

డిస్మిస్ చేశారు. పిటిషన్ వెనక్కి తీసుకుని.. మళ్లీ హైకోర్టును ఆశ్రయించేందుకు అవకాశం ఇవ్వాలని కేటీఆర్ తరపు న్యాయవాది కోరారు. పిటిషన్ విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పించిన ధర్మాసనం.. మళ్లీ హైకోర్టుకు వెళ్లే స్వేచ్ఛ ఇవ్వలేమని స్పష్టం చేసింది. దీంతో పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని కేటీఆర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. విచారణలో భాగంగా కేటీఆర్ తరపున న్యాయవాది సిదార్థ వాదనలు వినిపించారు. ఈ ఫార్ములా కారు రేసు కేసులో హెచ్ఎండీఏను, ఇతరులను పేర్కొనలేదని కేవలం ఇద్దరు అధికారులను, కేటీఆర్‌ను మాత్రమే నిందితులుగా చేర్చారని కోర్టు ముందు ప్రస్తావించారు. ఇది పూర్తిగా రాజకీయ కక్షసాధింపు కేసు అని.. కేటీఆర్ ఒక్క రూపాయి తీసుకున్నారని ఎవరూ చెప్పడం లేదని న్యాయవాది తెలిపారు. ఇలాంటప్పుడు అవినీతి నిరోధక చట్టంలోని 13(1)ఏ ఎలా వర్తిస్తుందని.. ఇందులో పీసీ యాక్ట్ 13(1ఎ) వర్తించనే వర్తించదని కేటీఆర్ తరపు న్యాయవాది వాదించారు. వెంటనే జోక్యం చేసుకున్న జస్టిస్ బేలా త్రివేది.. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఎలాంటి జోక్యం చేసుకోబోమని స్పష్టం చేశారు. దీంతో ఈ కేసుకు సంబంధించి సుప్రీం కోర్టులో కాస్త ఊరట లభిస్తుందని భావించిన కేటీఆర్‌కు ఎదురుదెబ్బే తగిలింది. సుప్రీం నిర్ణయంతో ఈ కేసులో ఏసీబీకి మరింత దూకుడు పెంచే అవకాశం ఉంది. అయితే కేటీఆర్ కంటే ముందే రాష్ట్ర ప్రభుత్వం కూడా సుప్రీంలో కేవియట్ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఒకవేళ కేటీఆర్ సుప్రీం కోర్టును ఆశ్రయిస్తే.. విచారణ సందర్భంగా ముందు తమ వాదనలు వినాలని తెలంగాణ ప్రభుత్వం కేవియట్ పిటిషన్‌ను ముందస్తుగానే దాఖలు చేసింది. హైకోర్టులో క్వాష్ పిటిషన్ నిరాకరణకు గురైనప్పటికీ.. సుప్రీం స్టే విధిస్తుందని కేటీఆర్ భావించినట్లు తెలుస్తోంది. కానీ హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌లో తాము జోక్యం చేసుకునేది లేదని సుప్రీం ధర్మాసనం తేల్చి చెప్పడంతో ఏసీబీ మరోసారి నోటీసులు ఇస్తే ఆ విచారణకు కేటీఆర్ ఖచ్చితంగా హాజరుకావాల్సి ఉంటుంది. గతంలో ఈ కేసుకు సంబంధించి కేటీఆర్‌ను దాదాపు ఎనిమిది గంటల పాటు ఏసీబీ విచారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుప్రీం కోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ అయిన నేపథ్యంలో.. మాజీ మంత్రి అరెస్ట్ తప్పదనే వార్తలు వినిపిస్తున్నాయి. కాగా.. ఈ కేసుకు సంబంధించి ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌తో పాటు, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్‌ను ఈడీ, ఏసీబీ అధికారులు విచారించిన విషయం తెలిసిందే. వీరి నుంచి పలు కీలక సమాచారాన్ని ఏసీబీ, ఈడీ అధికారులు రాబట్టినట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు మరోసారి నోటీసులు ఇచ్చేందుకు ఏసీబీ సిద్ధమైంది. ఆయనతోపాటు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు మరో సారి నోటీసులు ఇచ్చే యోచనలో ఉంది. సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ కావడంతో నోటీసులపై ఏసీబీ ముందుకెళ్లే అవకాశం ఉంది.



# భారత సముద్ర తీరం శత్రుదుర్భేద్యం

చేస్తున్నాం. మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, ఉగ్రవాదం నుంచి సముద్రతీరాలను రక్షించడంలో మనం ప్రపంచ భాగస్వామిగా మారాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. ఐఎన్ఎస్ సూరత్.. పీ15బీ గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి చేస్తున్న నాలుగో యుద్ధనౌక. ప్రపంచంలోనే భారీ, అత్యాధునిక డిస్ట్రాయర్ యుద్ధ నౌకల్లో ఇదొకటి. ఇందులో స్వదేశీ వాటా 75 శాతం. ఈ యుద్ధ నౌకలో అధునాతన ఆయుధ-సెన్సర్ వ్యవస్థలు ఉన్నాయి. నెట్‌వర్క్ సెంట్రిక్ సామర్థ్యం దీని సొంతం.ఐఎన్ఎస్ నీలగిరి.. పీ17ఏ స్టెల్త్ ఫ్రిగేట్ ప్రాజెక్టులో తొలి యుద్ధనౌక. శత్రువును ఏమార్చే స్టెల్త్ పరిజ్ఞానంతో దీన్ని తయారుచేశారు. ఐఎన్ఎస్ వాఘ్‌షీర్.. పీ75 కింద రూపొందిస్తున్న ఆరో, చివరి జలాంతర్గామి. ఫ్రాన్స్‌కు చెందిన నేవల్ గ్రూప్ సహకారంతో దీన్ని అభివృద్ధి చేశారు.

# రోబో పరేడ్..

చెందిన ఏరోఆర్క్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తయారు చేసింది. అందువల్ల వీటికి 'ఆర్కవీ మ్యూల్' అని పేరుపెట్టారు. ఇప్పటివరకు ఏరోఆర్క్ కంపెనీ నుంచి భారత సైన్యం దాదాపు 100 రోబోలను కొనుగోలు చేసింది. ఈ రోబోలకు పెట్టిన పేరులోని అనే పదానికి సవివర అర్థం 'మల్టీ యుటిలిటీ లెగ్డ్ ఎక్విప్‌మెంట్'. ఈ రోబోలను రిమోట్‌తో ఆపరేట్ చేయవచ్చు. స్వయం ప్రతిపత్తితోనూ ఇవి పనిచేయగలవు. పెరీమీటర్లు, సైనిక పహారా, రసాయన సంబంధిత ప్రమాదాలు, బయోలాజికల్ దాడులు, న్యూక్లియర్ పదార్థాల పేలుళ్లు సంభవించినప్పుడు ఆర్కవీ మ్యూల్ రోబోలను మోహరిస్తారు. బాంబులను నిర్వీర్యం చేసేందుకు సైతం వీటిని వినియోగిస్తారు. ఆర్కవీ మ్యూల్ రోబోలో ప్రధానంగా ఐదు భాగాలు ఉన్నాయి. ఈ రోబోలోని కంప్యూట్ బాక్స్ అనే భాగం రోబోకు మెదడులా సాయం చేస్తుంది. ఈ రోబోలో ఒక బ్యాటరీ ఉంటుంది. దీన్ని ఒకసారి ఛార్జ్ చేస్తే రోబో 20 గంటలపాటు పనిచేస్తుంది. రోబో తల వెనుక భాగంలో సెన్సార్స్ ఉంటాయి. వీటి సాయంతో పరిసరాల్లో ఏమేం ఉన్నాయనేది రోబో చూస్తుంది. కాళ్ల సాయంతో రోబో నడకను సాగిస్తుంది. సెకనుకు 3 మీటర్ల వేగంతో ఇవి నడవగలవు. ఈ రోబో బరువు 51 కేజీలు ఉంటుంది.

# పీఠమెక్కనున్న ట్రంప్

కార్య క్రమం సులువుగా సాగేలా బైడెన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అమెరికా అధ్యక్ష బాధ్య తల స్వీకార కార్యక్రమానికి బిలియనీర్లు, టెక్ దిగ్గజాలు ఎలాన్ మస్క్, మార్క్ జుకర్‌బర్గ్ , జెఫ్ బెజోస్ హాజరవుతారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వీరే కాకుండా అనేకమంది దేశవిదేశాల ప్రతినిధులు, ప్రముఖులు హాజ రవుతారు. జనవరి 20న అమెరికా 47వ నూతన అధ్యక్షు డిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి అమెరికా క్యాపిటల్ భవనం లోని వెస్ట్ ఫ్రంట్ ప్రాంతం వేదిక కానుంది. ఈ కార్యక్రమానికి భారీఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రపంచ దేశాల అధినేతలు ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి రానున్నట్లు సమాచారం. కాగా ఈ కార్యక్రమంలో భారత్ తరఫున విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ హాజరుకానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్‌కు, ట్రంప్‌నకు పొసిగేది కాదు. బెజోస్ యాజమాన్యంలోని వాషింగ్టన్ పోస్ట్ దిన పత్రిక ట్రంప్ విధానాలను విమర్శించేది. మెటా అధిపతి మార్క్ జుకర్‌బర్గ్‌కు, ట్రంప్‌నకు మధ్య కూడా విభేదాలు ఉండేవి. 2021లో అమెరికా పార్లమెంటు భవనంపై ట్రంప్ అనుయాయులు దాడి చేయడంతో ఆయన్ను ఫేస్ బుక్ నుంచి బహిష్కరించారు. 2023లో ట్రంప్ ఫేస్ బుక్ ఖాతాను పునరుద్ధరించారు. అయినా జుకర్ బర్గ్‌పై ట్రంప్ విరుచుకుపడేవారు. కానీ, ఇప్పుడు ఉభయుల మధ్య సయోధ్య సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ట్రంప్ తిరిగి అధ్యక్షుడిగా ఎన్నికవడంతో ఈ టెక్ దిగ్గజాలు పాత విభేదాలను పక్కనపెట్టి ఆయనకు దగ్గరవుతున్నారు. ట్రంప్ పదవీ స్వీకార సమయంలో వేడుకలు, ఇతర ప్రారంభోత్సవ కార్యక్రమాల నిర్వహణ నిధికి ఇప్పటికే జెఫ్ బెజోస్, జుకర్ బర్గ్ మొదలైనవారు విరాళాలు ఇచ్చారు. అమెజాన్ ప్రైమ్‌లో ట్రంప్ పదవీ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ప్రసారం చేయనుంది.

## నిషేధించినా ఆగని చైనా మంజా విక్రయాలు

- చైనా మాంజాతో ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఆసుపత్రికి తరలింపు

హైదరాబాద్, జనవరి 15 (జనంసాక్షి) : చైనా మాంజా కారణంగా కుటుంబాల్లో విషాదాన్ని మిగుల్చుతోంది. కొంతమంది ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు తీవ్రగాయాల పాలవుతున్నారు. తాజాగా కామారెడ్డిలోని రామారెడ్డిలో బైక్‌పై వెళ్తున్న జావెద్ అనే వ్యక్తి గొంతుకు చైనా మాంజా తగిలి తీవ్ర రక్తస్రావం అయింది. గమనించిన స్థానికులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. జావెద్ సైలన్ బాబా కాలనీకి చెందిన వాసిగా గుర్తించారు. మరో ఘటనలో హైదరాబాదర్‌లోని నారాయణగూడ పీఎస్ లిమిట్స్‌లో మరో ప్రమాదం చోటు చేసుకుంది. లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీస్‌గా పని చేస్తున్న శివరాజ్ విధులు ముగించుకొని నారాయణగూడ ఫ్లైఓవర్ నుంచి దిగుతుండగా చైనా మాంజా మెడకు చుట్టుకుకోవడంతో కొంత మేర చర్మం చీలిపోయింది. క్షతగాత్రుడిని చికిత్స కోసం ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

## గుర్రంపోడు పీహెచ్‌సీ సిబ్బంది సస్పెన్షన్

- అనధికారికంగా విధులకు గైహాజరైనందుకుగాను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చర్యలు



గుర్రంపోడు, జనవరి 15 (జనంసాక్షి) : ముందస్తు అనుమతి లేకుండా గుర్రంపోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సిబ్బంది మొత్తానికి మొత్తం విధులకు గైర్హాజరు కావడంపై ఆగ్రహించిన జిల్లా కలెక్టర్ గుర్రంపోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది అందరిని ఉద్యోగం నుంచి తొలగించడం , రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులను విధుల నుండి సస్పెండ్ చేశారు. బుధవారం ఆమె గుర్రంపోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ సందర్భంగా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ తో సహా ఎవరు విధులలో లేరు అందరూ విధులకు గైర్హాజరయ్యారు .ప్రభుత్వం బుధవారం ఎలాంటి సెలవును ప్రకటిం చనప్పటికీ బాధ్యత లేకుండా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మొత్తం ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడం శోచనీయమని కలెక్టర్ అన్నారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం హెల్త్ అధికారి హరిలాల్ మాత్రం ఉప నియామకంపై ఇతర చోట పని చేస్తున్నారు. కాంటాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న ఫార్మసిస్టు శ్యామ్, ల్యాబ్ టెక్నీషియన్ సంధ్య, డేటా ఎంట్రీ ఆపరేటర్ మాధవి, అటెండర్ శ్రీని వాస్, అటెండర్, అరుణ జ్యోతి, అటెండర్ ఎల్లమ్మ లను ప్రభుత్వ ఉద్యోగాల నుండి తొలగిస్తున్నట్లు తెలిపారు. అలాగే అటెండర్ లక్ష్మీనారాయణ, ఫార్మసిస్ట్ భాగ్యమ్మ రెగ్యులర్ ఉద్యోగులను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే ప్రతి ఉద్యోగిపై ఇలాంటి చర్యలే తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర ప్రభు త్వం, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత నిస్తున్నప్పటికీ ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని గాలికి వదిలేసి సిబ్బంది మొత్తం గైర్హాజరు కావడం బాధాక రమని ,అందువల్లనే అందరినీ ఉద్యోగాల నుంచి తొలగించడం లేదా విధుల నుండి సస్పెండ్ చేశామని తెలిపారు.

## రాయితీపై వ్యవసాయ పనిముట్లు ఇవ్వండి

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు రైతు కమిషన్ చైర్మెన్ లేఖ**



హైదరాబాద్, జనవరి 15 (జనంసాక్షి) : రాయితీపై వ్యవసాయ పనిముట్లు ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌కు వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి లేఖ రాశారు. ఈనెల 9న నిజామాబాద్ జిల్లా పర్యటనలో పసుపు రైతుల సమస్యలు తెలుసుకోడానికి రైతు కమిషన్ బృందం, అధికారులు వెళ్లారని, పంటపొలాలల్లో కమిషన్ బృందం పసుపు రైతులతో ముఖాముఖీ చర్చించారని, పంట పెట్టుబడి పెరుగుతుందని పసుపుకు న్యాయమైన ధర రావడంలేదని కమిషన్ ముందు గోడు వెళ్లబోసుకున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పసుపు రైతులకు యాంత్రీకరణ లేకపోవడం వల్ల పండిన పసుపు ను భూమిలో నుండి తీయడం గానీ, మొక్క నుండి పసుపు వేరు చేసిన తర్వాత పసుపు ఆరబోయడానికి కళ్లాలు లేక, పసుపును బెయిల్ చేయడానికి సరైన యంత్రాలు లేక పాత పద్ధతుల్లోనే కట్టెలతో మంటపెట్టి పసుపును మరగబెడుతున్నారని, పసుపు పాలిష్ యంత్రాలు లేక తగినంత మోతాదుల్లో పసుపు పాలిష్ పెట్టలేకపోతున్నారని తెలిపారు. పసుపు పంటలు దేశంలోనే పెద్ద మొత్తంలో సాగయ్యే నిజామాబాద్ జిల్లాలో పాత పద్ధతుల్లో వ్యవసాయం చేయడం వల్ల కూలీల కొరతతో ఆధునాత యంత్రాలు లేక పెట్టుబడి పెట్ట లేక రైతులు నష్టపోతున్నారు. 2007, 08 లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అప్పటి సీఎం రాజశేఖర్ రెడ్డి హయాంలో 40 ఎకరాల భూమిని పసుపు విత్తన పరిశోధనకు కేటాయించిందని, ఆ కాలంలోనే నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయమని కేంద్రాన్ని కోరిందని, అప్పటి నుండి ఇప్పటి వరకు ప్రభుత్వాలు మారాయని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, కానీ పసుపు పండించే రైతుల పరిస్థితి బాగుపడలేదని తెలిపారు. పై విషయాలను దృష్టిలో పెట్టుకొని వెంటనే పసుపు పండించే రైతులకు యాంత్రీకరణ లో భాగంగా పనిమొట్లను రైతులకు రాయితీ పై అందించాలని వ్యవసాయ శాఖ మంత్రిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## పసుపు బోర్డు ఏర్పాటు హర్షణీయం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి



హైదరాబాద్, జనవరి 15 (జనంసాక్షి) : 11 ఏండ్ల నిరీక్షణ తర్వాత నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పసుపు బోర్డును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం హర్షణీయం అని, పసుపు బోర్డు వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి అన్నారు. పసుపు పండించే రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు సరఫరా చేయాలని, కొత్త వంగడాలను రూపొందించాలని, పసుపు విక్రయానికి సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని, ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకోవాలని, పసుపు బై ప్రొడక్ట్స్ అవకాశం రైతులకు ఇవ్వాలని, విదేశాల్లో పసుపు విక్రయానికి రైతులకే అవకాశం ఇవ్వాలని చిన్నారెడ్డి జాతీయ పసుపు బోర్డుకు సూచించారు. కేవలం పార్లమెంటు ఎన్నికల హామీలాగా మిగల్చకుండా నిజాయాబాద్ లో పసుపు బోర్డును ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి చిన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. రైతుల పక్షాన సంపూర్ణ అండగా నిలువాల్సిన బాధ్యత పసుపు బోర్డుకు ఉందని చిన్నారెడ్డి ఈ మేరకు ఒక ప్రకటనలో అన్నారు.

## ఆవడం మండల ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ



బెల్లంపల్లి, జనవరి 15 (జనంసాక్షి) : ఆవడం గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని కోరుతూ మంగళవారం బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం ఆవడం గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. నెన్నెల మండల కేంద్రం దూరంగా ఉండటంతో పది గ్రామపంచాయతీల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారులకు తెలియజేయడం కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినట్లు ఆవడం మండల సాధన సమితి సభ్యులు తెలిపారు. ఆవడంను మండలంగా ప్రకటించేంత వరకు వివిధ రూపాల్లో తన గళం వినిపిస్తామని వారు వివరించారు. ఈకార్యక్రమంలో మండల సాధన సమితి నాయకులు దుర్గం రవీందర్, కటికల మల్లికా దేవి, చెకూర్తి రాజిరెడ్డి, రామగోని వెంకటేశ్వర్లు, సింగిల్ విండో డైరెక్టర్ ఉయ్యాల లింగయ్య, బేతు పాపయ్య, సతీష్, అనిల్, రమేష్, కుమార్, అభి తదితరులు పాల్గొన్నారు.

## చెరువులోకి దూసుకెళ్లిన కారు

- ప్రాణాలతో బయటపడ్డ వ్యక్తి... వీడియో వైరల్



రంగారెడ్డి, జనవరి 15 (జనంసాక్షి) : చెరువులోకి కారు వేగంగా దూసుకెళ్లిన ఘటనలో ఓ వ్యక్తి ప్రాణాలతో బయటపడిన సంఘటన రంగారెడ్డి జిల్లా కేశంపేటలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..షాద్‌నగర్‌కి చెందిన మల్లేశ్వర్ రావు అనే వ్యక్తి తన పౌల్ట్రీ ఫారం నుంచి కారులో తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టి చెరువులోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు మల్లేశ్వర్ రావును సురక్షితంగా బయటకు తీసారు. చెరువులో ఎక్కువ నీళ్లు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.



## నాచారం సురానా వైర్స్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

- తప్పిన ప్రాణాపాయం

హైదరాబాద్, జనవరి15 (జనంసాక్షి) : హైదాబాద్ నాచారం పీఎస్ పరిధిలో అగ్నిప్రమాదం జరిగింది. సురానా వైర్స్ పరిశ్రమలో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అప్రమత్తమైంది. సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుంది. దీంతో మంటలు అదుపులోకి వచ్చాయి. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.ఇటీవల పరిశ్రమల్లో జరుగుతున్న అగ్నిప్రమాదాలతో భారీగా ఆస్తినష్టం సంభవిస్తుండడంతో పాటు ప్రాణనష్టం కూడా అధికంగానే ఉంటుంది. యాజమాన్యాలు నిబంధనలు పాటించకపోవడం.. భద్రతాప్రమాణాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం ఇందుకు కారణం. పారిశ్రామిక వాడలు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. ఆయా పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో తెలుగు రాష్ట్రాలతోపాటు బీహార్, గుజరాత్, ఒరిస్సా తదితర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. ముఖ్యంగా పటాన్‌చెరు, జిన్నారం, ఐడీఏ బొల్లారం, కంది, హత్నూర, సదాశివపేట తదితర మండలాల్లో భారీ పరిశ్రమలు ఉన్నాయి. ఈ కంపెనీల్లో తరచూ అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు జరుగుతున్నాయి. దీంతో కార్మికుల భద్రత సవాలుగా మారుతోంది.

## బిజెపి నాయకునిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి



మంచిర్యాల ప్రతినిధి జనవరి 15 (జనంసాక్షి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో బిజెపి నాయకుని పై గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి తీవ్రంగా కొట్టారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చేపల మార్కెట్ సమీపంలో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు బిజెపి నాయకుడు మెట్టుపల్లి జయ రామారావు పై దాడి చేశారు. ఈ దాడిలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాల పాలైన జయ రామారావును వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుండి ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. దాడికి సంబంధించిన వివరాలు పూర్తిగా తెలియరాలేదు.

### దాడిని ఖండించిన మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన జయరామ రావు పై జరిగిన దాడి ఘటన తెలుసుకొని మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. దాడిని ఖండించారు. దివాకర్ రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత సంవత్సరం కాలం నుండి మంచిర్యాల నియోజకవర్గంలో జరుగుతున్న దాడులను ఆయన ఖండించారు. బీజేపీ నాయకులు మెట్టుపల్లి జయరామ రావు పై గుర్తు తెలియని దుండగులు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడి స్థానిక టచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జయరామ రావును బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## కోటను సందర్శించిన న్యూఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు





వరంగల్ ఈస్ట్, జనవరి 15 (జనం సాక్షి) : చారిత్రాత్మకమైన వరంగల్ ఉమ్మడి జిల్లాలోని రామప్ప దేవాలయాన్ని, వేయి స్తంభాల ఆలయాన్ని, వరంగల్ కోటలోని కట్టడాలను ఆత్మ రామ్ సనాతన్ ధర్మ కాలేజ్ న్యూఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు మంగళవారం బుధవారం రెండు రోజులు సందర్శించారు. ఈ సందర్భంగా కాకతీయుల నాటి చరిత్రను పర్యాటక శాఖ గైడ్ రవి యాదవ్ ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు వరంగల్ కోటలోని కళాఖండాల విశిష్టతను చరిత్రను గైడ్ రవి యాదవును అడిగి తెలుసుకోవడంతోపాటు సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా విద్యార్థుల వెంట వచ్చిన ప్రొఫెసర్లు, విద్యార్థులు ఎంతో సంబరపడ్డారు. కిలా వరంగల్ కోటలో, రామప్పలో కేరింతలతో విద్యార్థులు మురిసి పోయారు.

## మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయండి

- ఆదిలాబాద్ జిల్లాలో మహిళల ఆందోళన

ఆదిలాబాద్, జనవరి 15 (జనంసాక్షి) : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి.. ముందు మహాలక్ష్మి పథకం కింద ఇస్తానన్న రూ.2500 ఇవ్వాలంటూ మహిళలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ పండుగనూ సంతోషంగా జరుపుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయాలంటూ ముగ్గులు వేసి నిరసన తెలిపారు. రూ.4 వేల పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, కల్యాణలక్ష్మి, తులం బంగారం, రూ.15 వేల రైతుబంధు, రైతు కులీలకు రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే అన్ని పండుగలను సంతోషంగా జరుపుకునేవాళ్లమని చెప్పారు. మళ్లీ కేసీఆరే రావలని ముక్త కంఠంతో చెప్పారు.

## నిజామాబాద్‌లో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు



నిజామాబాద్, జనవరి 15 (జనంసాక్షి) : నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లో బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు వెలవడం స్థానికంగా కలకలం రేపింది. ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వాల్ పోస్టర్లలో ప్రస్తావిస్తూ ఓటర్లు నిలదీశారు. రూపాయికి వైద్యం ఎక్కడ? యువతకు ఉపాధి ఎక్కడ?, నియోజకవర్గంలోని ప్రతి నిరుపేదకు ఇల్లు ఎక్కడ? అంటూ నిలదీశారు. ఆర్మూర్ నియోజకర్గంతోపాటు నందిపేట్ మండలంలో సైతం పోస్టర్లు అంటించారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా పోస్టర్ల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

## తప్పిపోయిన బిడ్డను తల్లి ఓడికి చేర్చిన పోలీసులు



భీమదేవరపల్లి, జనవరి 15 (జనంసాక్షి) : భీమదేవరపల్లి మండలం కొత్తకొండ జాతర అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.. బుధవారం నా భక్తులు వీరభద్రుని దర్శనం కోసం బారులు తీరారు.. జాతరలో తప్పిపోయిన పాప తన తల్లి వద్దకు చేర్చిన పోలీసులు ఈ మేరకు తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో సీఐ ఎల్కతుర్తి పులి రమేష్, సాయిబాబు ఉన్నారు.

## డూ...డూ...బసవన్న...!



చెన్నారావుపేట, జనవరి 15 (జనం సాక్షి): పసిడి పంటల కాంతి సంక్రాంతి... పంటలన్నీ ఇంటా చేరిన వేళా.... పల్లెలన్నీ మురిసిన హేళా.... ఆనందోత్సవాల నడుమ జరుపుకునే పండుగ ఇది. ఏ పల్లె చూసినా ముత్యాల హరివిల్లులు... హరిదాసుల పాటలు... బసవన్నల ఆటలే కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చెన్నారావుపేట మండల కేంద్రంలో బసవన్నను ఇంటింటికి తిప్పుతూ గంగిరెద్దులవారు బిక్షాటన చేపట్టారు.

## పలు ప్రవేశ పరీక్షల షెడ్యూల్ ఖరారు

ఫా ర్మసీ కోసం.. మే 2 నుంచి 5 వరకు ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం ఈఏపీ సెట్ జరగనుంది. ఈఏపీ సెట్ పరీక్షలు జేఎన్‌టీయూ నిర్వహిం చనుండగా.. ప్రొఫెసర్ బి.డీన్ కుమార్ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. డిప్లొమా విద్యార్థులు ఇంజినీరింగ్, ఫార్మా కోర్సుల్లో రెండో సంవత్సరంలో చేరేందుకు నిర్వహించే ఈసెట్ మే 12న జరగనుంది. ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించే ఈసెట్ కన్వీనర్‌గా ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ వ్యవహరిస్తారు. బీఈడీ ప్రవేశాల కోసం జూన్ 1న ఎడ్ సెట్ జరగనుంది. కాకతీయ యూనివర్సిటీ నిర్వహించే ఎడ్ సెట్ కన్వీనర్‌గా కేయూ ప్రొఫెసర్ బి.వెంకట్రామిరెడ్డి ఉన్నారు. ఎల్‌ఎల్‌బీ ప్రవేశాల కోసం లాసెట్, ఎల్‌ఎల్‌ఎం కోసం పీజీఎల్ సెట్ పరీక్షలు జూన్ 6న నిర్వహిస్తారు. లాసెట్, పీజీఎల్ సెట్ నిర్వహణ బాధ్యతలు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అప్పగించి.. కన్వీనర్ గా ప్రొఫెసర్ బి.విజయ లక్ష్మిని నియమించారు. ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం జూన్ 8, 9 తేదీల్లో ఐసెట్ పరీక్ష జరగనుంది. ఐసెట్‌ను మహాత్మగాంధీ యూనివర్సిటీ నిర్వహిం చనుండగా.. ప్రొఫెసర్ అలువాల రవి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల కోసం జూన్ 16 నుంచి 19 వరకు పీజీఈసెట్ నిర్వహిం చనున్నారు. జేఎన్టీయూహెచ్ నిర్వహించే పీజీఈసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ ఎ.అరుణ కుమారి వ్యవహరిస్తున్నారు. వ్యాయామ విద్య కోర్సులు డీపెడ్, బీపెడ్‌ల్లో ప్రవేశాల కోసం జూన్ 11 నుంచి 14 వరకు పీఈసెట్ నిర్వహిస్తారు. పాలమూరు యూనివర్సిటీ నిర్వహించే పీఈసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ ఎన్.ఎస్.దిలీప్ ఉన్నారు. పీఈసెట్ మినహా మిగతా ఎంట్రన్స్‌లన్నీ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు.

## గల్లంతైన వారు ఇక మృతులకిందికే..

జారీ చేసింది. ఈ నిర్ణయంతో విపత్తులో గల్లంత్కైన వారి కుటుంబ సభ్యులకు లబ్ధి చేకూరుతుందని, పరిహారం అందించేందుకు సహాయపడుతుందని అభిప్రాయపడిరది. మిస్ అయిన వ్యక్తుల జాబితాను పరిశీలించేందుకు రెవెన్యూ శాఖ అధికారులతో సహా స్థానిక, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ఉత్తర్వులో పేర్కొంది. ఈ కమిటీ విపత్తులో తప్పిపోయిన వారి జాబితాను తయారు చేసి పరిశీలన కోసం జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీకి సమర్పిస్తుంది. డీడీఎమ్ఏ ఆ జాబితాను పరిశీలించి రాష్ట్ర స్థాయి కమిటీకి పంపితే.. అక్కడి నుంచి ఆ జాబితా ప్రభుత్వానికి చేరుతుంది. ఈ జాబితాలో పేర్లు ఉన్నవారిని ప్రభుత్వం మృతులుగా ప్రకటించి.. వారి బంధువులకు పరిహారం అందిస్తుంది. కాగా, గతేడాది జుల్కై 30న వయనాడ్‌లో ఘోర ప్రకృతి విపత్తు సంభవించిన విషయం తెలిసిందే. భారీ వర్షాలు కురవడంతో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ దుర్ఘటనలో గ్రామాలకు గ్రామాలే తుడిచిపెట్టుకుపోయాయి. ఈ ఘటనలో సుమారు 263 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. మరో 35 మంది మిస్సయ్యారు.

## నార్సింగ్‌లో డబుల్ మర్డర్ కేసు

- దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు

హైదరాబాద్, జనవరి 15 (జనంసాక్షి) : నగర శివారులోని నార్సింగిలో జరిగిన డబుల్ మర్డర్ కేసులో ట్విస్ట్ నెలకొంది. మంగళవారం అనంత పద్మనాభ స్వామి దేవాలయం గుట్టపై ఓ మహిళా, యువకుడు దారుణంగా హత్యకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి.. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ తో వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలో మద్యం సీసాలను పోలీసులు గుర్తించారు. ఈ డబుల్ మర్డర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన నార్సింగ్ పోలీసులు కీలక వివరాలు సేకరించినట్లు తెలస్తోంది. మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన అంకిత్ సాకేత్‌గా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బిందుగా గుర్తించారు. నానక్‌రామమ్‌గూడలో అంకిత్.. ఎల్బీనగర్‌లో బిందు నివాసం ఉంటున్న ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం ఉందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బిందుకు ముగ్గురు పిల్లలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నెల 8న బిందును ఎల్బీనగర్ నుంచి తీసుకొచ్చిన అంకిత్.. నానక్‌రామ్‌గూడలోని తన స్నేహితుల రూమ్‌లో ఉంచినట్లు పోలీసులు విచారణలో గుర్తించారు. ఆ తర్వాత గచ్చిబౌలిలో అకింత్ అదృశ్యమైనట్టు కేసు నమోదు కాగా, వనస్థలిపురంలో బిందుపై మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ క్రమంలోనే నిన్న నార్సింగిలో ఇద్దరినీ దుండగులు హత్య చేశారు. ఈ మర్డర్ కేసులో అంకిత్, బిందు కుటుంబసభ్యులను పోలీసుల అనుమాని స్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
16 జనవరి 2024
తెలంగాణ

# హక్కుల గొంతుక
# పి.వి సుబ్బారావు

కవులు, కళాకారులు, సాహితీ వేత్తలు, హక్కుల సంఘాల నేతలు అందరు కష్టజీవుల వైపు నిలబడాలని పౌరహక్కుల సంఘంను నడిపించిన వాడు సి.వి. సుబ్బారావు. ప్రజలను దోపిడి చేస్తున్న దొరలకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరిగిన నేపథ్యంలో దొరలే పాలకులుగా మారి ప్రాథమిక హక్కులను సైతం అణచివేస్తున్న స్థితి నుండే హక్కుల సంఘాల ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. అందులో ఒకటే పౌరహక్కుల సంఘం. దానికి ప్రధాన భూమిక పోషిస్తూనే వృత్తిరిత్యా ఢిల్లీకి వెళ్ళిన సుబ్బారావు ఢిల్లీలో కూడా పియుడిఆర్ అనే హక్కుల సంఘాన్ని నిర్మించడంలో తన వంతు బాధ్యతను నిర్వర్తించారు. అటువంటి వ్యక్తి తన వ్యక్తిగత జీవితంలో కూడా ప్రజాస్వామిక విలువలు పాటించడం అవసరమని భావించి దానికోసం నిరంతరం శ్రమించిన పౌరహక్కుల నేత సి.వి. సుబ్బారావు అమరుడై 31 సంవత్సరాలు అవుతున్నది. గుండెనొప్పితో జనవరి 17, 1994న మరణించాడు.



**(1994 జనవరి 17 సి.వి. సుబ్బారావు వర్ధంతి సందర్భంగా)**

హక్కుల ఉద్యమకారుడు, సాహితి మిత్రులు, రాడికల్ ఉద్యమ నాయకుడుగా కొనసాగిన సి. వెంకటసుబ్బారావు జనవరి 17, 1994న ఆనారోగ్యంతో మృతి చెందాడు. నవంబర్ 17, 1953లో తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించిన అతి తక్కువ కాలంలో అనేక గొప్ప పనులు నిర్వహించిన వారిలో సుబ్బారావు గారు ఒకరు. ముఖ్యంగా శ్రీకాకుళ రైతాంగ పోరాటాలు ఆ కాలంలో సుబ్బారావు ప్రాణిగ్రాహితో వచ్చిన, చైతన్య వంతమైన పాటలతో ఉత్తేజితుడై విద్యార్థి దశ నుండే 'గిరిజన పోరాటాలు' సాహిత్యోద్యమం వైపు తను కార్యాచరణను కొనసాగించాడు.

శ్రీకాకుల ఉద్యమం బలంగా సాగుతున్న నేపథ్యంలో అదే విధంగా రాజ్యహింస కూడా జడలు విప్పుకొని నాయకత్వాన్ని బూటకపు ఎన్‌కౌంటర్లతో హత్యచేస్తున్న నేపథ్యం నుంచి కవిగా స్పందిస్తూ కవులుగా మనం ఏ విధంగా స్పందించాలనే విషయంతో ప్రజల ముందుకు ప్రధానంగా విశాఖ సాహితీమిత్రుల్లో సభ్యుడైన సి.వి. సుబ్బారావు విశాఖ విద్యార్థులతో కలసి మేధావులారా, మీరెటువైపు ప్రజలవైపా? పాలకవర్గాల వైపా? అని విద్యార్థుల విసిరిన సవాల్ లోంచి, ఆ సవాల్ తోనే కవులను కష్టజీవులవైపు నిలబెట్టి విరసం ఆవిర్భావానికి కారణమైనవాడు. 1970లో విరసం ఏర్పాటుకు పునాదులు పడ్డాయి. విరసం ఏర్పాటుకు క్రియాశీలక పాత్ర నిర్వహిస్తూ సాహితి మిత్రులు సంస్థలో కొనసాగాడు.

సుబ్బారావు తన చిన్నతనం అంతా రాజమండ్రిలోని అతని తాతయ్య వద్దనే గడిచింది. సుబ్బారావు తన 13 ఏళ్ళ వయసులోనే 'పద్యం' రాసి గురజాడ అప్పారావుకు అంకితం చేశాడు. తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయైన కన్యాశుల్కం నవల వచ్చిన కాలంలో, ఒక సభకు ప్రధాన వర్తగా హాజరైన శ్రీశ్రీ గారు, సుబ్బారావు రాసిన పద్యాన్ని చదివి వినిపించడం జరిగింది. ఆ క్రమంలోనే 1974 రాడికల్ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తన కార్యచరణను కొనసాగించాడు.

సి.వి. సుబ్బారావు రాజకీయ కార్యచరణను దేశ రాజధాని ఢిల్లీలోనే కొనసాగించాడు. అంత వరకు ఆంధ్రప్రదేశ్లో కొనసాగుతున్న విరసం, సృజన పత్రిక ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో నిత్యం సజీవ సంబంధాలు కొనసాగిస్తూ తన బాధ్యతను నిర్వర్తించేవాడు. జూన్ 3, 1977లో ఎమర్జెన్సి ఎత్తివేసిన తర్వాత, చత్తీస్ఘడ్లో శ్రామిక్ సంఘ ఆధ్వర్యంలో కార్మికులు కొనసాగిస్తున్న ఆందోళన పై పోలీసులు కాల్పులు జరిపి 12 మందిని హత్య చేశారు. ఇంతటి రాజ్యహింసపై గళమెత్తిన హక్కుల యోధుడు. అక్టోబర్ 1978లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోని జగిత్యాల సిరిసిల్లా తాలుకాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి, 150 పోలీసు క్యాంపులను ఏర్పాటు చేసి, రైతాంగ ఉద్యమంపై తీవ్ర నిర్భంధాన్ని కొనసా గించి, ఇలాంటి రాజ్య నిర్భంధంపై ప్రజాస్వామ్యబద్ధంగా తీవ్రస్థాయిలో ప్రతిఘటించినవాడు.

సుబ్బారావు ఢిల్లీలో ఉన్న పీపుల్స్ యూనియన్ ఫర్ డెమోక్రటిక్ రైట్స్ ( పియూడిఆర్ ) వ్యవస్థాపక సభ్యుడు. చనిపోయిన నాటికి ఆ సంస్థ కార్యదర్శి. 1974లో ఆంధ్రప్రదేశ్లో పౌరహక్కుల సంస్థ ఏర్పాటుకు గుంటూరులో జరిగిన సమావేశానికి కూడా సుబ్బారావు హాజరయ్యాడు. 1984-86 మధ్య కాలంలో హైదరాబాద్లో ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో చురుకుగా పనిచేసాడు.

1970 దశకంలో జాతీయ స్థాయిలో పౌరహక్కుల ఉద్యమం లో విభిన్న దృక్పధాల మధ్య చెలరేగిన చర్చలో సుబ్బారావు ప్రముఖమైన పాత్ర నిర్వహించాడు. ఆనాడు పౌరహక్కుల ఉద్యమంలో రెండు ప్రధానమైన దృక్పధాలు ఉండేవి. అప్పట్లో చాలామంది, ప్రత్యేకించి ఢిల్లీలో, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను కాపాడటమే పౌరహక్కుల సంస్థల ప్రధాన లక్ష్యమని భావించారు. దాన్నే ఎంచుకున్నారు. ఇందుకు భిన్నంగా పియూడిఆర్ ఏర్పాటుకు చొరవ తీసుకున్న సుబ్బారావు విభిన్న రూపాల్లో సామాజిక, ఆర్థిక ఆదిపత్య వర్గాల కింద నలిగిపోతున్న పేద ప్రజలు, జీవితంలో సుఖ సంతోసాల్ని పెంపొందించుకోవటానికి, కనీస జీవన ప్రమాణాలను సాధించుకోవటానికి పోరాటం చేసే హక్కు కలిగి ఉంటారని, ఆ హక్కును కాపాడటమే పౌర హక్కుల సంఘం ప్రధాన లక్ష్యమని వాదించాడు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు జీవితాన్ని మెరుగు పర్చుకోవటానికి సాధనాలే తప్ప అలంకార ప్రాయమైనవి కావు. అంటే ఆదేశిక సూత్రాలను ప్రాథమిక హక్కుల్లో భాగంగా చూడాలన్న మాట. పియూడిఆర్ ఏర్పాటుతో ఈ ధోరణి ఢిల్లీకి విస్తరించింది.

ఢిల్లీలో ఏర్పాటు పౌరహక్కుల ఉద్యమంలో చాలా కీలకమైన ఘట్టం. దేశంలోని విభిన్న ప్రాంతాల్లో ప్రజల, ప్రజా ఉద్యమాల అణచివేతకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి, ప్రచారం చేయటానికి పియూడిఆర్ ఏర్పాటుతో ఢిల్లీలో ఒక వేదిక రూపొందింది, పియూడిఆర్ ఏర్పాటులోనే కాక, దాని కార్యకలాపాలలో సుబ్బా రావు కీలకమైన పాత్ర నిర్వహించాడు. ఆసియాడ్ గ్రామాన్ని కట్టిన వలస కార్మికుల పని పరిస్థితు లు, వివిధ ప్రాజెక్టుల వలన బస్తర్ ఆదివాసులు నిర్వాసితులయిన క్రమం, బీహార్, ఆంధ్ర విప్లవకారులపై రాజ్య యంత్రాంగం అణిచివేత చర్యలు వంటి అనేక విషయాలు సుబ్బారావు చొరవతో పియూడిఆర్ వేదిక నుంచి వెలుగులోకి వచ్చాయి. ప్రత్యేకించి ఎపిసిఎల్సి పైన నిర్భంధం వచ్చినప్పు డల్లా ఢిల్లీ విశ్వ విద్యాలయానికి, ఢిల్లీ నగరంలోని ఇతర సంస్థలకు చెందిన మేధావుల అభిప్రాయాలను సమీకరించి రాష్ట్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తేవటానికి పియూడిఆర్ చేసిన కృషిలో సుబ్బారావు పాత్ర చాలా ఉంది.

సుబ్బారావు పౌరహక్కుల ఉద్యమాకారుడు మాత్రమే కాదు. విద్యారిథగా ఉన్నప్పుడు విద్యార్థి ఉద్యమాలలో కృషి చేసాడు. రాడికల్ విద్యార్థి సంఘం వ్యవస్థాపక సభ్యుడు, మొదటి ఉపాధ్యక్షుడు. వి.ర.సం.. ఆవిర్భావానికి ప్రేరణ అయిన విశఖ విద్యార్థుల్లో ఆయన ఒకడు. విరసం సభ్యుడు. 'సృజన' సాహితీమిత్రుల్లో ముఖ్యమైనవాడు. ఆర్థిక శాస్త్రవేత్తగా ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ అసోసియేషన్లో, విశ్వవిద్యాలయ మేధావుల్లో ఆయనకు మంచి గుర్తింపు ఉంది. సుబ్బారావు ఈశాన్య భారత దేశంలోని

ప్రజల సమస్యలను వివరిస్తూ 'రగులుకున్న రాక్షసి బొగ్గు', రాజకీయార్థిక శాస్త్రాన్ని తెలుగు పాఠకులకు మొదటిసారిగా వివరిస్తూ 'రాజకీయార్థిక శాస్త్రం - ఒక పరిచయం' అనే పుస్తకాలు రాశాడు. తెలుగు సాహిత్య విమర్శపై ఆయన సంపాదకత్వంలో ' విభాత సంధ్యలు' అనే పుస్తకం అచ్చయింది.

వ్యక్తిగత జీవితంలో కూడా ప్రజాస్వామిక విలువలను పాటించడం అవసరమని సుబ్బారావు భావించేవాడు. సంస్థల పని విధానంలో కూడా ప్రజాస్వామిక పద్ధతులను పాటించాలని అనేవాడు. ఈ ఆలోచనతోనే ఆయన కార్యకర్తల సమావేశం అనే పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఆ విధంగా ఎన్నో మంచి సంప్రదాయాలను నెలకొల్పిన సుబ్బారావు అకాల మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటు.

అసాధారణ మరణంలో వాళ్ళు పోగొట్టుకున్న సాధారణ్యానికి ప్రాణం పోయడానికి ప్రయత్నించిన వ్యక్తి. జీవితమే లేదనుకుని వెళ్ళిపోయి న వాళ్ళను మనుషుల్ని చేసి మళ్ళీ జీవితంలో నడిపించి తీసకువచ్చిన మేధావి. మనుషులుగా బ్రతికి ఉన్నవాళ్ళ గురించే కలలు కంటాడు. మరచిపోలేని మరణ గతాలలో మరుగున పడిన వైరుద్యాన్ని తవ్వితీస్తాడు, ఎదుర్కొంటాడు, మానవ అనుబంధాల్ని పునర్ నిర్వచించగల ప్రజాపోరాటాలకు ప్రేమించే వ్యక్తి మన మధ్య లేకపోవడం నిజంగానే విచారకరం. మనుషల గుర్తులు, ఆలోచనలు కార్యచరణలుగా నేటి మన కర్తవ్యాన్ని గుర్తించుకుంటాయి. ఆ గుర్తుల్లో సి.వి. సుబ్బారావును గుర్తుచేసుకుంటూ ఆచరణలో కొనసాగుదాం.

ప్రస్తుత స్థితిలో కవులుగా, కళాకారులుగా స్పందించడం రాజ్యం దృష్టిలో పూర్తిగా నేరమైపోయి అర్బన్ నక్సల్ బ్రాండ్‌ను వేసి భావప్రకటన స్వేచ్ఛను కూడా నియంత్రిస్తున్న స్థితిలో పాలక వర్గాల్లో ఉన్న ప్రతిపక్ష పార్టీ నేతలనే అర్బన్ నక్సల్‌గా సృష్టిస్తున్న నేపథ్యంలో నిజంగా ప్రజల పక్షాన గొంతెత్తే హక్కుల నేతలను, సాహితీ వేత్తలనందరిని కూడా నిషేదిత ఉద్యమాలతో సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు చేస్తూ పూర్తిస్థాయి నిర్భంధాన్ని అమలు చేయడంలో భాగంగా ఊపాను ఎన్‌ఐఎ నిర్భంధ సంస్థలను ఉపయోగించి ప్రాథమిక హక్కుల కూడా లేని స్థితులను ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. దీన్ని సి.వి. సుబ్బారావు స్పూర్తితో ప్రజల వైపు నిలబడడం అంటే త్యాగానికి సిద్ధమవడమని ఆ వైపుగా ప్రజాపక్షానికి చెందిన వాళ్ళందరు నిలబడాల్సిన నైతిక బాధ్యత ఉందని గుర్తిస్తూ ఇప్పుడు ఏడాది కాలంగా జరుగుతున్న ఆపరేషన్ కగార్ నేపథ్యంలో వందలాది హత్యలు వేలాది అరెస్టులు గ్రామాలపై యుద్ధదాడులు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక పౌరుడు అన్యాయానికి వ్యతిరేకంగా పీడిత ప్రజల హక్కుల కోసం గొంతెత్తాల్సిన ఆవశ్యకతను సుబ్బారావు అమరత్వం సాక్షిగా గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది.

**నారాయణ రావు**
ప్రధాన కార్యదర్శి పౌరహక్కుల సంఘం
తెలంగాణ



## 'షేర్'బజార్‌లో 20 కోట్ల మంది
# నిండా మునిగారు

జీతాలు, ఆదాయం తగ్గడంతో మధ్యతరగతి ఉద్యోగులు ఎక్కువ శాతం మంది షేర్ మార్కెట్ వైపు మొగ్గు చూపి తమ వద్ద ఉన్నదంతా అందులో పెట్టి దివాళా తీసే పరిస్థితి ఉన్నది. ఇటీవల ఇలా 20 కోట్ల మంది నీవేశకులు నిండా మునిగారు. అప్పుల్లో కూరుకు పోయిన పరిస్థితి ఉన్నది. ప్రకటిస్తు న్న, ఒరిజినల్ ఆర్థిక వ్యవస్థకు తేడా చాలా ఉంటున్నది. షేర్ బజార్ వాల్యూవేషన్స్ నిలకడగా లేవు. విదేశీ నివేశకులు తమ పెట్టుబడులను ఉపసంహరించు కుంటున్నారు. ఉత్పత్తి రంగంలో అసలు వృద్ధి లేదు, కేవలం హెడ్లైన్ కోసం అటు ఇటు షేర్ మార్కెట్ ధరలను చూపుతు న్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల ఫలితాలకు ముందు బీజేపీ కి 400 పార్లమెంట్ సీట్లకు పైగా వస్తాయని ప్రచారం చేసారు.ఎగ్జిట్ పోల్స్‌లో ఇదే చూపారు. షేర్ మార్కెట్ లో నివేశాలు పై పీఎం నరేంద్ర మోడీ, హోమ్ మంత్రి అమిత్ షా కూడా ఇన్వెస్ట్మెంట్ చేయమని స్టేట్మెంట్స్ ఇచ్చారు. జూన్ 4 పేరిట ఈ ప్రచారం జరిగింది. దీనివల్ల విదేశీ ఇన్వెస్టర్స్ లాభంలో పడ్డారు. 3 కోట్ల మందికి పైగా షేర్ మార్కెట్ లో ఉద్యోగులు బీజేపీ 230 సీట్లు కూడ దాటక పోవడం వల్ల మార్కెట్ వాల్యూ పడి పోయి నష్టపోయారు.దీని పైన గతం లోనే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడ విమర్శ చేశారు. మునిగిన ఇన్వెస్టర్స్ కు భాద్యులు ఎవరు? అన్నారు ఆయన!

**మన్మోహన్ కాలంలోనే మంచి రిటర్న్స్!**

ఎవరు అవును అన్నా, కాదు అన్నా, యూపిఏ కాలం లోనే షేర్ మార్కెట్ లో ఎన్వెస్టర్స్ కు మంచి రిటర్న్ ఉండేవి. ఒక గ్యారంటీ అనేది ఉండేది!మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో నివేశకులకు రిటర్న్ 199 శాతం, మాజీ పీఎం పీవీ. నర్సింహారావ్ హయాంలో 180 శాతం ఉన్న దాఖలాలు ఉన్నాయి.ఈ నిజం ప్రస్తుత పాలకులకు మింగుడు పడనిది గా పేర్కొనక తప్పదు! ప్రస్తుతం పీఎం నరేంద్ర మోడీ హయాంలో 61.2 శాతం, 81 శాతం, ఇప్పుడు తాజాగా 9.2 శాతం ఇన్వెస్టర్స్ కు రిటర్న్ ఉన్నా యంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు! తమ ఆర్థిక పరిస్థితి ని కాస్త అయినా గాడిలో పెట్టుకునే లక్ష్యం తో బ్యాంకుల నుంచి కాస్తో, కూస్తో దాచుకున్న డబ్బులు తీసి షేర్ మార్కెట్ లో పెడుతున్న మధ్యతరగతి ఉద్యోగుల పరిస్థితి ఆశించిన మేరకు రిటర్న్ లేక చాలా ఆందోళన కరంగా ఉన్నది.

**50 లక్షల కోట్లు మాయం!**

ఇలా 50 లక్షల కోట్ల రూపాయలు షేర్ మార్కెట్ నుంచి మాయం అయిపోయాయాలా పరిస్థితి ఉన్నది.విదేశీ ఇన్వెస్టర్ల విత్ డ్రాలు పెరిగి పోవడం వల్ల,20 కోట్ల మంది మధ్యతరగతి ఇన్వెస్టర్స్ పరిస్థితి ఆందోళన కరంగా ఉన్నది, అంటే అతిషయోక్తి కాదు. ఇందుకు ఇజ్రాయిల్, గాజా మీద చేస్తున్న ఘోర యుద్ధం, అటు రష్యా, ఉక్రైన్ యుద్ధం కూడా ఒక కారణంగా పేర్కొనవచ్చు! షేర్ మార్కెట్ నుంచి రిటర్న్ ఇంత దారుణంగా పడి పోవడం వల్ల ఎన్నో ఆశలు పెట్టుకు న్న మధ్యతరగతి కుటుంబాల ఇన్వెస్టర్స్ ఆర్థికంగా దివాళా తీశారు. ఇప్పుడు తాజాగా టాక్స్‌లను తగ్గించాలని, ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. షేర్ మార్కెట్‌లో కృత్రి మ మైన అబద్ధాల తో కూడిన వాల్యూయేషన్స్‌ను నమ్మి మోస పోయే వారు, హెడ్లైన్ లు చూసి ఆకర్షితులు అయ్యే వారి సంఖ్య పెరిగింది. దేశంలో మ్యానుఫాక్చర సెక్టర్ అభి వృద్ధి అస్సలు లేదు.అదే 1990లో ఉన్న గ్రోత్ రేటే ఇప్పుడు ఉన్నది. మిడిల్ క్లాస్ ప్రజల దగ్గర డబ్బులు లేవు. కొనుగో లు శక్తి తగ్గింది. దీనితో టూత్ పేస్ట్‌లను సైతం మార్కెట్ లోనికి క్వాంటిటీ తగ్గించి, రేటు తగ్గించి అమ్ముతున్నారు.

**జీడీపీ ఎక్కడ ఉన్నది?**

యూపిఏ కాలంలో మాదిరే జీడీపీ ఉన్నది. అప్పుడు 6.3 ఉంటే ఇప్పుడు 2024-25 లోను 6.4 శాతం ఉంది. రూపాయి విలువ పడిపోతున్న ఫికర్ అస్సలు లేదు.ఇంకా పవర్ కోసం అవే కులం, మతం, హిందూ, ముస్లిం రాజకీ యాలు నెరుపుతున్నారు. మాటల మ్యానుఫాక్చరింగ్, ఇందు లోనే మేక్‌ఇన్‌ఇండియాను చూయిస్తున్నారు. నిరుద్యో గులకు ఉద్యోగాలు కల్పించే మ్యాను ఫాక్చరింగ్ లేదు! అందరి ఖాతాల్లో నెలకు రెండు వేలు వేస్తామని, ఎన్నికల్లో గెలిచే పరిస్థితి వచ్చింది!ఐ ఫోన్ మ్యాను ఫాక్చరింగ్, అమ్మకాల గురించి మాత్రమే చెప్పుకునే పరిస్థితి ఉన్నది. ప్రపంచం ఇచ్చి, పుచ్చుకునే ప్రక్రి య తోనే నడుస్తుంది. ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. అనేది గుర్తుంచుకోకుంటే ఎట్లా?



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

## జిందగీసే భి జంగ్!



- జిందగీసే భి జంగ్! (జీవితంతోను యుద్ధంలో ఉంటాను)
మే రహత హున్!
సమాజంతో యుద్ధం, పీడిత తడిత ప్రజల కోసం పోరాటం, ఆరాటంలో.. జీవితంతోను మధ్యమధ్యలో పోరాడాల్సి వస్తుం ది. జీవితం అనే పోరాటం లోను అపజయం చవి చూసే అలవాటు లేని వాళ్ళు, తమ కోసం తాము జీవించ్డం ముఖ్యం. అప్పుడే కదా.. కుటుంబం అయిన, మిత్రుల యిన, హితులైన వారి కోసం జీవించడం సాధ్యం. అందుకే జీవితంతో యుద్ధం నిరంతరం కొనసాగించు, నీ ఊపిరిని నేల మీద కాపాడుకునే భాద్యతను నీవే తీసుకో, నిన్ను నీవు కాపాడుకో..
రుఖ్ జానా నహీ!
జిందగీ సే హార్కే!
హర్ ఏక్ లడాయి, లడ్ తే, లడ్ తే,
జిందగీసే లడ్ నా భి సీక్ లియా హమ్ నే!
(జీవితంతో ఓడిపోయి ఆగి పోవద్దు.. ప్రతీ క్షణం పోరాడుతూ, పోరాడుతూ జీవితం తోను ఎలా పోరాడాలో నేర్చుకున్నాను)
సీనా టోఖ్ కే బోలో అభి హమ్ జిందా హై!
జిందగీ పానిమే ఆగ్ లగాని జైసీ హోతి హై యార్!
ఉసే ఇత్న ప్యార్ కరో కి తుంహే చోడ్ కే నా జానే పాయె!
జబ్ జానెక వఖ్త్ ఆయెతో భి జిందగీ కో ఉత్నహి ప్యార్ దేనా!
రూట్ జానా నహీ!
హర్ ఫర్జ్ కో తో నిభాని హై!
ఇమాన్ దారిసే!

ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# సామాజిక ప్రయోజనాన్ని ఆశించేది రచన!

ఆలోచనలను కమ్యూనికేట్ చేయడానికి, భావాలు భావోద్వేగాలను ప్రేరేపించ డానికి లేదా వినోదం కోసం వివిధ రచనా శైలులు, కళా ప్రక్రియలు, సాంకేతికతలలో వ్రాసిన పదాలను ఉపయోగించే వ్యక్తి రచయిత. రచయిత లు నవలలు, చిన్న కథలు, మోనోగ్రాఫ్‌లు, ట్రావెలాగ్‌లు, నాటకాలు, స్క్రీన్‌ప్లేలు, టెలిప్లేలు, పాటలు, వ్యాసాలు అలాగే నివేదికలు, విద్యా విషయాలు ,వార్తా కథనాలు వంటి వివిధ రకాల రచనలను అభివృద్ధి చేయవచ్చు. ఈ రోజుల్లో రచయితల రచనలు విస్తృత ప్రసార మాధ్యమాలలో ప్రచురించబ డుతున్నాయి. ఆలోచనలను బాగా వ్యక్తీకరించడానికి భాషను ఉపయోగించ గల నైపుణ్యం కలిగిన రచయితలు, తరచుగా సమాజంలోని సాంస్కృతిక విషయాలకు గణనీయంగా దోహదపడతారు ."రచయిత" అనే పదం పాటల రచయిత లేదా స్క్రీన్ రైటర్ వంటి కళలు మరియు సంగీతంలో ఇతర చోట్ల కూడా ఉపయోగించబడుతుంది, అయితే ఒక స్వతంత్ర "రచయిత" కూడా సాధారణంగా వ్రాత భాష యొక్క సృష్టిని సూచిస్తుంది. కొంతమంది రచయితలు మౌఖిక సంప్రదాయం నుండి పని చేస్తారుహా రచయితలు కాల్పనిక లేదా నాన్-ఫిక్షన్‌హా ఇతర రచయితలు తమ ఆలోచనల సంభాషణను మెరుగుపరచడానికి గ్రాఫిక్స్ లేదా ఇలస్ట్రేషన్ వంటి బహుళ మాధ్యమాలను ఉపయోగిస్తారు. కల్పితం కాని సాంకేతిక రచయితల పని కోసం పౌర, ప్రభుత్వ పాఠకులచే మరొక ఇటీవలి డిమాండ్ సృష్టించబడింది, వారి నైపుణ్యాలు ఆచరణాత్మక లేదా శాస్త్రీయ రకమైన అర్థమయ్యే, వివరణాత్మక పత్రాలను సృష్టిస్తాయి. కొంతమంది రచయితలు తమ రచనలను పెంచుకోవడానికి చిత్రాలను (డ్రాయింగ్, పెయింటింగ్, గ్రాఫిక్స్) లేదా మల్టీమీడియాను ఉపయోగించవచ్చు.అరుదైన సందర్భాల్లో, సృజనాత్మక రచయితలు తమ ఆలోచనలను సంగీతంతో పాటు పదాల ద్వారా తెలియజేయగలరు. వారి స్వంత వ్రాతపూర్వక రచనలను ఉత్పత్తి చేయడంతో పాటు, రచయితలు తరచుగా వారు ఎలా వ్రాస్తారో (వారి రచనా ప్రక్రియ) గురించి వ్రాస్తారు. వారు ఎందుకు వ్రాస్తారు (అంటే, వారి ప్రేరణ) ఇతర రచయితల పనిపై కూడా వ్యాఖ్యానించండి (విమర్శ).రచయితలు వృత్తిపరం గా లేదా వృత్తిపరంగా పని చేస్తారు, అంటే చెల్లింపు కోసం లేదా చెల్లింపు లేకుండా పని చేస్తారు, ముందుగా లేదా అంగీకారంపై లేదా వారి పని ప్రచురించబడిన తర్వాత మాత్రమే చెల్లించవచ్చు. చెల్లింపు అనేది రచయితల ప్రేరణలలో ఒకటి, చాలా మందికి వారి పనికి చెల్లించబడదు.ఆధారం అవసరం.

2.రచనకు ప్రాతిపదిక ఏమిటి రచయితలకు ఉండాల్సిన లక్షణాలు వాటి తీరుతెన్నులు. రచన నిలదొక్కుకోవడానికి అవసరం అయిన ప్రామానికత. రచయితలు సామాజిక మార్పునుఆశించడంతో పాటు శాసించగలగాలి కూడా! సామాన్యుల నుండి అసామాన్యుల వరకు తెలిసిన విషయం కావచ్చు తెలియని విషయం కావచ్చు కానీ ముందుగా స్పందించి జనానికి అందించేవాడే రచయిత అయినప్పుడు " సామాజిక ప్రయోజనాన్ని ఆశించి చేసేది రచన" అని స్పష్టంగా చెప్పుకోవా ల్సి ఉంటుంది. ఈ అంశాన్ని డాక్టర్ సి నారాయణ రెడ్డి గారు పలు సందర్భాలలో ప్రస్తావిస్తూ ప్రజలకు అనుసంధానమై ఉన్నప్పటికీ దానిని ముందుగా గుర్తించి దాని పూర్వాపరాలను విప్పి చెప్పేవాడే నిజమైన రచయిత అని ఇచ్చిన తీర్పు తదనంతర కాలంలో సర్వజన ఆమోదం పొందినది అనడంలో అతిశయోక్తి లేదు. ఇక రచయిత కేవలం ఇంటికి పరిమితమై మాట్లాడి రాసేవాడు అయితే నిష్ప్రయోజనం. ఎందుకంటే వ్యక్తుల ప్రైవేటు బ్రతుకు వారి వారి సొంతం పబ్లిక్ లో నిలబడితే ఏమైనా అంటాం అని మహాకవి శ్రీశ్రీ చేసిన వ్యాఖ్యానం మేరకు రచయిత అనే వాడు కూడా పబ్లిక్ లో నిలబడగాలి. అంటే తన ప్రవర్తన, ఆచరణ, పోరాట స్పూర్తి, జీవన విలువలు అన్నింటినీ కూడా సమాజం నిరంతరం పరిశీలిస్తుంది అవసరమైతే ప్రశ్నిస్తుంది అని తెలుసుకోవడం రచయితలకు చాలా అవసరం. "రచన అనేది దాచబడినది, విప్పి చెప్పబడినది, కష్టాలు కన్నీళ్ళతో ప్రదర్శించబడినది, పీడనకు సంబంధించింది ఏదైనా కావచ్చు దానిని చూసే కోణం ఆలోచించే తత్వం ప్రజల ముందు ప్రదర్శించే నైపుణ్యం ప్రజా చైతన్యానికి బాటలు పరిచే సామర్థ్యం రచయితకు ఉండాలి కానీ". మహాకవి శ్రీశ్రీ అన్నట్టు అగ్గిపుల్ల సబ్బు బిళ్ళ కాదేదీ కవితకు అనర్హం అన్నట్లుగా ప్రతి సందర్భము సన్నివేశము సంఘటన వస్తువు అన్నీ కూడా కథా కవిత రచన వస్తువులే,.అంటే స్పందింప చేసే అంశం రచనకు ప్రాతిపదిక అవుతుంది అప్పుడు మాత్రమే పరిశీలించడం, పరిశోధించడం, అన్వేషించడం, మార్గాలను వెతకడం,పరిష్కారాలను చూపడం, ముందు జాగ్రత్తలను హెచ్చరించడం ద్వారా ఒక కొలిక్కి రావడా నికి ఉపయోగపడగలగాలి కదా! " కొందరికి కన్నీళ్లు అయితే మరికొందరికి పన్నీరు కూడా రచనకు ప్రాతిపదిక అవుతున్నది. రచయితల మనోభావాలు, సైద్ధాంతిక ధోరణులు, సామాజిక స్పృహలోని స్థాయిలు, సామాజిక ప్రయోజనాన్ని ఆశించకుండా కాల్పనికతకు ప్రాధాన్యతను ఇచ్చే క్రమం కూడా రచన యొక్క ప్రామాణికతను నిర్ణయిస్తున్న సందర్భంలో భావ కవిత్వం, భౌతిక కవిత్వము, కాల్ పనిక కవిత్వము, యదార్థ కవిత్వము అంటూ అనేక రూపాలలో సంతరించుకుంటున్న వేల దాని ప్రయోజనాన్ని బట్టి ప్రజలు పాట కులే ఆ సాహిత్యం యొక్క ప్రమాణాన్ని నిర్ణయిస్తారు. అయితే భిన్న రకాలుగా ఆలోచించే పాఠకులు ఉన్నప్పుడు కేవలం సామాజిక ప్రయోజనమే గీటు రాయి అవుతుందనుకోవడం కూడా కష్టమే. సామాజిక మార్పును పెద్ద మొత్తంలో ఆశించినప్పుడు ఆ వైపుగా ఆలోచించే పాఠకులు ఉన్నప్పుడే కదా సాధ్యమయ్యేది. అది కావాలంటే కూడా సామాజిక మార్పును సవాలుగా స్వీకరించే రచయితలు రచనలు సృష్టించినప్పుడే అది నిజమయ్యేది.

ప్రజా రచయితలకు ఉండాల్సిన కొన్ని లక్షణాలు :ప్రజల హితా న్ని కోరేదే సాహిత్యమని గతంలో నిర్వచించుకున్నాం కానీ కేవలం హితాన్ని కోరుకోవడం తోనే సరిపోదు, ఆ క్రమంలో వస్తున్న అనే క ఆటంకాలు సంఘర్షణలను నివారించాలంటే రచయితలు మరింత కట్టుదిట్టంగా పనిచేయాల్సిన అవసరం ఉంది. ప్రజల హితాన్ని సాకారం చేసే కోణంలో అవసరమైతే పోరాటానికి కూ డా రచయితలు సిద్ధపడాలి. అందుకు సమాజంలోని భిన్న వర్గాల నుండి వచ్చి సవాళ్లను కూడా ఎదుర్కోవలసి ఉంటుంది. అంతటి త్యాగశీలత, నేర్పు, ఓర్పు, పట్టుదల, జీవిత ఆశయం ప్రతి రచయితకు చాలా అవసరం.... వాళ్లు మాత్రమే రచయితలుగా నిలదొక్కుకుంటారు, ప్రజల గుండెల్లో నిలిచిపోతారు, ప్రజల హృదయాలను చూరగొంటారు, అప్పుడే ఆ రచన ప్రజల కోసం పది కాలాలపాటు నిలిచి ఉంటుంది. రచయితలు లేకపోవచ్చు కానీ రచనలు కలకాలం నిలిచిన సంఘటనలు అనుభవాలను దృష్టిలో పెట్టుకుంటే ఇప్పటికీ ప్రజల కళ్ళ ముందు కదలాడుతున్నటువంటి సాహిత్య గ్రంథాలు అనేకం. దానికి కారణం అందులో ఉన్న ప్రజా జీవితం, పరిష్కారాలు,సమస్యలు, బాధ్యతలు, హక్కులు, పోరాట రూపం, జీవిత విలువలను నేర్పిన తీరు, ఒక ప్రయోజనకరమైన ముగింపు క్రియాశీలక భూమిక పోషిస్తున్నాయి. తపన ఆరాటం పోరాటంతో పాటు జరుగుతున్న ఒక సంఘటన పట్ల సంఘర్ష ణకు గురి కావడం కూడా అవసరమే. తేలికగా తీసుకుంటే, నాకేమిటి అనుకుంటే, తాత్కాలిక ప్రయోజనాన్ని మాత్రమే ఆశిస్తే, తనకు రచన కౌశల్యము ఉన్నప్పటికీ కూడా అక్కడ రూపొందే రచన నిష్ప్రయోజనమే. నిజాన్ని నిగ్గదీసి ప్రశ్నించాలి, ప్రతిఘటించే స్వభావాన్ని పెంపొందించు కోవాలి, ప్రతీకారము కాదు పరోపకారం, హింస కాదు సహన తత్వాన్ని పెంపొందించే క్రమంలో రచయిత తన మనోభావాలను పదిలపరచు కోవాలి, ఎప్పటికప్పుడు తన ఆలోచనలకు సాన పెట్టాలి. ఆంగ్లేయులతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశాల సమయంలో అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా ఆలోచనలో నిమగ్నమై పరిశీలనలో తన నిద్రను కూడా పక్కనపెట్టి అట్టడుగు జాతులు సామాన్య భారత ప్రజానీకం కోసం ఏ అంశాలు సమావేశంలో ప్రస్తావించాలి? నోరులేని మూగవాళ్ళ కోసం ఏ ప్రతిపాదన లు చేయాలి? వాళ్ల హక్కులను సాధించడానికి నా శక్తిని ఉపయోగించాలి కదా! అని అనుకున్న సందర్భం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ను విశ్వ మానవున్ని చేసింది. నిద్దుర లేని రాత్రులు ఎన్నో ఎన్నెన్నో, తన కుటుంబ సభ్యుల అనారోగ్యాన్ని పట్టించుకోని రోజులు, చనిపోయిన ముఖాన్ని కనీసం చూడలేక అంతకుమించినటువంటి సామాజిక బాధ్యతతో జాతి జనుల కోసం దేశం పక్షాన నిలబడి ఒకరకంగా పోరాటం చేసినటువంటి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పోరాట స్పూర్తిని నిజమైన రచయితలు పెంపొందించుకోవాలి. "హక్కులు కోల్పోయిన వాళ్లు, బానిసలుగా బతుకుతున్న వాళ్ళు, పీడన దోపిడీకి గురవుతున్న వాళ్ళ పక్షాన ప్రతినిధిగా నిలబడాలి నిజమైన రచయిత. భగత్ సింగ్ తెగింపు, చంద్రశేఖర్ ఆజాద్ యొక్క ఆత్మగౌరవం, గాంధీ మహాత్ముని అహింస, రాజగురు సుఖదేవ్ లాంటి శౌర్య సాహసాలు, భారత చరిత్రలో జరిగిన అనేక పోరాటాలలో నేలకొరిగిన లక్షలాదిమంది వీరుల సాక్షిగా తెగింపుతో అవసరమైతే యుద్ధానికి కూడా సిద్ధపడగలగాలి ప్రస్తుత పరిస్థితుల్లో నిజమైన రచయిత." "నిరంతరం సంఘర్షణకు గురి కావచ్చు, అనేక మందికి శత్రువుగా మిగిలిపోవచ్చు, బావా వేషం కారణంగా అభద్రతకు అనారోగ్యానికి గురి కావచ్చు కూడా. కానీ దాని వెనుక ఒక లక్ష్యం, ఒక మహోన్నతమైన ప్రయోజనం, పరోపకారం, ప్రజల మేలు కోరే ఆకాంక్ష ఉన్నదనే విషయాన్ని మాత్రం రచయిత ఎప్పుడూ మర్చిపోవద్దు. నిద్రలో కలవరింతలో అర్ధరాత్రి ఆలోచన రాగానే మేల్కొని ఆ అంశాన్ని అందిపుచ్చుకొని నిక్షిప్తం చేసి నిజజీవితంలో ప్రజలకు అందించగలిగినవాడే నిజమైనటువంటి సాహసోపేతమైన రచయిత.

రచయితలకు ఆలోచన బావ ప్రకటన మాత్రమే సరిపోదు తెగువ పోరాట స్పూర్తి కూడా అనివార్యం. కాలానుగుణంగా మారుతున్న క్రమంలో రచయితల యొక్క లక్ష్యాలు లక్షణాలు రచన యొక్క సామాజిక ప్రయోజనా లు మారుతుంటాయని గుర్తించడం చాలా అవసరం."

ఆశించడంతోపాటు శాసించడానికి వెనుకాడకూడదు:విద్యా లక్ష్యాలు, ఉపాధ్యాయులతో విద్యార్థుల ద్వారా సమాజానికి అందే ప్రయోజనం, పంచవర్ష ప్రణాళికల లక్ష్యం, సాహిత్యం యొక్క మహా ప్రయోజనం, సుపరిపాలన యొక్క అంతిమ గమ్యం అన్నీ కూడా సమసమాజ స్థాపన. కనుక ఆ సుదీర్ఘమైనటువంటి లక్ష్యాన్ని సాధించే క్రమంలో ప్రజల పక్షాన ఆశించడంతోపాటు ప్రజలకు ద్రోహం తలపెట్టే అన్ని వర్గాలను రచయిత లు శాసించగలగాలి. రచయితలు ఎప్పుడూ ప్రజల పక్షమే అనే సామాజిక సహజ న్యాయాన్ని పాలకులచే ఒప్పించగలగాలి కూడా. రచయితలు చేసేది నిజంగా ఆయుధాలు లేని యుద్ధమే. యుద్ధం అనివార్యమైనా దాని వెనుక శాంతిని ఆశించినట్లు, పండుటాకు రాలిపోతుంటే దాని వెనుక చిగురాకు వచ్చిన ట్లు రచయితలు లక్ష్యసాధనలో అనునిత్యం సమాజ పునరుద్ధరణకు అంతరాలు అసమానతలు లేని వ్యవస్థ కోసం పనిచేయవలసి ఉంటుంది. "నోరుండి నిర్బంధించబడిన హక్కుల కార్యకర్తలు చిత్రవధలకు గురవుతుంటే, ప్రజాస్వామ్యం అపహాస్యమైనచోట ఆ వర్గాల ప్రతినిధిగా, చట్టసభల్లోని నేరస్తులు దోపిడీగాళ్లు పాలనచలాయిస్తుంటే వాళ్ల నేరాన్ని బట్ట బయలు చేయడానికి, కిక్కిరిసిన జైల్లలో విచారణ ఖైదీలుగా నేరం చేయకుండానే శిక్షలు అనుభవిస్తున్నటువంటి అమాయకుల గొంతు గా భిన్న రూపాలలో రచయితలు పని చేయాల్సి ఉంటుంది. సంస్కరణ కోసం ఆశించిన జైల్లో కులం పేరుతో కొనసాగుతున్న వివక్షత పైన కూడా ఉక్కు పాదం మోపాల్సిన బాధ్యత కూడా రచయితలదే. రైతులు, కార్మికులు, చేతివృత్తుల వాళ్ళు, చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు, వలస జీవులు, రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు.... వీరందరిని పాలకవర్గాలు ప్రలోభాలు వాగ్దానాలతో మోసం చేస్తుంటే వాళ్ళ నిజరూపాన్ని చట్టసభల ముందు పెట్టి ప్రశ్నించేది కూడా ప్రజా రచయితలే. అందుకే వాళ్లు ఆశించే వాళ్ళు మాత్రమే కాదు శాసించే వాళ్ళుగా ఎదగాలి. శాసనకర్తలుగా నిలబడాలి పాలకుల కుళ్ళును ప్రజల పక్షాన ప్రక్షాళన చేయాలి.



డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం
సెల్ నెంబర్ : 9849577610

# అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరేలా పటిష్ట కార్యాచరణ

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- గ్రామ సభల ద్వారా తుది లబ్ధిదారుల ఎంపిక
- జనవరి 26 నుంచి 4 నూతన పథకాల అమలు



**మంథని, జనవరి 15 (జనంసాక్షి) :** అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం మంథని లోని శ్రీ లక్ష్మీ భారతి ఫంక్షన్ హాల్ లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్ కార్డుల జారీ, తదితర అంశాలపై నిర్వహించిన మంథని నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం నుంచి అమలు చేయబోతున్న 4 నూతన పథకాలకు అర్హులైన లబ్ధిదారులను, అనర్హులను ఎంపిక చేసి గ్రామ సభ ల ద్వారా ఆ జాబితాను ఆమోదింప చేసుకోవాలని అన్నారు. గ్రామ సభ ల ద్వారా ఆమోదింప చేసుకున్న జాబితా జనవరి 25 లోపు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. రైతు భరోసా పథకానికి సంబంధించి ప్రతి మండలంలోని తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారి పర్యవేక్షణలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్, సర్వేయర్లు, మైనింగ్ , సంబంధిత అధికారులు సంయుక్తంగా పని చేసి పట్టా దార్ పాస్ పుస్తకాల డేటా, గూగల్ మ్యాప్ , రెవెన్యూ మ్యాప్ వారీగా పరిశీలిస్తూ భూ భారతి (ధరణి) నుంచి వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించి రైతు భరోసా జాబితా నుంచి సదరు లబ్దిదారులను తొలగించాలని అన్నారు. రాళ్లు రప్పలు ఉన్న భూములు, సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ చేసిన భూములు, పరిశ్రమల భూములు (రైస్ మిల్ పెట్రోల్ బంక్, ఆహార శుద్ధి పరిశ్రమ), నాలా కన్వర్షన్ జరిగిన భూములు, లేఔట్ ఉన్న భూములు, ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తు భూములు, రోడ్ల భూములు, భవనాలు నిర్మించుకున్న భూముల, మైనింగ్ జరుగుతున్న భూముల వివరాలు రైతు భరోసా నుంచి తొలగించాలని అన్నారు. భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి 12,000 రూపాయలకు రెండు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించిందని, 2023-24 సంవత్సరానికి 20 రోజులు పని చేసిన భూమి లేని రైతు కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. ఈ పథకం కుటుంబం యూనిట్ గా అందించడం జరుగుతుందని, వ్యక్తిగతంగా అందించే పథకం కాదని అన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామాన్ని జీపి వారిగా మ్యాప్ చేయాలని అన్నారు. జిల్లాలో 20 రోజులు ఉపాధి హామీ కూలీలుగా పని చేసిన కార్మికుల జాబితాను తీసుకొని ఆధార్ కార్డు ట్యాగ్ ప్రకారం పరిశీలిస్తూ భూమిలేని కుటుంబాలను ఎంపిక చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామ సభలో ఎంపిక చేసిన జాబితాపై ఏవైనా అభ్యంతరాలు వస్తే సంబంధిత ఎంపిడీఓ 10 రోజుల లోగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సామాజిక ఆర్థిక సర్వే కింద మన పెద్దపల్లి జిల్లాలో తేలిన ఆహార భద్రత కార్డులు లేని కుటుంబాలకు మండలాలలో ఎంపీడీవోలు, పట్టణాలలో మున్సిపల్ కమిషనర్ లు నూతన రేషన్ కార్డుల జారీ పర్యవేక్షించాలని అన్నారు. గ్రామ లేదా వార్డు సభల ద్వారా అర్హులైన జాబితాన్ని ఆమోదింప చేసుకొని రేషన్ కార్డులను 75 గణతంత్ర దినోత్సవ సందర్భంగా నూతన రేషన్ కార్డుల ప్రోసిడింగ్స్ పంపిణీ చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి నిర్వహించిన సర్వేలో భూములు ఉన్న అత్యంత పేదలకు మొదటి జాబితాలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో స్క్రూటినీ నిర్వహించి 13.93 లక్షల దరఖాస్తులను మొదటి విడతలో పరిశీలనకు జిల్లాలకు అందిస్తున్నారని, మనకు వచ్చిన దరఖాస్తులను మరొకసారి చెక్ చేసుకోని, గ్రామాల వారీగా అర్హులను ఎంపిక చేసుకొవాలని, ఎటువంటి ఒత్తిడులకు గురికాకుండా అత్యంత పేదలను ఎంపిక చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న 4 కార్యక్రమాల మార్గదర్శకాలు, ఉద్దేశం ప్రజలకు వివరిస్తూ పథకాల అర్హుల జాబితాను ప్రజలందరికీ తెలిసేలా ప్రదర్శించాలని, ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత తుది జాబితా తయారు చేయాలని అన్నారు. జనవరి 23 లోపు గ్రామ సభల నిర్వహణ పూర్తి చేయాలని, గ్రామ సభ ఆమోదించిన తరువాత తుది జాబితా ఆన్ లైన్ లో జనవరి 25 సాయంత్రంలోపు నమోదు చేయాలని, జనవరి 26 నుంచి 4 పథకాల అమలును ప్రారంభించాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, జడ్పీ సీఈవో, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## జేపీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిథి, జనవరి 15 (జనంసాక్షి) :** మతసామరాశ్యానికి ప్రతీకగా నిలిచిన రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలంలోని హజ్రత్ జహంగీర్ పీర్ దర్గాలో బుధవారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గుసూల్-ఏ-షరీఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ నాగర్కుంట నవీన్ కుమార్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరయ్యారు.ఈ నెల 16 నుంచి ప్రారంభమయ్యే దర్గా ఉర్సు నేపథ్యంలో ప్రతి ఏటా గుసూల్ -ఏ- షరీఫ్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా దర్గాలో పాలతో శుభ్రపరిచి అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..ఉర్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే శాంతి భద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా చూడాలని పోలీసులను కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ ఈటా గణేష్,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మె సత్యనారాయణ,మాజీ సర్పంచులు మిట్టు నాయక్, అజయ్ నాయక్, మాజీ మండల అధ్యక్షుడు పెంట నోళ్ళ యాదగిరి,యువ నాయకుడు శివ చారి, ఇంద్రసేనారెడ్డి,గుండు గోపాల్ నాయక్,సల్ల యాదగిరి, శంకర్, సభావత్ గోపి నాయక్, రామ్ నాయక్, జంగయ్య యాదవ్, నవాజ్, ముస్లిం మత పెద్దలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలో భాగంగా ఇందిరమ్మ ఇల్లు

- నమూనా నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**గద్వాల నడిగడ్డ, జనవరి 15 (జనంసాక్షి) :** జోగులాంబగద్వాల జిల్లా కేంద్రంలోని గద్వాల మండలం సంబంధించిన గద్వాల ఎంపీడీవో కార్యాలయంలో, ధరూర్ మండల ఎంపీడీవో కార్యాలయంలో నందు ఇందిరమ్మ ఇల్లు మోడల్ నమూనా నిర్మాణానికి శంకుస్థాపన భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. గద్వాల, ధరూర్ మండలాలో ఇందిరమ్మ ఇల్లు నమూనా నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపనకు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎన్నికలలో సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలో భాగంగా ఇందిరమ్మ ఇల్లు పేద ప్రజలకు ఇస్తామని చెప్పిన ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి,గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచన మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలంలోని ఎంపీడీవో కార్యాలయం నందు పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు నమూనా మోడల్ నిర్మాణాన్ని తయారుచేసి ఐదు లక్షల రూపాయలలో ఒక హాలు, బెడ్ రూమ్ కిచెన్, నిర్మాణం చేసి పేద ప్రజలకు చేయించడము జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు కేటాయించడం జరిగిందనీ, ఇందిరమ్మ ఇల్లు కొరకు నమోదు చేసుకున్న వారికి త్వరలోనే ప్రతి గ్రామంలో గ్రామ సభలను ఏర్పాటు చేసి వీటిలో అర్హులైన వారికి ఎంపిక చేసి మొదటి విడతలు వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని, భవిష్యత్తులో కూడా మరి కొంతమందికి కూడా ఇందులో మహిళలు మంజూరు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కురువ హనుమంతు,మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి,జి. వేణుగోపాల, మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్, మాజీ జెడ్పిటిసి పద్మ వెంకటేశ్వర్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హెూరాహెూరీ పోరులో నాగర్కర్నూల్ విజయం

- పది రోజులపాటు కనువిందు చేసిన క్రికెట్ పోటీలు
- ఖిజర్ యాఫై గోల్డ్ కప్ ఎగరేసుకుపోయిన నాగర్కర్నూల్





**జహీరాబాద్, జనవరి 15 (జనంసాక్షి) :** గత పది రోజులపాటు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో కొనసాగిన ఖిజర్ యాఫై గోల్డ్ కప్- 3 క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో నాగర్కర్నూల్ డాలి సిసి జట్టు నేషనల్ కలిమ్ ఎలెవేన్ తో హెూరాహెూరీగా తలపడ్డాయి. టాస్ గెలిచి డాలి సిసి నగర్ కర్నూల్ మొదట బ్యాటింగ్ చేయగా. నిర్ణిత 20 ఓవర్లలో 167 పరుగులు చేసి ఆలౌట్ అయింది. 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేషనల్ కలిమ్ ఎలెవేన్ జట్టు 20 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌట్ అవ్వడంతో 3 పరుగుల తేడాతో డాలి సిసి నగర్ కర్నూల్ ఖిజర్ యాఫై గోల్డ్ కప్. 3 విజేతగా నిలిచింది. అనంతరం ముఖ్య అతిథి బిసి వై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ స్థానికంగా ఇలాంటి గొప్ప కార్యక్రమం నిర్వహించి స్థానిక క్రీడాకారులలో క్రీడా స్ఫూర్తిని నింపుతూ స్థానికులు జాతీయ అంతర్జాతీయ పోటీలలో ఆడాలని ఉత్తేజం కలుగుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు గత మూడు సంవత్సరాల నుండి తరచుగా నిర్వహించిన ఖిజర్ యాఫై ను అభినందించారు. అలాగే ఖిజర్ యాఫై అంచలంచలుగా ఎదగాలని మనసారా కోరుకుంటున్నట్టు తెలిపారు. అనంతరం క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు మైదానం అభివృద్ధి కోసం రూ .2 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. అనంతరం మాజీ టిజిఐడిసి చైర్మన్ మహమ్మద్ తన్వీర్ మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో ఇలాంటి గొప్ప టోర్నమెంట్ నిర్వహించడం, జహీరాబాద్ యువకులకు క్రికెట్ అభిమానుల్లో స్ఫూర్తిని నింపి, జాతీయస్థాయిలో ఆటగాళ్లను తీసుకొచ్చి బాగారెడ్డి స్టేడియంలో ఆడించి స్థానిక క్రీడాకారులు స్ఫూర్తి నింపినందుకు ఖిజర్ యాఫై కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ప్రముఖ జెకె చారిటబుల్ ట్రస్ట్, జెకె కన్స్ట్రక్షన్స్ అధినేత బొమ్మ దేశెట్టి పాటిల్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డుని ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం నిర్వాహకులు ఖిజర్ యాఫై పర్యవేక్షణలో సాగింది. ముఖ్య అతిదులు సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్, మాజీ ఎంపిటిసి దేశెట్టి పాటిల్, శుక్లవర్ధన్ రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ మక్సుదలి, స్టాండింగ్ ప్రెసిడెంట్ పబ్బతి సంతోష్ కుమార్, మీడియా ఇంచార్జ్ సయ్యద్ మహబూబ్ అలీ, అబ్దుల్లా సిద్ధికి,జ్యోతి పండల్,ఆదమ్ యాఫై, అబూద్ యాఫై, అధిల్ యాఫై, విజయ్ రాథోడ్, పబ్బతి రాకేష్, సంగమేశ్వర్ తదితరులు ఉన్నారు.

# ఎస్సారెస్పీ కాలువలు ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలి



**తుంగతుర్తి జనవరి 15 (జనంసాక్షి) :** ప్రస్తుత సీజన్లో ఎస్సారెస్పీ కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు అందించి రైతాంగాన్ని కాపాడాలని మాజీ ఎంపీపీ మండల పార్టీ అధ్యక్షుడు తాడికొండ సీతయ్య అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేఖ విధానాల వలన తుంగతుర్తి ప్రాంతం లో కాలువల్లో నీళ్లు చివరి దాకా పారే పరిస్థితి కనుచూపు మేరలో కనిపించడం లేదన్నారు. జనవరి ఒకటో తేదీన కాల్వల్లో నీరు వదిలిపెడుతున్నామని చెప్పిన ఇంతవరకు చివరి ఆయకట్టువరకు నీరే చేరలేదన్నారు. దీంతో రైతాంగం నిరాశావాదం లో ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వం లో ఈ సీజన్ లో కాల్వల్లో నీరు గల గలా నీరు పారుతూ చెరువు లన్ని జల. జలా మత్తడి దునికిన దృశ్యాలను రైతులు గుర్తుకు తెచ్చుకుంటున్నారని అన్నారు . వర్షాకాలం సీజన్ లో వరుణ దేవుడు కరుణిస్తే చెరువులు నిండి పంటలు పండితే.. కాళేశ్వరం తో సంభంధం లేకుండా కోటిన్నర మెట్రిక్ టన్నుల దాన్యాన్ని పండించామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు ఈ యాసంగి పంటలకు నీరు సరిగా ఇవ్వలేక పోతున్నారని అన్నారు. మెడిగడ్డ కూలిందనే సాకు చెప్పి గోదావరి నీరు ఆపకుండాఅన్నారం సుందిళ్ల రిజర్వాయర్ల వద్దలారీల కొద్ది అక్రమ ఇసుక బేరం సాగిస్తున్న మంత్రులవారి అనుయాయులు కొత్త వ్యాపారానికి శ్రీకారం చుట్టారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్ఆర్ఎస్పీ కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు రైతులు వేసిన పంటలు నిండిపోకుండా సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు గుండాగానీ రాములు గౌడ్ పాల్గొన్నారు.

## సంస్కృతికి ప్రతీక రంగవల్లి



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జనవరి 15 (జనంసాక్షి) :** హైందవ జాతి సంస్కృతికి ప్రతీక రంగవల్లులు అని నారాయణపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజి అన్నారు.నారాయణపేట జిల్లా కేంద్రంలో సంక్రాంతిని పురస్కరించుకుని ఎస్ ఎస్ కే.సమాజ్ దూల్ పేట ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలను పాటించి భావి తరాలకు అందించాలని కోరారు.ఈ ముగ్గుల పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి సుష్మా మాంద్రే,రెండవ బహుమతి బిందు కమలపూర్,తృతీయ బహుమతి వన్మాయి లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నారాయణరావు నగరి,మాజీ అధ్యక్షుడు నారాయణరావు కాంజి,మహిళా అధ్యక్షురాలు రెనుకాబాయి ఇతర పెద్దలు పాల్గొన్నారు.

## ఏళ్ళు గడుస్తున్నా ప్రారంభ దశలోనే నందనం నీరా శుద్ధి కేంద్రం



- ఎమ్మెల్యే చొరవ తీసుకొని వెంటనే ప్రారంభించాలి

**భువనగిరి, జనవరి 15 (జనం సాక్షి) :** ఏళ్లు గడుస్తున్నా నందనం గ్రామం నీరా శుద్ధి కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదని సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పరిటాల రవికుమార్ గౌడ్ అన్నారు. బుధవారం నాడు భువనగిరి మండలం నందనం గ్రామంలోని నీరా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ సోదరుల కుటుంబాల ఉపాధి కొరకు తాటి బెల్లం, తాటి నీరా తయారు చేయుటకు ప్లాంట్లను నెలకొల్పి ఆర్థిక చేయూతను అందించేందుకు గత ప్రభుత్వం నీరా శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పి ప్రారంభ దశలో ఆపేశారని అన్నారు. ఏళ్లు గడుస్తున్నా, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రారంభ దశకే పరిమితమైందని ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా అనేకసార్లు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. తక్షణమే ఎమ్మెల్యే చొరవ తీసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే నీరా కేంద్రాన్ని ప్రారంభించి గీత కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మండల అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, నందనం గ్రామ అధ్యక్షులు బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ఎంపిక సర్వే 20లోపు పూర్తి కావాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, జనవరి 15 (జనంసాక్షి) :** జనవరి 26 నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల పంపిణీ పథకాలను జనవరి 20 లోపు క్షేత్రస్థాయి సర్వే పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, రెవెన్యూ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు, వ్యవసాయ విస్తీర్ణాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సర్వే పై దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి అమలు చేయనున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందిందించి అర్హత లేని వాటిని తొలగించే విధంగా పకడ్బందీగా సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలక్టర్ ఆదేశించారు. రైతు భరోసాపై సర్వే చేసేందుకు మండలంలోని తహసిల్దార్, మండల వ్యవసాయాధికారి ఈ ప్రక్రియకు బాధ్యులుగా ఉంటారన్నారు.ప్రతి గ్రామానికి రెవిన్యూ ఇన్స్పెక్టర్, వ్యవసాయ విస్తీర్ణాధికారి ఒక జట్టుగా వ్యవహరించి రెవెన్యూ గ్రామం ఆధారంగా జట్టు సభ్యులు అన్ని సర్వే నెంబర్లను సందర్శించి, వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించాలని సూచించారు. ఇళ్ళు, రోడ్లు, పరిశ్రమలు నిర్మించుకున్న స్థలాలను వ్యవసాయ యోగ్యం లేని స్థలాలుగా గుర్తించాలని సూచించారు . లే అవుట్లు, భూసేకరణ చేసిన భూములను గుర్తించి వ్యవసాయ యోగ్యత లేని భూమిగ గుర్తించాలన్నారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వే సందర్భంగా పంచాయతీ సెక్రటరీ, రెవెన్యూ సిబ్బంది భూమి లేని కూలీలు ఎవరైతే 2023-24 సంవత్సరంలో కనీసం 25 రోజులు పనిచేసి ఉన్నారో అలాంటి వారిని గుర్తించి వారి ఆర్థిక స్థితిగతులు పరిశీలించి అర్హుల జాబితా రూపొందించాలన్నారు. రూపొందించిన జాబితాను జనవరి 21 నుండి 24 వరకు జరిగే గ్రామ సభలో పెట్టీ తీర్మానం చేయాల్సి ఉంటుంది.ఇందిరమ్మ ఇళ్ళ విషయంలో గుర్తించిన 36206 కుటుంబాలను సందర్శించి నిబంధనలకు అనుగుణంగా, వాస్తవంగా అర్హత కలిగిన పేద కుటుంబాలను మాత్రమే గుర్తించి జాబితా రూపొందించాలని సూచించారు. కొత్త రేషన్ కార్డుల విషయంలో తుది జాబితాలో చోటు లభించిన 6647 కుటుంబాలను సందర్శించి వాస్తవికంగా అర్హత ఉన్నదా లేదా అనేది గుర్తించి అర్హత కలిగిన వారి జాబితా రూపొందించాల్సి ఉంటుందని తెలియజేశారు.క్షేత్రస్థాయిలో పరిశీలన అనేది నిబంధనలకు అనుగుణంగా చాలా పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని ఆదేశించారు.సర్వే పూర్తి అయిన అనంతరం జనవరి 21 నుండి 24 వరకు సర్వేలో రూపొందించిన జాబితాను గ్రామ సభలో పెట్టీ ఆమోద తీర్మానం అందంతరం ఆన్లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని తెలియజేశారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, ఆర్డీఓ సుబ్రమణ్యం, జడ్పి సీఈఓ యాదయ్య, పి.డి గ్రామీణాభివృద్ధి శాఖ ఉమాదేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, డి.పి.ఒ సురేష్, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓ లు, ఎంపీఒ లు, ఏ. ఈ. ఒ లు, మున్సిపల్ కమిషనర్ లు, పంచాయతీ సెక్రటరీలు, సర్వే జట్టు సభ్యులు తదితరులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

## ఏఐసీసీ సంపత్ కుమార్ చొరవతో తెలంగాణ ప్రాంతానికి చేరుకున్న ఆర్డీఎస్ నీరు



**అయిజ, జనవరి, 15 (జనంసాక్షి) :** ఆర్డీఎస్ రైతులు అధైర్య పడొద్దని, మరో రెండు రోజుల్లో తుమ్మిల లిఫ్ట్ ద్వారా రైతులకు నీరు అందే అవకాశముందని అధికారులు తెలియజేశారు. అయిజ మండల పరిధి అయిన తెలంగాణ సరిహద్దు ప్రాంతం సింధనూర్ గ్రామం వద్దకు చేరుకున్న ఆర్డీఎస్ నీరు, ఏఐసిసి సంపత్ కుమార్ చొరవ వద్ద బుధవారం సాయంత్రం నాలుగు అడుగుల పైనే పారుతున్న యాసంగి సాగునీరు, సాయంత్రానికి ఉప్పల గ్రామం వరకు చేరే అవకాశం ఉంది అని అధికారులు అన్నారు. కెసి, కెనాల్‌కు పెట్టిన 2.5 ఇండెంట్ నీరు శుక్ర, శని వారాలు తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా రైతులకు అందే అవకాశం ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలియజేశారు.

## పోలీస్ శాఖ గౌరవాన్ని పెంచే విధంగా పనిచేయాలి

- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



**నల్లగొండ బ్యూరో, జనవరి 15 (జనంసాక్షి) :** పదోన్నతి పొందిన యస్ఐలకు పదవితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని క్రమ శిక్షణతో, బాధ్యతగా పని చేస్తూ ప్రజల మన్ననలు పొందుతూ పోలీస్ శాఖ పై ప్రజల్లో నమ్మకం పెరిగే విధంగా పని చేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు.బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 11 మంది ఏయస్ఐలకు యస్ఐలుగా పదోన్నతి పొందిన సందర్భంగా జిల్లా ఎస్పీ స్టార్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని, ప్రజలతో మమేకం అవుతూ బాధ్యతతో పని చేసి ప్రజల మన్ననలు పొందే విధంగా పని చేయాలి అన్నారు.పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులతో మర్యాద పూర్వకంగా ఉంటూ వారి సమస్యలు అడిగి తెలుసుకొని బాధితులకు సరైన న్యాయం జరిగే విధంగా పనిచేయాలని అన్నారు. అప్పుడే పోలీస్ శాఖకు గౌరవం వస్తుందని, దానిని పెంపొందే దిశగా పనిచేసి నల్లగొండ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకరావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

## చిరు ధాన్యాల్లోనే పుష్కలంగా పోషక విలువలు

- ప్రభుత్వ విధానాలతో భూమి, పాత పంటల మనుగడ ప్రశ్నార్థకం
- వడ్డీలో ఘనంగా 25వ పాత పంటల జాతర





**న్యాల్‌కల్, జనవరి 15 (జనంసాక్షి) :** శరీరానికి అవసరమైన పోషక విలువలు సమృద్ధిగా అందించే పంటలు కేవలం చిరు ధాన్యాల్లోనే పుష్కలంగా పోషక విలువలు ఉంటాయని, చిరు పంటలైన పప్పు ధాన్యాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింతగా దృష్టి సారించాలని ఐ సి ఏ ఆర్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా, పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ డి. ప్రసాద్ రావు, సీనియర్ జర్నలిస్ట్ పతంగి రాంబాబు, రైతు స్వరాజ్ వేదిక, సామాజిక కార్యకర్త ఉష సీతా లక్ష్మిలు అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, వడ్డీ గ్రామంలో డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ (డీడీఎస్) ఆధ్వర్యంలో 25వ పాత పంటల జాతరొత్సవాన్ని ప్రారంభించారు. స్థానిక శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయ్ కుమార్, జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, ఎంపీడీఓ రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, తదితర ప్రముఖులు, సంఘం మహిళ ప్రతినిధులు జ్యోతి ప్రజ్వలన అనంతరం కార్యక్రమాన్ని కొనసాగించారు. చిరు పంటల ఉత్పత్తికి ప్రోత్సహించిన పలువురు మహిళలకు పురస్కారాలను అందజేశారు. పాత పంటల జాతర ప్రారంభోత్సవానికి హాజరైన పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు, సామాజికవేత్తలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ చేపడుతున్న కార్యక్రమాలను గుర్తు చేస్తూ అభినందించారు. 25 సంవత్సరాలుగా సంక్రాంతి పర్వదినం, జనవరి మాసంలో పండగను జరుపు కోవడం ఎంతో హర్షనీయమన్నారు. అనంతరం మహిళలు, కళాకారులు ఆట, పాటలతో అలరించారు. కనుమరుగవుతున్న చిరు పంటల సాగుపై ఆట, పాటలతో కళాకారులు సందడి చేశారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళ రైతులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంతో ఇంటింటా సౌభాగ్యం

- మన ఊరు-మన ఎమ్మెల్యే పోస్టర్‌ను ఆవిష్కరించిన బీఎల్ఆర్





**వేములపల్లి, జనవరి 15 (జనంసాక్షి) :** సబ్బండవర్గాల సంక్షేమం నియోజకవర్గ సమగ్రాభివృద్దే ధ్యేయంగా ఇందిరమ్మరాజ్యంతో ఇంటింటా సౌభాగ్యాన్నినింపి గ్రామాల రూపురేఖలను మార్చేందుకు కృషి చేస్తానని మిర్యాలగూడఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిఅన్నారు. బుధవారం వేములపల్లి మండలం అమనగల్లు గ్రామంలోని శ్రీశ్రీశ్రీ పార్వతి రామలింగేశ్వర దేవాలయప్రాంగణంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేతావాత్ శంకర్ నాయక్ తో కలిసిమనఊరు-మనఎమ్మెల్యే పోస్టర్ ను ఆవిష్కరించారు. అంతకు ముందు ఎమ్మెల్యే బిఎల్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసిపార్వతి రామలింగేశ్వం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీకార్యకర్తల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకొని వెళ్లి రానున్నస్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మన ఊరు-మన ఎమ్మెల్యే కార్యక్రమంతో మిర్యాల గూడ నియోజకవర్గంలోని పల్లెపల్లెను సందర్శించి ప్రజా సమస్యలను పరిష్కరించి గ్రామాల రూపురేఖలు మార్చేందుకు ప్రత్యేక ప్రణాళికతో పని చేస్తానన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రభుత్వం త్వరలోనే అర్హులైన ప్రతిఒక్కరికి నూతనరేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, వ్యవసాయయోగ్యమైన ప్రతి ఎకరాకురైతు భరోసాతో రూ.12000, భూమిలేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12000 ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆమనగల్లు,లక్ష్మీదేవిగూడెంగ్రామపంచాయతీ పరిధిలోని 15 మంది లబ్దిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మనఊరు-మన ఎమ్మెల్యే పోస్టర్ ఆవిష్కరణకు ఆమనగల్లు గ్రామా నికి వచ్చిన ఎమ్మెల్యే బిఎల్ఆర్‌ను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మహిళలు కోలాట ప్రదర్శనలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు, చిరుమర్రికృష్ణయ్య,పగిడిరామలింగయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ధీరావత్ స్కైలాబ్ నాయక్ ,గడ్డం పురుషోత్తంరెడ్డి,మాజీ జెడ్పిటిసి పుల్లెంల సైదులు, తోపుచర్ల తాజామాజీ సర్పంచ్ మంగ యాదగిరి, తాళ్ల వెంకటేశ్వర్లు, పిల్లల సందీప్ నాయుడు, కట్టా శ్రీనివాస్ రెడ్డి, నన్నేబోయిన సైదులుయాదవ్, మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ స్పందన రెడ్డి, వల్లంపట్ల ఝాన్సీ ప్రవీణ్, కోలా సైదులు, పెరుమాండ్ల నగేష్, పెరుమాండ్ల కవిరాజు, జోజి, నార్ల అజయ్, కోల పెద్దసైదులు, వాకిటి బిక్షం, చింతకాయల వీరేందర్, వల్లంపట్ల వెంకన్న, వల్లంపట్ల జాను, కొడిదేల శంకర్, కొల్లిదిలీప్, సలికొలిమిల బిక్షమాచారి, ఎల్లయ్య, లొడంగి సైదులు, భయ్యా సైదులు, ముండ్ల గంగయ్య, పేర్ల శంకర్, వంగాల వెంకన్న, గొరోజు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పండగ సమయంలోనూ పనే..!

- రెండు రోజులు విధులు నిర్వర్తించిన జలమండలి ఉద్యోగులు
- అభినందించిన ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్



**హైదరాబాద్, జనవరి 15 (జనంసాక్షి) :** పండగ సమయాల్లోనూ జలమండలి ఉద్యోగులు విధులు నిర్వర్తించారు. సంక్రాంతి సమయంలో అందరూ సంతోషంలో మునిగిపోతే వీరు మాత్రం పనిలో నిమగ్నమయ్యారు. నగరంలో తలెత్తిన పలు సమస్యలను పరిష్కరించారు. కేపీహెచ్బీ, అమీర్పేట్, పంజాగుట్ట, మూసాపేట్, బంజారాహిల్స్, జగద్గిరిగుట్ట, ప్రగతినగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై ఏర్పడ్డ లీకేజీలు, సీవరేజ్, ఇతర సమస్యలను పరిష్కరించడానికి రాత్రి పగలు తేడా లేకుండా పని చేశారు. అవసరమైన చోట్ల పోలీసు, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, ట్రాన్స్ కో, టీజీఎస్పీడీసీఎల్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకున్నారు. ఈ సమయంలో నగరంలోని రోడ్లు ఖాళీగా ఉండటంతో.. వాటిపై ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఇదే మంచి సరైన సమయమని భావించి మరమ్మతులు చేపట్టారు. సాధారణ సమయంలో ఇలాంటి పనులు నిర్వహిస్తే ప్రజలకు ఇబ్బంది కలిగే అవకాశముండటంతో ఇప్పుడు వాటిని చేపట్టారు. పండగ సమయాల్లోనూ పని చేసిన జలమండలి సిబ్బంది, అధికారులను ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మాయాంక్ మిట్టల్ అభినందించారు.

# ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ..

## ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి



**కొండమల్లేపల్లి, జనవరి 15 (జనంసాక్షి) :** కుటుంబ పోషణ కోసం ఒకరు, బతుకుదెరువు కోసం వేరే రాష్ట్రం నుండి వచ్చిన ఇంకొకరు సంక్రాంతి పండుగ రోజు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్ర సమయంలో సూరెపల్లి గ్రామం గుడిపల్లి మండలానికి చెందిన మారేపల్లి ప్రేమ్ కుమార్ ( 27 ) చిలకమర్రిలో గల విజయ వర్ధన్ కాటన్ మిల్లులో సూపర్వైజర్ గా పని చేస్తున్నాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన అర్జున్ సహాని (30) తో కలిసి తన ద్విచక్ర వాహనం పైన పనిమీద టీవీఎన్ రెడ్డి కాటన్ మిల్లు వద్దకు వెళ్లి అక్కడ పని ముగించుకొని తిరిగి అదే ద్విచక్ర వాహనంపై కొండమల్లేపల్లికి వస్తుండగా మార్గమధ్యలో హైదరాబాదు రోడ్డులో గల భారత్ పెట్రోల్ బంకు దగ్గర గల మూలపు వద్దకు చేరుకున్న సమయంలో కొండమల్లేపల్లి వైపు నుండి అజాగ్రత్తగా అతివేగంగా వస్తున్న లారీ ఎంహెచ్ 40 సీఎం 2287 గల లారీ డ్రైవర్ తన లారీని అతివేగంగా నడిపి అదుపు చేయలేక మృతులు ఇద్దరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనానికి ఎదురుగా వచ్చి బలంగా ఢీకొట్టగా ఇద్దరికీ తలలకు ఇతర శరీర భాగాలకు తీవ్ర రక్త గాయాలై అక్కడిక్కడ మృతి చెందారు.మృతుడు ప్రేమ్ కుమార్ తండ్రి మారేపల్లి పిలుపు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపారు.

## ట్రాక్టర్ పోటీలు డ్రైవర్ల సామర్థ్యం పెంచుతాయి



**బూర్గంపహాడ్, జనవరి 15 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలంలో ట్రాక్టర్ పోటీలు డ్రైవర్ల సామర్థ్యాన్ని పెంచుతాయని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని మోరంపల్లి బంజర గ్రామంలో కొందరు రైతులు, పెద్దల సహకారంతో ఏర్పాటు చేసిన ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కొద్దిసేపు ఆయన ట్రాక్టర్ రివర్స్ పోటీల్లో పాల్గొన్నారు. 320 అడుగులు, 8 అడుగుల వెడల్పు గీతల మధ్య ట్రాక్టర్ ట్రాలీని రివర్స్ లో రెండు నిముషాల వ్యవధిలో 11 మంది డ్రైవర్లు చేరుకోవడం అభినందనీయమన్నారు. 50 మంది డ్రైవర్లు పాల్గొనగా ప్రథమ బహుమతి జింకల సుందర రామిరెడ్డి, ద్వితీయ బహుమతి బుడ్డగూడెం గ్రామానికి చెందిన బొర్రా శ్రావణ్, తృతీయ బహుమతి మర్రికుంటకు చెందిన మడకం రాజు సాధించగా వారికి ఎమ్మెల్యే చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, లక్ష్మీపురం ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పోటీ నిర్వాహకులు, గ్రామపెద్దలు, ట్రాక్టర్ డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు గోవిందా అంటూ ముగ్గులు వేసి నిరసన

**వనపర్తి, జనవరి 15 (జనంసాక్షి) :** కాదేది కవితకనర్హం అన్నట్లు ఉంది రాజకీయాలకు సంబంధించిన వ్యాఖ్యలు.ఆరు గ్యారంటీలు గోవిందా అంటూ ముగ్గులు వేసి చేస్తున్న నిరసనలు కొత్త పోకడలకు శ్రీకారం చుడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ గోవిందా, రేవంత్ రెడ్డి గోవిందా అంటూ ముగ్గులు వేసి నిరసన తెలిపారు వనపర్తి పట్టణంలోని 30 వ వార్డు వార్డు కౌన్సిలర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్. రైతు భరోసా గోవిందా, తులం బంగారం గోవిందా, రైతు రుణమాఫీ గోవిందా, 4000 పింఛను గోవిందా, మహాలక్ష్మి 2500 గోవిందా, ఆరు గ్యారంటీలు గోవిందా అంటూ ముగ్గులు వేసి నిరసన తెలిపారు. 6 గ్యారంటీలు నమ్మి మోసపోయామని, 100 రోజులో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదని, రైతు భరోసా రూ.15000 ఇస్తానని చెప్పి రెండు సీజన్లు ఎగగొట్టాడ అని, రుణమాఫీ కాలేదని, ఆరు గ్యారంటీలు బోగస్ అయ్యాయని ఆ ముగ్గుల్లో రాశారు. రైతు భరోసా రాక పండుంగా చేసేదేలా అంటూ ఇంటి ముందు ముగ్గులు వేసి నిరసన తెలిపారు ఆ వార్డుకు చెందిన జంగిడిపురం నివాసులు.

## సాగు చేయని భూములను గుర్తించాలి

- సాగుచేయు భూములకే రైతు భరోసా
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 15 (జనంసాక్షి) :** సాగు చేయని భూములను క్షేత్ర స్థాయి పర్యాటనలలో గుర్తించి వారిని రైతు భరోసా పథకానికి అనర్హులుగా గుర్తించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.బుధవారం సూర్యాపేట తహశీల్దార్ కార్యాలయంలో నేటి నుంచి గ్రామాల వారీగా జరిగే క్షేత్రస్థాయి పర్యటనల వివరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయం చేసుకుంటూ ఈ నెల 16 నుండి 20 వరకు గ్రామాల వారీగా క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తూ సర్వే నెంబర్ ప్రకారం సాగు చేయని భూములను గుర్తించాలన్నారు.సాగు చేయని భూములలో రాళ్లు, గుట్టలను సర్వేయర్ ద్వారా వివరాలు సేకరించాలని, పట్టణంలోని లే అవుట్ లు, నాలాగా మార్చిన భూములను,ఇండస్ట్రీ లకి సంబందించిన వివరాలను మున్సిపల్ కమిషనర్ ద్వారా సేకరించాలని సూచించారు.సాగు చేయని భూముల వివరాలను జనవరి 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో తెలియపరిచి వారిని రైతు భరోసా పథకంకు అనర్హులుగా గుర్తించాలని సూచించారు.తదుపరి సాగు చేసే ప్రతి ఎకరానికి సంవత్సరానికి 12 వేల రూపాయలను రైతు భరోసా పథకం క్రింద ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు .ఈ సమావేశంలో తహశీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ సుక్మిద్దీన్,మండల వ్యవసాయ అధికారి సందీప్, సర్వేయర్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రం సిబ్బంది మొత్తాన్ని ఉద్యోగాల నుండి తొలగించిన కలెక్టర్



**గుర్రంపోడు, జనవరి 15 (జనంసాక్షి) :** ముందస్తు అనుమతి లేకుండా గుర్రంపోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సిబ్బంది మొత్తానికి మొత్తం విధులకు గైర్హాజరు కావడంపై ఆగ్రహించిన జిల్లా కలెక్టర్ గుర్రంపోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది అందరిని ఉద్యోగం నుంచి తొలగించడం, రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులను విధుల నుండి సస్పెండ్ చేయడం జరిగింది.బుధవారం ఆమె గుర్రంపోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ సందర్భంగా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ తో సహా ఎవరు విధులలో లేరు అందరూ విధులకు గైర్హాజరయ్యారు .ప్రభుత్వం బుధవారం ఎలాంటి సెలవును ప్రకటించనప్పటికీ బాధ్యత లేకుండా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మొత్తం ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడం సోచనియమని కలెక్టర్ అన్నారు.కాగా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం హెల్త్ అధికారి హరిలాల్ మాత్రం ఉపనియామకంపై ఇతర చోట పనిచేస్తున్నారు.కాంటాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న ఫార్మసిస్టు శ్యామ్, ల్యాబ్ టెక్నీషియన్ సంధ్య, డేటా ఎంట్రీ ఆపరేటర్ మాధవి, అటెండర్ శ్రీనివాస్, అటెండర్, అరుణ జ్యోతి, అటెండర్ ఎల్లమ్మ లను ప్రభుత్వ ఉద్యోగాల నుండి తొలగిస్తున్నట్లు తెలిపారు. అలాగే అటెండర్ లక్ష్మీనారాయణ, ఫార్మసిస్ట్ భాగ్యమ్మ రెగ్యులర్ ఉద్యోగులను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే ప్రతి ఉద్యోగిపై ఇలాంటి చర్యలే తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం , వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నప్పటికీ ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని గాలికి వదిలేసి సిబ్బంది మొత్తం గైర్హాజరు కావడం బాధాకరమని ,అందువల్లనే అందరినీ ఉద్యోగాల నుంచి తొలగించడం లేదా విధుల నుండి సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారు.

## రేషన్ కార్డుల సర్వేకు ప్రజలు సహకరించాలి



**శామీర్‌పేట్, జనవరి 15 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం తూంకుంట పురపాలక సంఘ పరిధిలోని అన్ని వార్డులలో ఈ నెల 16 నుండి రేషన్ కార్డుల సర్వే మొదలవుతున్నందున మున్సిపల్ సిబ్బంది పారదర్శకంగా చెయ్యాలని తుంకుంట మున్సిపల్ కమీషనర్ వెంకట్ గోపాల్ అన్నారు.బుధవారం తుంకుంట మున్సిపాలిటీ లో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సర్వేకు పురపాలక సంఘం నుండి వార్డు ఆఫీసర్లు, రెవిన్యూ విభాగం నుండి వెరిఫికేషన్ ఆఫీసర్లుగా వస్తారని మరియు ఇప్పటికే ప్రభుత్వం నుండి పొందిన జాబితాలోని అర్హులను గుర్తించి వారి వివరాలు నమోదు చేసి వార్డు సభలు ఏర్పాటు చేసి అర్హుల యొక్క జాబితాను ఆమోదించి తిరిగి ప్రభుత్వానికి అందజేస్తారని ఇట్టి విషయమై సర్వేకి వచ్చే సిబ్బందికి పురపాలక సంఘ ప్రజలు పూర్తిగా సహకరించాలని మున్సి పల్ కమిషనర్ కోరారు.ఈ కార్యక్రమంలో డి ఈ సునీత, మేనేజర్ శ్రావణ్ కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప ఆధ్యాత్మిక కేంద్రం కన్హా శాంతి వనం

## లక్ష మంది ఏక కాలంలో ధ్యానం చేసే ప్రకృతి ఒడి కేంద్రం

## కన్హా శాంతి వనాన్ని సందర్శించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి)

కన్హా శాంతి వనం గొప్ప ఆధ్యాత్మిక కేంద్రం అని, మానసిక ప్రశాంతతకు నిలయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ శివారులోని కన్హా శాంతి వనాన్ని చిన్నారెడ్డి సందర్శించారు. వేయి ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న కన్హా శాంతి వనాన్ని కలియ తిరిగి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఈ శాంతి వనంలో ఏక కాలంలో ఒక లక్ష మంది ధ్యానం చేసుకునే మందిరాలు నిర్మించడం, విద్యా, వైద్యం వంటి సౌకర్యాలు ఉండటం చూసి చిన్నారెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేశారు. దైనందిన జీవితంలో మనిషి వివిధ అంశాలపై ఒత్తిడికి గురవుతున్నారని, ఇలాంటి సమయంలో కన్హా శాంతి వనంలో సాంత్వన లభిస్తుంది అని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ధ్యానం, యోగాలను భారత దేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరాలు అని చిన్నారెడ్డి తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలు, దేశంలోని అనేక రాష్ట్రాలకు చెందిన ప్రజలు కన్హా శాంతి వనంలో సాంత్వన పొందుతున్నారని, వారికి వేదికను అందించిన రామచంద్ర మిషన్ సంస్థ చైర్మన్ కమలేష్ డీ పటేల్ కు చిన్నారెడ్డి అభినందనలు తెలిపారు. కన్హా శాంతి వనాన్ని అధ్భుతంగా తీర్చిదిద్దారని అన్నారు.

# నూతన పథకాలను అమలు చేసి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలి

## అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా చూడాలి

## ఈ నెల 26 నుంచి నూతన పథకాలు అమలు

## ఉమ్మడి మెదక్ జిల్లా కలెక్టర్లతో మంత్రి కొండా సురేఖ సమీక్ష

సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 15 (జనం సాక్షి)





నూతన పథకాలను అమలు చేసి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ కలెక్టర్లను ఆదేశించారు.సంగారెడ్డి,మెదక్ సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు వల్లూరు క్రాంతి, రాహుల్ రాజ్,మిక్కిలినేని మను చౌదరిలతో ఢిల్లీ నుంచి గూగుల్ మీట్ ద్వారా సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే పరమావధిగా ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న నూతన పథకాలను నిబద్ధతతో అమలు చేసి, ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని మంత్రి సురేఖ సూచించారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 26 జనవరి 2025 నాటికి 75 సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు నిర్ణయించడం జరిగిందని మంత్రి సురేఖ తెలిపారు.రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుకు సంబంధించిన పథకాల అమలు విధివిధానాలు, లబ్దిదారుల ఎంపిక, క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలు తదితర అంశాల పై మంత్రి సురేఖ కలెక్టర్లతో చర్చించారు. రాజకీయ ప్రమేయం లేకుండా, మానవతా దృక్పథంతో పథకాల ప్రయోజనాలు పేద ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గాల స్థాయిలో వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి, తనను చేర్చాలని, దీంతో పథకాల అమలు తీరును తెలుసుకోవడానికి తనకు అవకాశముంటుందని మంత్రి సురేఖ ప్రజాప్రతి నిధులకు కోరారు. సర్వసన్నద్ధంగా వుండి జనవరి26 నుంచి నూతన పథకాల అమలులో ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా అత్యుత్తమ పనితీరును కనబర్చాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. నిర్లక్ష్యం వహించినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలకు వెనుకాడనని మంత్రి సురేఖ హెచ్చరించారు. అతి త్వరలో మరో మీటింగ్ ద్వారా నూతన పథకాల అమలు పై కూలకషంగా చర్చిస్తామని మంత్రి సురేఖ తెలిపారు. ఈ వీడియో సమీక్ష సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉమ్మడి మెదక్ జిల్లా నోడల్ ఆఫీసర్ హరి చందన, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, పిడి డిఆర్డిఏ జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జడ్పీ సీఈవో జానకి రెడ్డి, పిడి హౌసింగ్ చలపతిరావు రెవిన్యూ డివిజనల్ అధికా రులు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పసుపు రైతుల జీవితాల్లో కొత్త కాంతులు

కరీంనగర్ బ్యూరో, జనవరి 15 (జనంసాక్షి) :



మాటకు కట్టుబడి పసుపు బోర్డును ఏర్పాటు ఘనత బీజేపీదే

నిజామాబాద్ పసుపు బోర్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో వర్చువల్ గా పాల్గొన్న బండి

నిజామాబాద్ లో పసుపు బోర్డు ఏర్పాటుతో పసుపు పండించే రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు రాబోతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పసుపు బోర్డును నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే, తనను గెలిపిస్తే పసుపు బోర్డును ఏర్పాటు చేయిస్తానని రాతపూర్వకంగా హామీ ఇచ్చి అనేక ఇబ్బందులు పడ్డ అరవింద్ అనుకున్నది సాధించినందుకు ఆనందంగా ఉందని తెలిపారు. బోర్డు ఏర్పాటుకు సహకరించిన మంత్రి పీయూష్ గోయల్ కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం రోజు నిజామాబాద్ లో పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఢిల్లీ నుండి వర్చువల్ గా ప్రారంభించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కరీంనగర్ లోని తన కార్యాలయం నుండి వర్చువల్ గా హాజరై ప్రసంగిస్తూ బోర్డు ఏర్పాటు కోసం క్రుషి చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ...అందరికీ మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ రోజు రైతుల పండుగ ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల ప్రజలకు ఇయాళ శుభవార్త అందించిన మహనీయుడు ప్రధాని నరేంద్రమోదీ, సహకరించిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ కు, ఈ బోర్డు ఏర్పాటులో కర్త, కర్మ, క్రియగా ఉంటూ మొండిపట్టుతో విజయం సాధించిన ఎంపీ ధర్మపురి అరవింద్, బోర్డు ఛైర్మన్ గా నియమితులైన పల్లె గంగారెడ్డికి, స్థానిక ఎమ్మెల్యేలకు, పసుపు రైతులకు అభినందనలు తెలిపారు. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించిన ఈ శుభ ఘడియల్లో పసుపు బోర్డును ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో పసుపు బోర్డు కోసం 178 మంది పసుపు రైతులు లోక్ సభ ఎన్నికల్లో నామినేషన్లు వేసి పసుపు బోర్డు అంశాన్ని జాతీయస్థాయిలోకి తీసుకెళ్లారు. "బీజేపీ ఎంపీగా గెలిచిన తరువాత పసుపు బోర్డును తీసుకురాకపోతే రాజీనామా చేస్తా"

నని ధర్మపురి అరవింద్ రాతపూర్వకంగా హామీ ఇచ్చి అనేక ఇబ్బందులు పడ్డ ధర్మపురి అరవింద్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎందుకంటే పసుపు

బోర్డు ఏర్పాటువల్ల ఈ ప్రాంత ప్రజలకు అనేక ప్రయోజనాలు కలగబోతున్నయ్ అని తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు కలగబోతున్నయ్, పసుపు ఉత్పత్తుల ధరను బోర్డు నిర్ణయిస్తుంది, పసుపు దిగుబడి ఎక్కువైనా గిట్టుబాటు ధర రాదనే బాధే ఉండదు, పసుపు బోర్డే రైతు ఉత్పత్తులను నేరుగా కొనుగోలు చేసి వాటిని ప్రత్యేక స్టోరేజీల్లో ఉంచుతుందని బ్రాండింగ్, ప్రమోషన్ స్కీమ్స్, ప్యాక్కింగ్ తోపాటు జాతీయంగా, అంతర్జాతీయ ఎగుమతులను చేసే అవకాశముందన్నారు. ప్రతి ఏటా పసుపు బోర్డుకు కేంద్రం బడ్జెట్ లో ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారని ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తుందని ప్రక్రుతి వైపరీత్యాలవల్ల పంట నష్టపోతే రైతులు నష్టపోకుండా పంట బీమాకు చర్యలు తీసుకుంటుందని క్వాలిటీ డిపార్ట్మెంట్ ఏర్పాటు ద్వారా నిరంతరం క్వాలిటీ చెక్, క్వాలిటీ పెంచే విధంగా చర్యలు తీసుకుంటారు. అంతిమంగా బోర్డు ఏర్పాటుతో పసుపు పంటను పండిస్తున్న రైతులకు మంచి రోజులు రాబోతున్నాయని తెలియజేసుకుంటూ, అందరికీ మరోసారి సంక్రాంతి శుబాకాంక్షలు తెలియజేస్తున్నానని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.

# మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం



నారాయణపేట జిల్లా బ్యూరో (జనంసాక్షి)

మహిళల రక్షణే షి టీం ప్రధాన లక్ష్యమని నారాయణపేట జిల్లా ఎస్పి యోగేష్ గౌతం అన్నారు. మహిళలు, యువతులు, బాలికలు ఆకతా యిల వలన గానీ,మరే విధమైన వేధిం పుల వలన గానీ ఇబ్బందులు ఎదుర్కొంటు న్నట్లయితే నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లాలో మహిళల రక్షణ కోసం షీటీమ్స్,యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తు న్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యా యానికి గురైనప్పుడు భయ పడొద్దని, గృహహింసకు గురై న ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై ఖచ్చితంగా చర్యలు తీసు కుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థినులు బస్టాండ్ల దగ్గర, గ్రామాలలో,కాలనీలలో ర్యాగింగ్,ఈవ్ టీజింగ్ లకు గురైనా, ఉద్యోగ మహిళలు పని చేసే ప్రదేశాల వద్ద వేధింపులకు గురైనా, బాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినా వెంటనే నిర్భయంగా షీ టీమ్ పోలీసులను ఆశ్రయిస్తే సత్వర న్యాయం చేకూరుస్తామని ఎస్పీ తెలిపారు. షీటీమ్స్ ద్వారా జిల్లా వ్యాప్తం గా అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, జిల్లా వ్యా ప్తంగా షీటీమ్స్ ద్వారా మహిళలు సామాజిక మాధ్యమాలైన ఫేస్బుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ వినియోగంలో జాగ్రత్తలు వహించాలని, వాటిలో ఫొటోలు, వీడియోలు పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల

జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేరుగా సంప్రదించలేని వారు 8712670398 ఫోన్ నంబరుకు లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని వారి వివరా లను గోప్యంగా ఉంచడం జరుగుతుందని అట్టి వ్యక్తు లపై చట్ట ప్రకారం కఠిన చర్య లు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

# కే.వీ.కేశవులు సేవలు చిరస్మరణీయం

ఎమ్ ఎల్ సి టి.జీవన్ రెడ్డి

హైదరాబాద్ (జనంసాక్షి)



మాజీ మంత్రి,స్వాతంత్ర సమరయోధులు,మేరు ట్రస్ట్ వ్యవస్థాపకులు కే.వీ.కేశవులు సేవలు చిరస్మరణీయం అని ఎమ్ ఎల్ సి టి.జీవన్ రెడ్డి అన్నారు.కే.వీ.కేశవులు 101వ జయంతి సందర్భంగా గాంధీ భవన్ లో జరిగిన కార్యక్రమంలో ఎమ్ ఎల్ సి టి.జీవన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని కేశవులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. కే.వీ.కేశవులు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా,రజాకార్ల అరాచకాలకు ఎదురొడ్డి తన ఇంటిమీద జాతీయ పతాకాన్ని ఎగురవేశారని గుర్తు చేశారు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి జరిగిన పోరాటంలో కేవీ కేశవులు ప్రధాన పాత్ర పోషించడని కొనియాడారు. అలాగే మేరు సంఘం ట్రస్ట్ ను ఏర్పాటు చేసి మేరు భవనం నిర్మాణానికి ముందుండి సహాయ సహకారాలు అందించిన గొప్ప నాయకుడి కే వీ కేశవులు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు టి.కుమార్ రావు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కె.వెంకటేష్,రాజేందర్ యాదవ్, మేరు సంఘం రాష్ట్ర నాయకులు కీర్తీ రాజ్ గోపాల్,వాడపల్లి మాధవ్, ఓదెల శేఖర్,మాడి శెట్టి రమేష్ పాల్గొన్నారు.

# తెలంగాణకు మద్దతు ఇవ్వండి

మంథని, (జనంసాక్షి)



సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి

కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ కు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి

: సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, కేంద్రం కూడా సహకరించాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు బుధవారం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ను ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీకి ముందుకొచ్చే పరిశ్రమలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, ఇతర అంశాలను మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందని తెలిపారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. పలు ప్రముఖ సంస్థలు తెలంగాణలో తమ డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తాయని, ఇలాంటి తరుణంలో డేటా భద్రత కీలకంగా మారిందన్నారు. అందుకే 'నేషనల్ డిజాస్టర్ రికవరీ జోన్' ఏర్పాటు చేయడం ఆవశ్యమన్నారు. ఈ అంశంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సెమీ కండక్టర్ మిషన్ పురోగతిపై ఆయన అభినందనలు తెలిపారు. వచ్చే నెల 24న హైదరాబాద్ లో నిర్వహించనున్న బయో ఏషియా సదస్సుకు హాజరు కావాలని కోరారు.

# నాచారం సురానా వైర్స్ పరిశ్రమలో అగ్రిప్రమాదం

తప్పిన ప్రాణాపాయం

హైదరాబాద్: హైడాబాద్ నాచారం పీఎస్ పరిధిలో అగ్నిప్రమాదం జరిగింది. సురానా వైర్స్ పరిశ్రమలో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అప్రమత్తమైంది. సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుంది. దీంతో మంటలు అదుపులోకి వచ్చాయి. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.ఇటీవల పరిశ్రమల్లో జరుగుతున్న అగ్నిప్రమాదాలతో భారీగా ఆస్తినష్టం సంభవిస్తుండడంతో పాటు ప్రాణనష్టం కూడా అధికంగానే ఉంటుంది. యాజమాన్యాలు నిబంధనలు పాటించకపోవడం.. భద్రతాప్రమాణాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం ఇందుకు కారణం. పారిశ్రామిక వాడలు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. ఆయా పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో తెలుగు రాష్ట్రాలతోపాటు బీహార్,

గుజరాత్, ఒరిస్సా తదితర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. ముఖ్యంగా పటాన్‌చెరు, జిన్నారం, ఐడీఏ బొల్లారం, కంది, హత్నూర, సదాశివపేట తదితర మండలాల్లో భారీ పరిశ్రమలు ఉన్నాయి. ఈ కంపెనీల్లో తరచూ అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు జరుగుతున్నాయి. దీంతో కార్మికుల భద్రత సవాలుగా మారుతోంది.

# యాంత్రికరణతో శారీరక శ్రమ లేకుండా పోయింది





క్రీడలతో శారీరక శ్రమ... మానసిక ఉల్లాసం

నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి

మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 15 (జనం సాక్షి):

ఈరోజు ఓటమే రేపటి గెలుపుకు నాంది అని... ఓటమి చెందిన వారు నిరుత్సాహ పడవద్దని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం పైతర గ్రామంలో గత ఐదు రోజులుగా జరిగిన పైతర ప్రీమియర్ లీగ్ సీజన్ 2 క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విన్నర్ టీం లోకల్ బాయ్స్ జట్టుకు 20వేల రూపాయల నగదు బహుమతి, రన్నర్ టీం సూపర్ స్ట్రైకర్స్ జట్టుకు పదివేల రూపాయల నగదు బహుమతితో పాటు ట్రోఫీలను బుధవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ పి పి ఎల్ సీజన్ 2 పోటీలకు గ్రౌండ్ స్పాన్సర్ టిపిసిసి నర్సాపూర్ నియోజకవర్గ డెలిగేట్ సోమన్న గారి రవీందర్ రెడ్డి గ్రౌండ్ స్పాన్సర్ కాగా, నాలుగు జట్లకు లోకల్ బాయ్స్ జట్టుకు ఎల్లుగారి శ్రీనివాస్ రెడ్డి, గల్లీ క్రికెటర్స్ జట్టుకు సమరసింహారెడ్డి, 11 స్టార్స్ జట్టుకు ఏ ఆదం, సూపర్ స్ట్రైకర్స్ జట్టుకు వెల్మకన్నె ఎల్లేశం టీ షర్ట్స్ స్పాన్సర్స్ గా, అలాగే బ్యాట్స్ స్పాన్సర్లు కుమ్మరి సత్యం, మహేశ్వర్ రెడ్డి, బాల్స్ పాన్సర్ జంగం రాజు, వాటర్ స్పాన్సర్ కుమ్మరి శివకుమార్ వ్యవహరిస్తుండగా, గెలిచిన జట్లకు విన్నర్ కు 20 వేల రూపాయలు, రన్నర్ కు 10000 రూపాయల నగదు ప్రైజ్ తో పాటు, ట్రోఫీలను బి ఆర్ ఎస్ యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి సమకూర్చారు. పండగ వేల యువతను ఒకచోట ఆటలాడేందుకు సహకరించిన వీరందరికీ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో మన పెద్దలు వ్యవసాయ పనులు చేయడంతో ఆరోగ్యకరంగా ఉండేవారని... కానీ నేడు యాంత్రికరణతో శారీరక శ్రమ లేకుండా పోయిందన్నారు. తద్వారా అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. యువత సెల్ఫోన్లకు పరిమితమై అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నారని, క్రీడలతో శరీరానికి వ్యాయామం... మానసికోల్లాసం సమకూర్తుందన్నారు. అలాగే ఈ ప్రాంత అభివృద్ధికి తన శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నర్సాపూర్ నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎల్లుగారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఈ పోటీలను నిర్వహించేందుకు తన వంతు సహకారం అందించానన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంపల్లి గౌశంకర్ గుప్తా, రంగంపేట సొసైటీ చైర్మన్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్ కుమార్, సి డి సి మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు ముత్యం గారి సంతోష్ కుమార్, పాడెపు నారాయణ, మాజీ సర్పంచులు మురళి గౌడ్, వెల్మకన్న సంతోష ఏలేషం, టిఆర్ఎస్ పార్టీ యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎల్లు గారి శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ రంగారెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు బోయిని అంజనేయులు, షాదుల్లా, జీవయ్య, సుధాకర్, నర్సింలు, ఆర్గనైజర్స్ బండాల లక్ష్మణ్, రాపోల్ రన్వీర్, కుమ్మరి నరేష్, నాగరాజు గౌడ్, ఎల్లమయ్య యువకులు పాల్గొన్నారు.

# బాపూజీ యూత్ క్లబ్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం



## జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం.

కరీంనగర్ బ్యూరో, జనవరి 15 (జనంసాక్షి) :

బుధవారం రోజు కొత్తపల్లి పట్టణం లో బాపూజీ యూత్ క్లబ్ అధ్యక్షులు పొన్నం సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో పొన్నం సాత్విక్ స్పాన్సర్షిప్ లో జరుగుతున్నటివంటి మూడు (3) రోజుల క్రికెట్ టోర్నమెంట్ జరిగింది. టోర్నమెంట్ లో భాగంగా చివరి రోజున టిపిసిసి జనరల్ సెక్రటరీ, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ ముఖ్య అతిథిగా హాజరై, కొత్తపల్లి మునిసిపల్ చైర్మన్ రుద్ర రాజు, మాజీ కొత్తపల్లి ఎంపీపీ వాసాల రమేష్, కరీంనగర్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాచకొండ ప్రభాకర్ లతో కలిసి విజేతలకు (విన్నర్, రన్నర్) వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన ప్లేయర్ లకు బహుమతి , నగదు ప్రోత్సాహకాలు ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. ఈదర - ఈ ఖాదిమాన్ ఈ మిలాత్ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 105 వితంతు మహిళలకు పెన్షన్ , దుప్పట్ల పంపిణీ. బుధవారం రోజు కరీంనగర్ పట్టణంలోని ఈదర - ఈ ఖాదిమాన్ ఈ మిలాత్ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 105 వితంతు మహిళలకు పెన్షన్ , దుప్పట్ల పంపిణీ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కరీంనగర్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... స్వచ్ఛంద

సంస్థ చేస్తున్న కార్యక్రమాల కోసం రూ.50,000 విరాళం ప్రకటించిన టిపిసిసి జనరల్ సెక్రటరీ కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్. ఈ కార్యక్రమం లో ఆయనతో కలిసి పాల్గొన్న ఎన్జీవో సెక్రటరీ అబ్దుల్ సమద్ నవాబ్, ఎన్జీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను జిల్లాలో పకడ్బందీగా అమలుచేయాలి

**● జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నల్లగొండ బ్యూరో, జనవరి 15 (జనంసాక్షి) :** రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,నూతన రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్ల పథకాలను నల్గొండ జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.ఇందుకుగాను పక్కా ప్రణాళిక తో గ్రామాలకు వెళ్లాలని అన్నారు.ఈ నాలుగు పథకాలను రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి అమలు చేయనున్న దృష్ట్యా ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఆయా పథకాలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన,గ్రామసభల నిర్వహణ, అర్హుల జాబితా ఆమోదం వంటివి పూర్తి చేయాలని చెప్పారు.ఈ పథకాల పకడ్బందీ అమలు కోసం నియోజకవర్గాల వారిగా ప్రత్యేక అధికారులను నియమించడమే కాకుండా, జిల్లా అధికారులు మండల స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించే విధంగా ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు.రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల అమలుపై బుధవారం ఆమె ఉదయాదిత్య భవన్లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ నాలుగు ప్రాధాన్యత పథకాల అమలుకు సూచనలు ఇస్తూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఈ పథకాలను అమలు చేయాలని చెప్పారు. రైతు భరోసాకి సంబంధించి భూభారతి పోర్టల్ నుండి పట్టాదారు పాసుపుస్తకాలు కలిగి ఉన్న వారి వివరాలన్నిటిని హార్డ్ కాపీలను మండల వ్యవసాయ అధికారికి డేటా ఇవ్వడం జరుగుతుందని, మండల వ్యవసాయ అధికారి ,తహసిల్దారులు బుధవారమే సంబంధిత డేటాను డౌన్లోడ్ చేసుకొని ఈనెల 16 నుండి 20 వరకు గ్రామాలలో సర్వే నంబరు వారిగా సర్వే చేసి వ్యవసాయానికి యోగ్యం కాని భూములను గుర్తించే పనిని చేయాలని ఆదేశించారు.ఈ బృందంలో వ్యవసాయ విస్తరణ అధికారి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లేదా ఎవరైనా ఒక రెవెన్యూ అధికారి ఉండాలని,వీరు వ్యవసాయయోగ్యం కానీ భూములను కేటగిరి వారిగా నమోదు చేయాలని,ఇందులో లే అవుట్లు, ప్లాట్లు, ఇండ్లు, రాళ్ల రప్పలు, గుట్టలున్న భూములు,తదితర భూములను ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం గుర్తించి ప్రభుత్వం పంపించిన ప్రొఫార్మాలో నింపాలని ఆదేశించారు. దీనిని తహసిల్దారు, వ్యవసాయ అధికారి ధ్రువీకరించాలన్నారు. ఈనెల 21 నుండి 24 వరకు గ్రామపంచాయతీ వారిగా గ్రామసభలు నిర్వహించి ఇలా గుర్తించిన వ్యవసాయానికి యోగ్యం కాని భూముల చదివి వినిపించి ఆమోదం తీసుకోవాలని ,అదే సమయంలో ఎప్పటికప్పుడు డేటాను ఆన్లైన్ చేయాలని తెలిపారు. ఈనెల 25న జిల్లా ఇన్చార్జి మంత్రితో అర్హుల జాబితా ఆమోదం తీసుకుని, ఈ నెల 26 నుండి అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 2023- 24 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద కనీసం 20 రోజులు పని చేసిన వారి జాబితా రాష్ట్రస్థాయి నుండి గ్రామసభల నిర్వహణలోపు వస్తుందని, ఆ జాబితాను గ్రామసభల్లో చదివి వినిపించి ఆ జాబితా పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే పది రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. నూతన రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులన్నింటిని గ్రామసభల్లో చదివి వినిపించి ఆమోదం తీసుకోవాలని, ఈనెల 26న కనీసం 10శాతం నూతన రేషన్ కార్డులు ఇవ్వాల్సి ఉంటుందని ఆ విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో అర్హత పొందిన ఆన్లైన్ డేటా జాబితాను రెండు రోజుల్లో సూపర్ చెక్ పూర్తి చేయాలని, అలాగే ఏదైనా గ్రామం, మండలానికి సంబంధించి బదిలాయించే దరఖాస్తులను సైతం ఈనెల17 లోగా పూర్తి చేయాలని చెప్పారు. ఈనెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో ప్రాధాన్యత క్రమంలో లబ్ధిదారుల జాబితాను ఆమోదించాలని, అనంతరం జిల్లా ఇన్చార్జి మంత్రితో జాబితాను ఆమోదించి పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని ఆమె వెల్లడించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,డిఆర్డిఏ శేఖర్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి శ్రావణ్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు,జిల్లా అధికారులు,మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# మియాపూర్‌లో గంజాయి విక్రేత అరెస్ట్



**శేరిలింగంపల్లి, జనవరి 15 (జనంసాక్షి) :** ఎండు గంజాయిని విక్రయిస్తూ ఓ వ్యక్తి మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్టయిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మియాపూర్ సిఐ కె. క్రాంతి కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం... మియాపూర్ పోలీస్ స్టేషన్ మెట్రో పిల్లర్ 603 వద్ద మాదాపూర్ ఎస్ఓటి విభాగం పోలీసులు, మియాపూర్ పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీని నిర్వహిస్తుండగా నాగర్ కర్నూలు జిల్లా ఇంద్రకల్ గ్రామానికి చెందిన ఇంద్ర కుమార్(27) అనుమానాస్పదంగా కనిపించడంతో అతనిని క్షుణ్ణంగా తనిఖీ చేయగా 6.5 కిలోల బరువున్న వెండి గంజాయి లభ్యమయింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖ జిల్లా అరకులో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ను నడుపుతున్నట్టు తెలిసిందని, అరకు నుండి సొంత గ్రామానికి విచ్చేస్తున్న క్రమంలో అక్కడి నుండి సదరు ఎండు గంజాయిని తీసుకొని వస్తున్నట్లు తేలింది. కాగా గతంలో సైతం అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న కేసులో అరెస్టై ఏడాది పాటు జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు సీఐ వివరించారు. ఈ మేరకు కేసును నమోదు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

# ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలి



**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 15 (జనంసాక్షి) :** ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా సమర్థవంతంగా కార్యాచరణను అమలు చేయాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ కలెక్టర్లను ఆదేశించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే పరమావధిగా ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న నూతన పథకాలను నిబద్ధతతో అమలు చేసి, ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని మంత్రి సురేఖ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉమ్మడి మెదక్ జిల్లా నోడల్ ఆఫీసర్ హరి చందన, అదనపు కలెక్టర్ నగేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులు క్రీడలలో రాణించి గ్రామానికి పేరు తీసుకురావాలి

**● జిల్లా మత్స్యశాఖ అధ్యక్షులు ఆలుగడ్డ కాంత్ కుమార్**



**నారాయణపేట జిల్లా బ్యూరో, జనవరి 15 (జనంసాక్షి) :** ప్రతి క్రీడాకారుడు క్రీడలలో రాణించి గ్రామానికి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని మత్స్యశాఖ జిల్లా అధ్యక్షులు ఆలుగడ్డ కాంత్ కుమార్ అన్నారు.బుధవారం మండల పరిధిలోని జాజాపురంలో కొనసాగుతున్న జిపిఎల్ క్రికెట్ పోటీలను ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గత ఐదు సంవత్సరాల నుండి జీపీఎల్ క్రికెట్ పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అంతే కాకుండా ప్రతి క్రీడాకారుడు ఆత్మవిశ్వాసంతో స్నేహపూర్వకంగా పోటీలలో పాల్గొని విజయం సాధించాలని ఆయన కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి క్రీడలు ఏర్పాటు చేయడం తో ఆయన నిర్వాహకులకు అభినందించారు. అదేవిధంగా బుధవారం జరిగిన క్రికెట్ పోటీలలో ఆయన టాస్ వేసి క్రీడాకారులకు పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో జే పీ ఎల్ క్రికెట్ నిర్వాహకులు ఆలుగడ్డ రవికుమార్ వై వెంకటేష్ కే లక్ష్మణ్ పి హరీష్ గౌడ్ పి శివకుమార్ గౌడ్ లతోపాటు క్రీడాకారులు గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేయాలి

**జిల్లా కలెక్టర్ త్రిపాఠి**

**నల్లగొండ బ్యూరో, జనవరి 15 (జనంసాక్షి) :** రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్లపథకాల కింద పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపికను చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.బుధవారం ఆమె నల్గొండ జిల్లా, గుర్రంపోడు ఎంపీడీవో కార్యాలయంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పై సమావేశం నిర్వహించారు.ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా గ్రామసభల ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఎంపిక చేయాలని కలెక్టర్ అన్నారు .రైతు భరోసా కింద భూభారతి లోని డేటా మొత్తం మండల స్థాయిలో వ్యవసాయ అధికారి ,తహసీల్దారులకు హార్డ్ కాపీ ఇవ్వడం జరిగిందని, అలాగే వ్యవసాయేతర భూములు, పరిశ్రమలు,లే-అవుట్లు, ఇండ్లు తదితర వివరాలన్నీ సంబంధిత శాఖల అధికారుల ద్వారా ముందే సేకరించి ఉంచడం జరిగిందని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి వీటిని పరిశీలించి 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో వాటిని చదివి వినిపించి వాటిని తొలగించి, అర్హులైన వారి జాబితాను రూపొందించాలని చెప్పారు. అదే విధంగా రేషన్ కార్డుల జాబితాను గ్రామ సభలలో చదివి వినిపించాలని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే పది రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, అర్హత ఉన్న వారికి 26 న రేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని,అలాగే ఇందిరమ్మ ఇండ్ల కింద ప్రాధాన్యత క్రమంలో గుర్తించిన లబ్ధిదారుల జాబితాను గ్రామ సభల్లో ఆమోదించాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి రెండు విడతల్లో 6000 చొప్పున 12000 ఇచ్చే విధంగా ప్రభుత్వ ఆదేశించడం జరిగిందని, జాబ్ కార్డు కలిగి ఉండి ఎలాంటి భూమి లేని ,గత సంవత్సరం కనీసం 20 రోజులు ఉపాధి హామీ కింద పని చేసిన కుటుంబం ఇందుకు అర్హులని తెలిపారు. ఈ నాలుగు పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి వివాదాలకు అవకాశం ఇవ వద్దని పూర్తి పారదర్శకంగా గుర్తించాలని చెప్పారు.ఈ సమావేశంలో చండూరు ఆర్డీవో శ్రీదేవి, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, తాసిల్దార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.




# ఇందిరమ్మ ఇండ్ల అర్హుల ఎంపిక కోసం సర్వే

**● అడిషనల్ డిఆర్డిఓ, డిఆర్డిఏ, మండల ప్రత్యేక అధికారి శారద**

**● 21 జనవరి నుండి 24 వరకు ఆరు ప్రత్యేక బృందాలతో గ్రామాలలో గ్రామ సభలు**



**తిరుమలగిరి (సాగర్), జనవరి 15 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాల అమలుకై లబ్ధిదారుల ఎంపిక చేయనున్నట్లు మండల ప్రత్యేక అధికారి శారద అన్నారు. దీనికోసం జనవరి 16 నుండి 20 వరకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక కోసం ఆయా గ్రామాలలో వ్యవసాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు 16వ తేదీ నుండి 20వ తేదీ వరకు సర్వే నిర్వహించి లబ్ధిదారులను గుర్తిస్తారన్నారు. అనంతరం 21వ తేదీ నుండి 24వ తేదీ వరకు ఆరు ప్రత్యేక బృందాలతో గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి, అర్హుల జాబితాను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. దీనిపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసిల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో మల్లేశ్వర్ లతో కలసి సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా కింద ఎకరాకు ఒక సంవత్సరానికి 12 వేల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేస్తారని తెలిపారు. దీనికోసం తహసిల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది వ్యవసాయ యోగ్యంకాని భూములను గుర్తిస్తారని అన్నారు. భూమిలేని వ్యవసాయ కూలీలను గుర్తించి వారికి రెండు విడతలలో 6000 చొప్పున సంవత్సరానికి 12,000 ప్రభుత్వం చెల్లిస్తుందని, దీనికోసం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పేరు నమోదు చేసుకున్న కుటుంబం 2023 – 24 సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పని చేసినవారు అర్హులన్నారు.. రేషన్ కార్డులకు సంబంధించి కార్డులు లేని, అదేవిధంగా రేషన్ కార్డులలో పేరు నమోదు కాని వారి వివరాలు సేకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గంట హర్షిత ,ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రదీప్ రెడ్డి, ఎంపీఓ భిక్షం రాజ్, గిర్దావర్ లక్ష్మీకాంత్ ,వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మొదటి విడతలో నిరుపేదలకు ప్రాధాన్యం

**● జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 15 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి కీలకమైన నాలుగు సంక్షేమ పథకాల అమలును జనవరి 26న ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా, మండల స్థాయి అధికారులందరూ నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. గ్రామ సభలను పక్కాగా నిర్వహించాలని, ఈ నెల 16(రేపటి) నుంచి 20 వరకు చేపట్టే క్షేత్రస్థాయి సర్వేలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అత్యంత జాగ్రత్తగా ఈ ప్రక్రియను సజావుగా పూర్తిచేయాలని, అలాగే 16 నుంచి 20 వరకు లబ్ధిదారుల ముసాయిదా జాబితా తయారీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని, 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభలు పక్కాగా జరిగే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని, 21 నుంచి 25 వరకు డేటా ఎంట్రీలో తప్పులు దొర్లకుండా చూడాలని, ఫ్లెక్సీలు, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని, అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులో ప్రచురించాలని, గ్రామ సభల్లో వచ్చే ఫిర్యాదులపై రిజిస్టర్ లను, కంట్రోల్ రూం లను ఏర్పాటు చేసి, అర్జీలను స్వీకరించాలని, ఈ సర్వే, గ్రామ సభల పట్ల ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని, విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, మెదక్ ఆర్డిఓ రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో జై చంద్ర రెడ్డి, డిపిఓ యాదయ్య, జిల్లా వ్యవసాయ అధికారి వినయ్, హౌసింగ్ పీడీ మాణిక్యం, జిల్లాలోని ఆర్డీఓలు, ఎస్డీసీలు, తహసీల్దార్ లు, ఎంపిడిఓలు, ఎంపీఓలు, ఎంఏఓలు, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ ప్రత్యేక అధికారులు, డిప్యూటీ తహసీల్దార్ లు, ఆర్ఐలు, ఏఈఓలు, సర్వేయర్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జంట హత్యలు కలకలం

**రాజేంద్రనగర్, జనవరి 15 (జనంసాక్షి) :** మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడ లాంకో హిల్స్ క్వారీ గుంతల వద్ద జంట హత్యలు కలకలం రేపాయి. దీంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ జంట హత్యల సంఘటనలో పోలీసులు సుదీర్ఘ విచారణ చేపడుతున్నారు. బుధవారం నార్సింగ్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం పుప్పాలగూడ గ్రామంలోని అనంత పద్మనాభ స్వామి దేవాలయం వద్ద ఓ మహిళ మృతదేహం, ఆ పక్కనే కొద్ది దూరంలో మరో వ్యక్తి మృతదేహం పడి ఉండడంతో విధుల నిమిత్తం అక్కడకు వెళ్లిన మణికొండ మున్సిపాలిటీ బిల్ కలెక్టర్ లోకేష్ నార్సింగ్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు మధ్యప్రదేశ్ కు చెందిన బిందు ద్వారక(25) సొంత రాష్ట్రం కాగా, హైదరాబాద్‌లో చింతల కుంట వనస్థలిపురంలో నివసిస్తున్నట్లు గుర్తించారు. అలాగే చత్తీస్గఢ్ రాష్ట్రానికి చెందిన అంకిత్ సాకేత్ (25) శేర్లింగంపల్లిలో నానక్ రాంగూడలో ఉంటున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ జంట హత్యలతో పోలీసులు కేసు నమోదు చేసుకొని పేరుపై వివాహేతర సంబంధమో, లేక మరే కోణంలోనైనా హత్యలు జరిగాయని పోలీసులు సమగ్ర విచారణలో దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలి



**● జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి బ్యూరో, జనవరి 15 (జనంసాక్షి) :** ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలను అందిస్తున్నామని, కాబట్టి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా, అన్ని పిహెచ్సి ల పరిధిలో ఏఎన్సి( ప్రెగ్నెన్సీ కేసులు) రిజిస్ట్రేషన్ ల సంఖ్య పెరగాలని సూచించారు. ఆశ వర్కర్లు, ప్రైవేట్ ఆస్పత్రిల నుంచి డేటా తెప్పించుకొని ఏఎన్సీ( ప్రెగ్నెన్సీ కేసులు) రిజిస్ట్రేషన్లు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం పై ఆ విషయంలో శాఖ ఉన్నతాధికారులు దృష్టి సాధించాలని చెప్పారు. పీహెచ్సిలలో ప్రసవాల సంఖ్య పెరగక పోవడానికి గల కారణాలు ఏంటని ఆరా తీశారు. వచ్చే నెల నుంచి పీహెచ్సీలలో ప్రసవాల సంఖ్య పెరగాలని సూచించారు. సమావేశంలో డిఎంహెచ్ఓ శ్రీనివాసులు, సాయినాథ్ రెడ్డి, సూపరిండెంట్ రంగారావు, పి వోలు, ఎంవోలు, ఇతర వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మన సంస్కృతి సంప్రదాయాలు భావితరాలకు అందించాలి

**● రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి**




**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 15 (జనంసాక్షి) :** మన సంస్కృతి సంప్రదాయాలను భావి తరాలకు అందించాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. నేటి తరం పిల్లలు, యువత సెల్ ఫోన్ లకు అలవాటు పడి మన సంప్రదాయాలను మరిచిపోతున్నారని అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సద్దల చెరువు మినీ ట్యాంక్ బండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉండ్రుగొండ అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ వూర రామ్మూర్తి గాయత్రి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒకప్పుడు గ్రామాలలో సంక్రాంతి అనగానే గొబ్బెమ్మ లు, గంగిరెద్దులు, ఆటలు గుర్తుకు వస్తాయని అన్నారు.సద్దల చెరువు మినీ ట్యాంక్ బండ్ ప్రాంతంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఐదు కోట్ల రూపాయల వ్యయంతో సుందరమైన ప్రదేశంగా అభివృద్ధి చేసి పట్టణ ప్రజలకు సాయంత్రం పూట కుటుంబంతో సంతోషంగా గడపడానికి తగిన ఏర్పాట్లు చేస్తామని, ఎసి క్రూజ్ బోట్ నిర్మాణం జరుగుతుందని అన్నారు.వచ్చే సంవత్సరం దాదాపుగా వెయ్యి మంది మహిళలు పాల్గొనే విధంగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని అన్నారు.ముగ్గుల పోటీలలో మొదటి బహుమతిని నార్లకుంట నర్మద, రెండవ బహుమతిని పోలా పద్మ, మూడవ బహుమతిని జూలూరి మమత, నాలుగవ బహుమతిని ఉమ గెలుపొందారు.వారికి డాక్టర్ రామ్మూర్తి యాదవ్ కుమార్తె నేహ ఆధ్వర్యంలో తయారు చేసిన నామం బ్రాండెడ్ చీరలు బహుమతిగా అందజేశారు.పోటీలలో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు షఫి వుల్లా, వెలుగు వెంకన్న, నామా అరుణ, శ్రీవిద్య కరుణాకర్, పటేల్ లావణ్య రమేష్ రెడ్డి, వెలుగు సంతోషి, వాసవి క్లబ్ జ్యోతి, ఫరూక్, నిమ్మల వెంకన్న, వల్దాసు దేవేందర్, ఉపేందర్, శ్రీనివాస్, బైరబోయిన శ్రీనివాస్, నార్ల వాసు, నాగార్జున, చైతన్య క్లబ్, స్త్రీ శక్తి, ఆండాల్ గోష్టి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లోన్లపై కొత్త వడ్డీ రేట్లు..




ఎస్‌బీఐ కీలక ప్రకటన చేసింది. లేటెస్ట్ ఎంసీఎల్ఆర్ రేట్లు ప్రకటించింది. ఈ ఎంసీఎల్ఆర్‌ను బట్టే లోన్లపై వడ్డీ రేట్లు ఆధారపడి ఉంటాయని చెప్పొచ్చు. జనవరి 15 నుంచే ఈ కొత్త వడ్డీ రేట్లు అమల్లోకి రానున్నాయి. ఏయే ఎంసీఎల్ఆర్ ఏ లోన్లకు ముడిపడి ఉంటాయనేది చూద్దాం.

ప్రభుత్వ రంగానికి చెందిన అతిపెద్ద బ్యాంక్.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను సవరించింది. ఇప్పుడు జనవరి 15 నుంచి కొత్త వడ్డీ రేట్లు అమల్లోకి రానున్నట్లు వెల్లడించింది. ఇది 2025 ఫిబ్రవరి 15 వరకు కొనసాగుతాయని తాజాగా బ్యాంక్ తన అధికారిక వెబ్‌సైట్లో వెల్లడించింది. ఎంసీఎల్ఆర్ మారితే బ్యాంకులో ఇతర అన్ని రకాల లోన్లపై ప్రభావం పడుతుందని చెప్పొచ్చు. ఇందులో హోం లోన్లు, పర్సనల్ లోన్లు, కార్ లోన్లు వంటివి ఉన్నాయి. అయితే ఫైనల్ రుణ రేట్లు అనేది రుణ గ్రహీత ఆదాయం, జీతం, సిబిల్ స్కోరు ఇతర అంశాల ఆధారంగా మారుతుంటాయని చెప్పొచ్చు. ఎంసీఎల్ఆర్ అనేది బ్యాంకులు దాదాపు ప్రతి నెలా ప్రకటిస్తూనే ఉంటాయి. ఇవి పెరగొచ్చు లేదా తగ్గొచ్చు లేదా స్థిరంగా ఉండొచ్చు.

ఎంసీఎల్ఆర్ అనేది రుణ ఆధారిత వడ్డీ రేటు. బ్యాంకులు లోన్లపై వసూలు చేసే కనీస వడ్డీ రేటు అన్నమాట. దీని కంటే తక్కువ వడ్డీకి బ్యాంకులు లోన్లు ఇచ్చేందుకు వీలుండదు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేట్లను బట్టి ఇది మారుతుంటుంది. రెపో రేటు పెరిగితే బ్యాంకులు ఎంసీఎల్ఆర్ పెంచుతుంటాయి. అక్కడ తగ్గిస్తే.. ఇక్కడ కూడా ఎంసీఎల్ఆర్ తగ్గుతుందని చెప్పొచ్చు. ఇక ఎంసీఎల్ఆర్ పెరిగితే లోన్ వడ్డీ రేట్లు పెరుగుతాయి. అప్పుడు ఎక్కువ ఈఎంఐ కట్టాల్సి వస్తుంది.

2025 జనవరికి సంబంధించి ఎస్బీఐ లేటెస్ట్ ఎంసీఎల్ఆర్ రేట్ల విషయానికి వస్తే.. ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 8.20 శాతం వద్ద ఉంది. 3 నెలల ఎంసీఎల్ఆర్ 8.55 శాతంగా ఉంది. 6 నెలల టెన్యూర్‌కు ఎంసీఎల్ఆర్ 8.90 శాతంగా ఉంది. ఎక్కువగా ఆటో లోన్లకు లింక్ అయి ఉండే ఏడాది టెన్యూర్ ఎంసీఎల్ఆర్ 9 శాతంగా ఉండగా.. రెండేళ్లు, మూడేళ్ల ఎంసీఎల్ఆర్ 9.05 శాతం, 9.10 శాతంగా ఉన్నాయి. పర్సనల్ లోన్లు.. రెండేళ్ల టెన్యూర్‌కు ముడిపడి ఉంటాయి. అంటే 9.05 శాతం ఎంసీఎల్ఆర్ కాగా.. దీని కంటే కాస్త ఎక్కువ శాతంతో వడ్డీ రేట్లు ప్రారంభమవుతుంటాయి. ఇక ఎస్బీఐ బేస్ రేటు 10.40 శాతంగా ఉంది. బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు వార్షిక ప్రాతిపదికన చూస్తే 15.15 శాతంగా ఉంది. ఎస్బీఐ హోం లోన్ ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు 9.15 శాతంగా ఉంది. కొత్త లోన్లపై హోం లోన్ వడ్డీ రేట్లు ప్రస్తుతం 8.50 శాతంగా ఉంది. ఇతర బ్యాంకుల విషయానికి వస్తే బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంకు, ఐడీబీఐ బ్యాంకు ఎంసీఎల్ఆర్ రేట్లను సవరించలేదు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మాత్రం ఎంపిక చేసిన టెన్యూర్లపై 5 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది.

## 5 ఏళ్లకే లక్షను రూ.32 లక్షలు చేసిన స్టాక్..

రియల్ ఎస్టేట్ సెక్టార్‌కి ప్రముఖ కంపెనీ ఆర్డీబీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ పవర్ లిమిటెడ్ స్టాక్ అదరగొట్టింది. గత 5 ఏళ్ల సంవత్సరాల్లో ఏకంగా 3056 శాతం లాభాన్ని అందించి మల్టీబ్యాగర్ స్టాక్ గా నిలిచింది. లక్ష రూపాయల పెట్టుబడిని దాదాపు రూ.32 లక్షలు చేసింది. ఇప్పుడు కొత్త ప్రాజెక్టు అందుకున్నట్లు ప్రకటించిన క్రమంలో ఫోకస్ లోకి వచ్చింది. మరి ఆ స్టాక్ గురించి ఇప్పుడే తెలుసుకుందాం.



స్మాల్ క్యాప్ కేటగిరి రియల్ ఎస్టేట్ సెక్టార్ కంపెనీ ఆర్డీబీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ పవర్ లిమిటెడ్ స్టాక్ అదరగొట్టింది. తమ ఇన్వెస్టర్లను దీర్ఘకాలంలో మిలియనీర్లను చేసింది. ఈ కంపెనీ షేరు గత ఐదేళ్లలో కళ్ళు చెదిరే లాభాలు అందించింది. గత 5 ఏళ్లలో 3056 శాతం లాభాన్ని అందించి మల్టీబ్యాగర్ షేర్లలో ఒకటిగా నిలిచింది. ఒకవేళ 5 ఏళ్ల క్రితం రూ. 1,00,000 పెట్టుబడి పెట్టి షేర్లు కొన్నట్లయితే ఇప్పుడు మీ షేర్ల విలువ దాదాపు రూ. 32 లక్షలు అవుతుంది. ఐదేళ్ల క్రితం రూ. 15.68 వద్ద ఉన్న కంపెనీ షేరు.. ఇప్పుడు రూ. 495 వద్దకు చేరింది.

జనవరి 10, 2025 నాటి దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ టెండర్లలో పాల్గొని రెండు లెటర్ ఆఫ్ అవార్డ్స్ పొందినట్లు కంపెనీ తెలిపింది. మొదటి ప్రాజెక్టులో భాగంగా జార?ండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని డీవీసీ కమాండ్ ప్రాంతంలో వివిధ రకాల బిల్డింగులపై 10 సామర్థ్యం గల గ్రిడ్ కనెక్టెడ్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇందు కోసం కావాల్సిన ఎక్విప్మెంట్స్, స్పేర్ పార్ట్స్ సరఫరా చేయనున్నట్లు కంపెనీ తెలిపింది. రెండో ఒప్పందం (ప్రాజెక్టు)లో భాగంగా ఐదేళ్ల పాటు సోలార్ పీవీ ప్లాంట్ పూర్తి నిర్వహణ, ఆపరేషన్, మెయింటనెన్స్ చేయాలని తెలిపింది. ఈ ప్రకటన చేసిన క్రమంలో స్టాక్ ఫోకస్‌లోకి వచ్చింది. ఇన్వెస్టర్లు కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

కంపెనీ స్టాక్ అవుట్ లుక్ పరిశీలిస్తే ఇవాళ్టి స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో ఆర్డీబీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ పవర్ షేరు 2.04 శాతం లాభపడి రూ. 494.85 వద్ద ట్రేడవుతోంది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ ధర రూ. 612.65, కనిష్ఠ ధర రూ. 78.30గా ఉంది. గత వారం రోజుల్లో ఈ షేరు 1 శాతం, గత నెల రోజుల్లో 8 శాతం నష్టపోయింది. అయితే గత ఆరు నెలల్లో ఈ షేరు 240 శాతం మేర లాభాలు ఇచ్చింది. గత ఏడాదిలోనే ఈ షేరు 468 శాతం మేర పెరిగింది. గత ఐదేళ్లలో 3056 శాతం లాభాన్ని అందించింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 855.27 కోట్లుగా ఉంది. ఈ స్టోరీ కేవలం సమాచారం కోసమే. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు రిస్క్‌తో ఉంటాయి. నష్టభయం ఎక్కువ. పూర్తి వివరాలు తెలుసుకుని, నిపుణుల సలహా మేరకే పెట్టుబడి పెట్టాలి. లేదంటే నష్టపోవచ్చు.

## పాత పన్ను విధానం రద్దు?

కేంద్ర ప్రభుత్వం కొంత కాలంగా కొత్త పన్ను విధానంలోనే ఎక్కువగా మార్పులు చేస్తూ.. ట్యాక్స్‌పేయర్లకు దీనిని ఆకర్షణీయంగా మారుస్తున్న సంగతి తెలిసిందే. దీంట్లోనే పన్ను రేట్లను సరళీకరిస్తూ వచ్చింది. పన్ను రేట్లు ఇక్కడే కాస్త తక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలోనే కొన్నాళ్లుగా మార్పులు చేయని పాత పన్ను విధానాన్ని కేంద్రం రద్దు చేస్తుందన్న అనుమానాలు పెరిగిపోతున్నాయి. నిపుణులు ఏమంటున్నారో చూద్దాం.

భారత్‌లో నిర్దిష్ట ఆదాయ పరిమితి దాటితే పన్ను చట్టంలోని పన్ను శ్లాబులకు అనుగుణంగా ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుందన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం పాత, కొత్త అని రెండు పన్ను విధానాలు ఉన్న సంగతి తెలిసిందే. డీఫాల్ట్‌గా మాత్రం కొత్త పన్ను విధానాన్నే ఉంచగా.. అవసరమైతే పాత పన్ను విధానంలోకి మారొచ్చు. అయితే ఈ క్రమంలోనే ఇప్పుడు 2025, ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌కు ముందు ఈ పన్ను విధానంపై తెగ చర్చ నడుస్తోంది. పాత పన్ను విధానాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయొచ్చన్న అనుమానం పెరుగుతోంది. ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వ వర్గాల నుంచి దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన రానప్పటికీ.. సంకేతాలు అలానే ఉన్నాయని చెబుతున్నారు నిపుణులు. ఎప్పుడైనా దీనిపై ప్రకటన రావొచ్చన్న చర్చ నడుస్తోంది. 2020 బడ్జెట్ సమయంలోనే కేంద్ర ప్రభుత్వం.. కొత్త పన్ను విధానం లాంఛ్ చేసింది. అయితే పాత పన్ను విధానంలో పన్ను



మినహాయింపులు, తగ్గింపులు ఉన్నట్లుగా కొత్త పన్ను విధానంలో లేకపోయినా ట్యాక్స్ రేట్లు మాత్రం దానితో పోలిస్తే కాస్త తక్కువే ఉన్నాయని చెప్పొచ్చు.

అయితే పాత పన్ను విధానంలో పలు పథకాల్లో పెట్టుబడులపై, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై, హోం లోన్ అసలుపై ఇలా వేర్వేరు పెట్టుబడులపై ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80 సహా ఇతర సెక్షన్ల కింద పన్ను తగ్గించుకునేందుకు చాలానే ఆప్షన్లు ఉన్నాయి. అందుకే ఇలాంటి బెనిఫిట్స్ కోరుకునేవారు.. పాత పన్ను విధానంలో కొనసాగుతున్నారు. అయితే ఆకర్షణీయ స్థాయిలో వడ్డీ రేట్లు తక్కువగా ఉన్న క్రమంలో.. ఎక్కువగా కొత్త పన్ను విధానాన్నే ఎంచుకుంటున్నారు. సెక్షన్ 80 కింద గరిష్టంగా ఒక ఆర్థిక సంవత్సరంలో రూ. 1.50 లక్షల వరకు ట్యాక్స్ తగ్గించుకోవచ్చు. నిపుణులు మాత్రం ఇప్పుడు పాత పన్ను విధానం రద్దు ఉంటుందన్న వాదనలతో ఎక్కువగా ఏకీభవిస్తున్నారు.

'కొత్త పన్ను విధానానికి కేంద్ర ప్రభుత్వం పక్షపాతంగా వ్యవహరిస్తోంది. కొత్త పన్ను విధానం ప్రకటించిన తర్వాతి నుంచి చూస్తే.. పాత పన్ను విధానంలో ఎలాంటి మార్పులు చేయట్లేదు. ఇక్కడ మినహాయింపుల్ని పెంచట్లేదు. ఆర్థిక మంత్రి ఒక్కసారిగా పాత పన్ను విధానాన్ని పూర్తిగా రద్దు చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని ముంబై బేస్డ్ ట్యాక్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఎక్స్‌పర్ట్ బల్వంత్ జైన్ అన్నారు.

పాత పన్ను విధానాన్ని రద్దు చేయాలన్న ఆలోచన ఏదైనా కేంద్రానికి ఉంటే.. ముందుగానే దీని గురించి ప్రకటన చేస్తే.. దానికి తగ్గట్లుగా ఎక్కువగా పెట్టుబడులు పెట్టే మధ్యతరగతి వారు ఏర్పాట్లు చేసుకుంటారని చెబుతున్నారు విభావంగల్ అనుకులకర ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సిద్ధార్థ్ మౌర్య. ఇంకా..

ఒకవేళ కేంద్రం దశలవారీగా పాత పన్ను విధానం రద్దు చేయాలని చూస్తే.. అప్పుడు కొత్త పన్ను విధానంలోనూ ఏమైనా మినహాయింపులు కల్పించి మధ్యతరగతికి ప్రోత్సాహం కల్పించాలని కోరుతున్నారు ఫిన్‌కార్పిట్ కన్సల్టింగ్ అసోసియేట్ డైరెక్టర్ గౌరవ్ సింగ్ పార్మర్. మరి బడ్జెట్‌లో దీనిపై నిర్మలమ్మ ఏమైనా ప్రకటన చేస్తారో చూడాలి.

## కార్చిచ్చుకు కారణమేంటి..



అమెరికా చరిత్రలో అత్యంత ఘోర విపత్తుగా భావిస్తున్న లాస్ ఏంజెల్స్ కార్చిచ్చు ఇంకా కొనసాగుతూనే ఉన్నది. జనవరి 7న మొదలైన ఈ వైల్డ్ ఫైర్ వారం రోజులు గడుస్తున్నప్పటికీ పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. అగ్నిమాపక సిబ్బంది చిన్నచిన్న మంటలను అదుపులోకి తెస్తున్నా.. పెద్ద అగ్ని కీలలు అదుపులోకి రావడం లేదు.

లాస్ ఏంజెల్స్: అమెరికా చరిత్రలో అత్యంత ఘోర విపత్తుగా భావిస్తున్న లాస్ ఏంజెల్స్ కార్చిచ్చు ఇంకా కొనసాగుతూనే ఉన్నది. జనవరి 7న మొదలైన ఈ వైల్డ్ ఫైర్ వారం రోజులు గడుస్తున్నప్పటికీ పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. అగ్నిమాపక సిబ్బంది చిన్నచిన్న మంటలను అదుపులోకి తెస్తున్నా.. పెద్ద అగ్ని కీలలు అదుపులోకి రావడం లేదు. బలమైన గాలుల కారణంగా మంటలు మరింత తీవ్రతరం అవుతాయని అంచనావేస్తున్నారు.కాగా, కార్చిచ్చు కారణంగా ఇప్పటివరకు వేలాది ఇండ్లను ధ్వంసమవగా, 25 మంది మృతిచెందారు. దాదాపు 30 మంది తప్పిపోగా వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. సుమారు 30 వేల ఎకరాలకుపైగా ఈ మంటలు వ్యాపించినట్లు తెలుస్తున్నారు. అసలు ఈ కార్చిచ్చుకు కారణం ఏంటి? మంటలు ఎలా అంటుకున్నాయి? దీనివెనుక ఏదైనా కుట్ర దాగి ఉన్నదా? అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాణాలను హరిస్తున్న దావాగ్నిపై ఫెడరల్ విచారణ ప్రారంభమైంది. జోస్ మెడినా ఆధ్వర్యంలో 75 మందితో కూడిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఆల్కహాల్ టొబాకో అండ్ ఫైర్‌ఆర్మ్స్ బృందం దర్యాప్తు చేపట్టింది. మంటలు ఎలా అంటుకున్నాయనే ప్రశ్నకు సమాధానం కోసం అంతా ఎదురుచూస్తున్నారు. ప్రతిఒక్కరికి సందేహాన్ని తాము తీర్చుతాం. కానీ లోతుగా విచారించిన తర్వాతే జవాబు లభించే అవకాశం ఉంటుందని విచారణ బృందానికి నేతృత్వం వహిస్తున్న జోస్ అన్నారు. ఈనెల 7న లాస్ ఏంజెల్స్‌కు పశ్చిమాన 32 కిలోమీటర్ల దూరంలోని పాలిసేస్‌లో మంటలు అంటుకున్నాయి. లాస్ ఏంజెల్స్ మాత్రమే కాదు, కాలిఫోర్నియాలోని చుట్టుపక్కల నగరాల నుంచి తెప్పించిన ఫైర్ ఇంజిన్లు, హెలికాప్టర్లతో నీటిని గుమ్మరిస్తున్నా మంటలు అదుపులోకి రావడం లేదు. ఇక్కడ 23 వేలకుపైగా ఎకరాల్లో మంటలు అంటుకున్నాయి.బలమైన గాలులు వీస్తుండటంతో లాస్ ఏంజెల్స్‌కు ఉత్తరం వైపున ఈటన్ ప్రాంతానికి మంటలు వ్యాపించాయి. ఇక్కడ కూడా 14 వేల ఎకరాలకు మంటలు అంటుకున్నాయి. శాన్ ఫెర్నాండోకు ఉత్తరాన హస్ట్ అనే చోట కూడా కార్చిచ్చు అంటుకున్నది. ఇక్కడ 800 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఆస్తులు కాలిబూడిదయ్యాయి.

న్యూ ఇయర్ వేడుకల ప్రభావమేనా?

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కాల్చిన బాణసంచా వల్ల కార్చిచ్చు సంభవించినట్లు అనుమానిస్తున్నారు. ఉపగ్రహ ఛాయా చిత్రాలు, రేడియో కమ్యూనికేషన్లు, స్థానికుల కథనాలు ఈ అనుమానాలకు ఊతమిస్తున్నాయి. దీనిపై వాషింగ్టన్ పోస్ట్ ఓ వార్త కథనాన్ని ప్రచురించింది.

దొంగల చేతివాటం... పాలిసేడ్స్‌లో సంపన్నులు నివసిస్తుంటారు. కార్చిచ్చు వల్ల వారు ఇండ్లను వదిలి వెళ్లిపోయారు. దీంతో దొంగలు ఆ ఇండ్లను దోచుకుంటున్నారు. ఓ దొంగ ఏకంగా అగ్నిమాపక సిబ్బంది ధరించే యూనిఫాంతో సంచరించడాన్ని అధికారులు గుర్తించారు.

## క్యాన్సర్ నుంచి బయటపడ్డాను..

బ్రిటన్ యువరాజు విలియం సతీమణి, ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్ కేట్ మిడిల్టన్ కీలక ప్రకటన చేశారు. తాను క్యాన్సర్ నుంచి బయటపడ్డట్లు వెల్లడించారు.

బ్రిటన్ యువరాజు విలియం సతీమణి, ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్ కేట్ మిడిల్టన్ కీలక ప్రకటన చేశారు. తాను క్యాన్సర్ నుంచి బయటపడ్డట్లు వెల్లడించారు. ఈ మేరకు ఇన్ స్టా వేదికగా పోస్టు పెట్టారు. ఇప్పుడు చాలా ఉపశమనంగా ఉందని, ఇక నుంచి పూర్తిగా కోలుకోవడం పైనే దృష్టిసారించినట్లు తెలిపారు. అయితే సాధారణ స్థితికి రావడానికి ఇంకాస్త సమయం పడుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు విలియమ్‌తో కలిసి ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న క్యాన్సర్ రోగులను పరామర్శించారు. గతేడాది చికిత్స సమయంలో ఆసుపత్రి సిబ్బంది తనను చాలా బాగా చూసుకున్నట్లు కేట్ మిడిల్టన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ మేరకు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. తాను క్యాన్సర్‌తో



బాధపడుతున్నట్లు ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్ కట్ మిడిల్టన్ గతేడాది మార్చిలో ప్రకటించిన విషయం తెలిసిందే. అనారోగ్యం వల్ల జనవరిలో పొత్తికడుపు శస్త్రచికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. శస్త్రచికిత్స విజయవంతం అయినప్పటికీ ఆ తర్వాత నిర్వహించిన వైద్య పరీక్షల్లో తనకు క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని పేర్కొన్నారు. ఇక అప్పటి నుంచి ఆమె బయటి ప్రపంచానికి కనిపించలేదు. పలు దశల వారీగా కీమోథెరపీ చేయించుకున్నారు.

## ఎట్టకేలకు.. యూన్ సుక్ యేల్ అరెస్ట్

అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. తీవ్ర ప్రతిఘటనల అనంతరం యోల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో దక్షిణ కొరియా చరిత్రలో అరెస్టయిన తొలి అధ్యక్షుడిగా యోల్ నిలిచారు.

సియోల్: అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. తీవ్ర ప్రతిఘటనల అనంతరం యోల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో దక్షిణ కొరియా చరిత్రలో అరెస్టయిన తొలి అధ్యక్షుడిగా యోల్ నిలిచారు. అంతకుముందు బుధవారం తెల్లవారుజామున సియోల్‌లోని అధ్యక్ష భవనం వద్ద నాటకీయ పరిణామాలు చోటుచేసుకు న్నాయి. యోల్‌ను అరెస్టు చేసేందుకు 3 వేల మందికిపైగా పోలీసులతో యాంటీ కరెప్షన్ ఇన్వెస్టిగేటర్లు ఆయన అధికార నివాసానికి చేరుకున్నారు. అయితే వారిని అధికార పార్టీకి చెందిన నాయకులు, యోల్ మద్దతుదారులు, వ్యక్తిగత సిబ్బంది, సైన్యం పోలీసులతోపాటు



విచారణ అధికారులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. అయితే తీవ్ర ప్రతిఘటనల నడుమ అధ్యక్ష భవనంలోకి ప్రవేశించిన అధికారులు యోల్‌ను అరెస్టు చేశారు. ఓ ఎరుపు రంగు బస్సులో ఆయనను అక్కడి నుంచి తరలించారు. ఆయన్ని ఎక్కడి తీసుకెళ్లారనే విషయాన్ని అధికారులు వెల్లడించలేదు. అయితే యోల్‌ను గవాచియాన్‌లోని కరప్షన్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ కార్యాలయానికి తరలించే అవకాశం ఉన్నది. అక్కడ మార్షల్ లా విధింపు కేసులో విచారణ జరుపనున్నారు. అరెస్టు వారెంట్ నేపథ్యంలో 48 గంటలపాటు ఆయన్ని అదుపులో ఉంచుకునే అధికారం సీఐవోకు ఉంటుంది.

డిసెంబర్ 3న దేశంలో ఎమర్జెన్సీ మార్షల్ లా విధించిన విషయం తెలిసిందే. దీంతో ఆయనపై నేషనల్ అసెంబ్లీ 204-85 ఓట్లతో అభిశంసన తీర్మానాన్ని ఆమోదించింది. మార్షల్ లాను ప్రకటించిన కేసులో విచారణకు సహకరించకపోవడంతో ఆయనపై అరెస్టు వారెంటు జారీ అయింది. ఈ నేపథ్యంలో ఆయనను అరెస్టు చేసేందుకు అధికారులు ఈ నెల 3 విఫల యత్నం చేశారు. తెల్లవారు జామునే అధ్యక్ష భవనానికి చేరుకున్న అధికారులను సైన్యంతోపాటు ఆయన వ్యక్తిగత సిబ్బంది అడ్డుకున్నారు. ఆరు గంటల పాటు.. అధ్యక్షుడి భద్రతా సిబ్బందితో పోలీసులు వాగ్వాదానికి దిగారు. చివరకు అరెస్టును వాయిదా వేసుకున్న పోలీసులు వెనక్కి మళ్లారు.

## మెటాలో భారీగా ఉద్యోగాల కోత..

ప్రముఖ టెక్ దిగ్గజం మెటాలో భారీగా ఉద్యోగాలకు కోతలు పడనున్నాయి. పనితీరు ఆధారంగా ఉద్యోగులను తొలగించేందుకు రంగం సిద్ధమైంది. తక్కువ పనితీరు కనబరుస్తున్న వారిని గుర్తించారని, వారి స్థానాలను కొత్త వారితో భర్తీ చేయనున్నట్లు బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది.



శాన్‌ఫ్రాన్సిస్కో: ప్రముఖ టెక్ దిగ్గజం మెటాలో భారీగా ఉద్యోగాలకు కోతలు పడనున్నాయి. పనితీరు ఆధారంగా ఉద్యోగులను తొలగించేందుకు రంగం సిద్ధమైంది. తక్కువ పనితీరు కనబరుస్తున్న వారిని గుర్తించారని, వారి స్థానాలను కొత్త వారితో భర్తీ చేయనున్నట్లు బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. మొత్తం 3600 మందిని తొలగించనున్నట్లు తెలుస్తున్నది. మెటా నేతృత్వంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు ఉన్న సంగతి తెలిసిందే. ఆయా సంస్థల్లో గతేడాది సెప్టెంబర్ నాటికి 72,400 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

ఉద్యోగాల కోతలపై మెటా చీఫ్ మార్క్ జుకర్‌బర్గ్ స్పందించారు. పనితీరు సామర్థ్యాన్ని పెంచే క్రమంలో తక్కువ పనితీరును కనబరుస్తున్నవారిని తొలగించాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కంపెనీని బలోపేతం చేసేందుకు పని ఆధారంగా కోతలు విధిస్తున్నామని, వారి స్థానంలో కొత్తవారిని తీసుకుంటామని స్పష్టం చేశారు. దీంతో మొత్తం ఉద్యోగుల్లో 5 శాతం మందిపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు.

కాగా, అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 20న ప్రమాణస్వీకారం చేయనున్నారు. అంతకుముందే మెటాలో ఉద్యోగుల మార్పులు చేర్పులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ట్రంప్, జుకర్‌బర్గ్ మధ్య విభేదాలు ఉండేవి. 2021లో అమెరికా పార్లమెంటు భవనంపై ట్రంప్ అనుచరులు దాడి చేయడంతో ఆయనను ఫేస్‌బుక్ నుంచి బహిష్కరించిన విషయం తెలిసిందే. 2023లో మళ్లీ ఆయన అకౌంట్‌ను పునరుద్ధరించారు. అయినప్పటికీ మెటా చీఫ్‌పై ట్రంప్ విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. అయితే అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపొందడంతో.. ఆయన యంత్రానికి అనుకూలంగా జుకర్ బర్గ్ నిర్ణయాలు తీసుకుంటున్నారు. గతవారం తన సోషల్ మీడియా వేదికల్లో ఫ్యాక్ట్ చెకింగ్ ఫీచర్‌ను తొలగించారు.

# కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయాభివృద్ధికి సహకరించండి

## రామగిరి కోటను టూరిజం హబ్ గా మార్చండి

### కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షేకావత్ కు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి



**మంథని (జనంసాక్షి)**

'కాళేశ్వరం మంథని రామగిరి'ని ఆధ్యాత్మిక, వారసత్వ పర్యాటక సర్క్యూట్ గా గుర్తించి... అభివృద్ధి చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షేకావత్ ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు బుధవారం ఆయనను కలిసి మంథని నియోజకవర్గ పరిధిలోని కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయం, రామగిరి కోటను టూరిజం హబ్ గా అభివృద్ధి చేసేందుకు చొరవ చూపాలని వినతి పత్రం అందజేశారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరంలో గోదావరి నది ఒడ్డున వెలిసిన కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయానికి వేయ్యేళ్లకు పైగా చరిత్ర ఉంది. దేశంలో ఎక్కడా కనిపించని విధంగా గర్భ గుడిలో రెండు శివలింగాలు పూజలు అందుకుంటున్నాయి. ఒకటి ముక్తేశ్వరునిది (శివుడు), మరొకటి కాళేశ్వరునిది (యముడు). ఏటా లక్షలాది మంది భక్తులు ఈ ఆలయాన్ని దర్శించుకుంటున్నారు. ఈ ఏడాది మేలో సరస్వతి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. 30 లక్షల నుంచి 40 లక్షల మంది ఇక్కడ పవిత్ర స్నానాలను ఆచరించేందుకు వస్తారని అంచనా వేస్తున్నాం. ఇక్కడే 2027లోనూ గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. అప్పుడు కోటి మందికి పైగా వచ్చే అవకాశముంది. సోమ్ నాథ్, కేదార్ నాథ్, మహా కాళేశ్వర్, అయోధ్య, కాశీ ల మాదిరిగా ఎంతో ప్రత్యేకత కలిగిన ఈ ఆలయాన్ని కూడా ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక, ఎకో టూరిజం హబ్ గా అభివృద్ధి చేయొచ్చు. ఇప్పటికే ఇందుకు సంబంధించి సమగ్ర ప్రణాళికను రూపొందించాం. దీని అమలుకు కేంద్రం సహకరించాలి. భక్తుల సౌకర్యార్థం పుష్కరాలు మొదలయ్యే నాటికి ఈ అభివృద్ధి పనులను పూర్తి చేసేలా చొరవ చూపాలి' అని విజ్ఞప్తి చేశారు. 'రామగిరి కోటకు సుమారు 1200 ఏళ్ల చరిత్ర ఉంది. రామాయణంలోనూ దీని గురించిన ప్రస్తావన ఉంది. రాముడి ఆలయాలు, జలపాతాలు, ఎన్నో ఔషధ మొక్కలు ఇక్కడున్నాయి. ఒక ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రానికి కావాల్సిన అన్ని ఆకర్షణలు ఇక్కడున్నాయి. ఈ కోటను సందర్శించేందుకు ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు వస్తున్నారు. స్వదేశీ దర్శన్ 2.0 లేదా ఇతర పథకాల కింద ఈ కోటను మెగా టూరిజం హబ్ గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలి' అని కోరారు.

# రైతులకు ప్రధాని మరిచిపోలేని బహుమతి



**రాయికల్ జనవరి (జనం సాక్షి ):**

### నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపు బోర్డు ప్రారంభం... మాట నిలపెట్టుకున్న నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్.... ప్రధాని, ఎంపీ ఫోటోలకు పాలాభిషేకం...

రాయికల్ పట్టణ కేంద్రంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద బిజెపి రాయికల్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మరియు ఎంపీ ధర్మపురి అరవింద్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ... సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణ కు కేంద్ర ప్రభుత్వం విలువైన కానుక అందించిందని,నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని రైతుల చిరకాల కోరిక ఎంపీ అర్వింద్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలనునెరవేర్చిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ మరియు ఎంపీ అర్వింద్ లకు, బిజెపి నాయకులు,మరియు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.పసుపు బోర్డు ఏర్పాటుతో రైతులకు అనేక అవకాశాలు రానున్నాయని,రైతులు లాభసాటి ధరకు పసుపును అమ్ముకోవడానికి వీలుంటుందని,పసుపు ప్రాసెసింగ్,ఎగుమతుల ప్రోత్సాహం,నూతన టెక్నాలజీలను ఉపయోగించి పంటల ఉత్పత్తి పెంచడం వంటి అంశాలపై రైతులకు మరింత అవగాహన కలుగుతుందని అన్నారు. జాతీయ పసుపు బోర్డు చైర్మన్ గా ఎన్నికైన పల్లె.గంగారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శులు బోడుగం శ్రీకాంత్ రెడ్డి, కుంబోజి రవి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్మ మల్లారెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు కునారపు భూమేష్,దళిత మోర్చా పట్టణ అధ్యక్షుడు బన్న సంజీవ్, పట్టణ కార్యదర్శి సామల్ల సతీష్, సీనియర్ నాయకులు మచ్చ నారాయణ, సుంటిగీకర్ రాము అల్లె నర్సయ్య,గంట సుధాకర్, లింగారెడ్డి, కడార్ల శ్రీనివాస్, బొమ్మకంటి రాంగోపాల్,అందె శంకర్,బూర్ల గోపి, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు ప్రభుత్వ కార్యక్రమాల లబ్ది చేకూర్చాలి

### పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి నియోజకవర్గస్థాయి సమన్వయ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, జనవరి 15 (జనంసాక్షి)**

ప్రభుత్వం జనవరి 26 గణతంత్ర దినోత్సవం నుంచి ప్రారంభించే 4 నూతన కార్యక్రమాల ద్వారా పారదర్శకంగా అర్హులకు లబ్ది చేకూర్చాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం అమర్ చంద్ కళ్యాణ మండపంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్ కార్డుల జారీ, తదితర అంశాలపై నిర్వహించిన పెద్దపల్లి నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రైతు భరోసా పథకానికి సంబంధించి ప్రతి మండలంలోని తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారి పర్యవేక్షణలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్, సర్వేయర్లు, మైనింగ్ అధికారులు సంయుక్తంగా పని చేసి పట్టా దార్ పాస్ పుస్తకాల డేటా, గూగల్ మ్యాప్, రెవెన్యూ మ్యాప్ వారీగా పరిశీలిస్తూ భూ భారతి (ధరణి) నుంచి వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించి రైతు భరోసా జాబితా నుంచి సదరు లబ్దిదారులను తొలగించాలని అన్నారు.రాళ్లు రప్పలు ఉన్న భూములు,సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ చేసిన భూములు, పరిశ్రమల భూములు (రైస్ మిల్ పెట్రోల్ బంక్, ఆహార శుద్ధి పరిశ్రమ), నాలా కన్వర్షన్ జరిగిన భూములు, లేఔట్ ఉన్న భూములు, ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తు భూములు, రొడ్ల భూములు, భవనాలు నిర్మించుకున్న భూముల, మైనింగ్ జరుగుతున్న భూముల వివరాలు రైతు భరోసా నుంచి తొలగించాలని అన్నారు. భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి 12,000 రూపాయలకు రెండు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించిందని, 2023-24 సంవత్సరానికి 20 రోజులు పని చేసిన భూమి లేని రైతు కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. ఈ పథకం కుటుంబం యూనిట్ గా అందించడం జరుగుతుందని, వ్యక్తిగతంగా అందించే పథకం కాదని అన్నారు.సామాజిక ఆర్థిక సర్వే కింద మన పెద్దపల్లి జిల్లాలో తేలిన ఆహార భద్రత కార్డులు లేని కుటుంబాలకు మండలాలలో ఎంపీడీవోలు, పట్టణాలలో మున్సిపల్ కమిషనర్ నూతన రేషన్ కార్డుల జారీ పర్యవేక్షించాలని అన్నారు. గ్రామ లేదా వార్డు సభల ద్వారా అర్హులైన జాబితాన్ని ఆమోదింప చేసుకొని రేషన్ కార్డులను 75 గణతంత్ర దినోత్సవ సందర్భంగా నూతన రేషన్ కార్డుల ప్రోసిడిరగ్స్ పంపిణీ చేయాలని అన్నారు.ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి నిర్వహించిన సర్వేలో భూములు ఉన్న అత్యంత పేదలకు మొదటి జాబితాలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. మన అర్జిల్లాకు పరిశీలనకు వచ్చిన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులను మరొకసారి చెక్ చేసుకోని, గ్రామాల వారీగా అర్హులను ఎంపిక చేసుకొవాలని, ఎటువంటి ఒత్తిడులకు గురికాకుండా అత్యంత పేదలను ఎంపిక చేయాలని కలెక్టర్ తెలిపారు.గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న 4 కార్యక్రమాల మార్గదర్శకాలు, ఉద్దేశం ప్రజలకు వివరిస్తూ పథకాల అర్హుల జాబితాను ప్రజలందరికీ తెలిసేలా ప్రదర్శించాలని, ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత తుది జాబితా తయారు చేయాలని అన్నారు. జనవరి 23 లోపు గ్రామ సభల నిర్వహణ పూర్తి చేయాలని, గ్రామ సభ ఆమోదించిన తరువాత తుది జాబితా ఆన్ లైన్ లో జనవరి 25 సాయంత్రం లోపు నమోదు చేయాలని, జనవరి 26 నుంచి 4 పథకాల అమలును ప్రారంభించాలని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, జడ్పీ సీఈవో నరేందర్, డిసిఒ శ్రీ మాల, ఆర్డీవో గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, తాహసిల్దార్ రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# యువకుడి మృతదేహం లభ్యం

**ఖమ్మం రూరల్, జనవరి 15 (జనంసాక్షి)**





ఖమ్మం రూరల్ మండలంలోని పోలేపల్లి పంచాయతీ రాజీవ్ గృహకల్ప కు చెందిన పందెపు.సంజయ్ కుమార్(22) తన అన్న సాయిని తీసుకు రావడానికి వెళ్లి తప్పిపోయిన సంగతి తెలిసిందే.. అయితే సంజయ్ కుమార్ అన్న సాయి హైదరాబాద్ నుంచి సంక్రాంతి పండుగ కోసం సోమవారం సాయంత్రం ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలోనే తాను ఖమ్మం కొత్త బస్టాండ్ దిగే వరకు రాత్రి 1:30 గంటలు అవుతుందని ఆ సమయంలో తనను రిసీవ్ చేసుకోవడానికి రావాలని తమ్ముడు సంజయ్ కి ఫోను చేసాడు. దీంతో రాత్రి 1 గంటలకు ఖమ్మం కొత్త బస్టాండ్ కు బయలుదేరిన సంజయ్ మార్గమధ్యంలో తనను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారని, అన్నా నన్ను చంపేస్తున్నారంటూ సాయికి వాట్సఅప్ వాయిస్ మెసేజ్ పంపాడు. అంతేకాదు ఆటోలో ఉన్న దుండగులు ఒక అమ్మాయిని కూడా చంపేశారని తనను కాపాడాలంటూ వాయిస్ మెసేజ్ పంపించాడు. వెంటనే ఈ విషయం కుటుంబ సభ్యులకు సాయి చెప్పడంతో వారంతా ఫోన్ లొకేషన్ ఆధారంగా కాల్వ కట్టపైకి చేరుకున్నారు. అక్కడ నిజంగానే సంజయ్ బైకు పడిపోయి ఉండడం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో వెంటనే పోలీసులు కూడా కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం సాగర్ కెనాల్ కాలువలో ఆ యువకుడి మృదేహం దొరకడంతో స్థానికంగా కలకలం రేపింది. ఈ సంఘటన మృతుడి బంధువులకు, స్నేహితులకు తెలియడంతో ఒక్కసారిగా స్థానిక కరుణ గిరి రోడ్డుపై బైఠాయించి రాస్తా రోకో చేయడంతో బైపాస్ రహదారిపై వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు మృతుని కుటుంబ సభ్యులకు స్నేహితులకు నచ్చ చెప్పి పంపించారు.

# గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి





**పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు**

**పెద్దపల్లి,జనవరి 15(జనంసాక్షి)**



సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పెద్దపల్లి మండలం కాపులపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మ్యాదర వేణి మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కబడ్డీ టోర్నమెంట్స్ బుధవారం సాయంత్రం ముగిసాయి. ఇందులో విజేతలైన వారికి స్థానిక నాయకులతో కలిసి బహుమతులను అందించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూక్రీడల్లో ఓడినా గెలిచినా నైపుణ్యం అభివృద్ధి చెందుతుందన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహదారుడ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. తెలుగు వారి సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబింప చేసే సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణ క్రీడ అయినటువంటి కబడ్డీ టోర్నమెంట్స్ నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా క్రీడలు క్రమశిక్షణకు దోహదపడతాయన్నారు. ఈ టోర్నమెంట్స్ ను స్ఫూర్తిగా తీసుకొని అన్ని గ్రామాల్లో ఇలాంటి గ్రామీణ క్రీడలు నిర్వహించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. విన్నర్ గా నిలిచిన వెంకట్రావుపల్లి జట్టుకు రూ.10 నగదు బహుమతిని, రన్నర్ గా నిలిచిన కాపులపల్లి జట్టుకు రూ .5 వేల నగదు బహుమతిని, షీల్డ్ లను ఎమ్మెల్యే అందజేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లేష్ యాదవ్, మాజీ ఎంపిటిసి ఎడెల్లి శంకర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ముత్యాల నరేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జడల రాజు, గ్రామశాఖ అధ్యక్షుడు సాయి, సుకన్య, గాజుల ప్రవీణ్, నల్లపు తిరుపతి, పిట్టల స్వామి, పలువురు పార్టీ నాయకులు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమం అభివృద్ధికి ప్రభుత్వ కృషి



**వనపర్తి టౌన్ జనవరి15 (జనంసాక్షి)**

కార్మికుల సంక్షేమం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి అన్నారు. వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో ఏఐటీయూసీ 2025 నూతన సంవత్సరం క్యాలెండర్ ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఏఐటియుసి కార్మిక చట్టాల కోసం ఎన్నో పోరాటాలు చేస్తోందన్నారు. కర్షకులు, కార్మికులు సంపద సృష్టిస్తారని, వారిని ఆదుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేశామని జనవరి 26 నుంచి రైతు భరోసా నిధులు వారి ఖాతాలో జమ చేస్తామన్నారు. భూమిలేని వ్యవసాయ కార్మికులకు(కూలీలు) ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ. 12000 ఇచ్చే కార్యక్రమం జనవరి 26 నుంచే ఇవ్వనున్నామన్నారు. కార్మికులకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఏఐటీయూసీ నేతలకు స్వీట్లు పంపిణీ చేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి శ్రీహరి, ఉపాధ్యక్షుడు కే శ్రీరామ్, ప్రధాన కార్యదర్శి మోష, ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, గౌరవ అధ్యక్షుడు భరత్, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, 2వ ఏఎన్ఎంల అధ్యక్ష కార్యదర్శులు కృష్ణవేణి, లక్ష్మి, భాస్కర్,సి.ఎన్ శెట్టి, లక్ష్మీనారాయణ, శివ, బాలరాజు, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వనపర్తి ఏరియా ఆసుపత్రి జిల్లా అధ్యక్షుడు శ్రీను, నరసింహ, మెడికల్ కాలేజ్ అధ్యక్షుడు వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# 26 నుంచి 4 కొత్త ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయాలి..

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.. రామగుండం నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశం..





**గోదావరిఖని, జనంసాక్షి :**

జనవరి 26 నుంచి 4 కొత్త ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.బుధవారం ఎన్టిపిసిలోని మిలీనియం ఆడిటోరియంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్కార్డుల జారీ, తదితర అంశాలపై నిర్వహించిన రామగుండం నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణు (రెవెన్యూ), అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణ శ్రీతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి నిర్వహించిన సర్వేలో భూములు ఉన్న అత్యంత పేదలకు మొదటి జాబితాలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. పరిశీలనకు వచ్చిన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులను మరొకసారి చెక్ చేసుకోని, గ్రామాల/వార్డుల వారీగా అర్హులను ఎంపిక చేసుకొవాలని, ఎటువంటి ఒత్తిడులకు గురికాకుండా అత్యంత పేదలను ఎంపిక చేయాలని కలెక్టర్ తెలిపారు.సామాజిక ఆర్థిక సర్వే కింద పెద్దపల్లి జిల్లాలో తేలిన ఆహార భద్రత కార్డులు లేని కుటుంబాలకు మండలాలలో ఎంపీడీవోలు, పట్టణాలలో మున్సిపల్ కమిషనర్ నూతన రేషన్కార్డుల జారీ పర్యవేక్షించాలని అన్నారు. రైతు భరోసా పథకానికి సంబంధించి ప్రతి మండలంలోని తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారి పర్యవేక్షణలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్, సర్వేయర్లు, మైనింగ్ అధికారులు సంయుక్తంగా పని చేసి పట్టా దార్ పాస్ పుస్తకాల డేటా, గూగల్ మ్యాప్ , రెవెన్యూ మ్యాప్ వారీగా పరిశీలిస్తూ భూభారతి (ధరణి) నుంచి వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించి రైతు భరోసా జాబితా నుంచి సదరు లబ్దిదారులను తొలగించాలని అన్నారు.రాళ్లు రప్పలు ఉన్న భూములు, సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ చేసిన భూములు, పరిశ్రమల భూములు (రైస్ మిల్ పెట్రోల్ బంక్, ఆహార శుద్ధి పరిశ్రమ), నాలా కన్వర్షన్ జరిగిన భూములు, లేఔట్ ఉన్న భూములు, ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తు భూములు, రొడ్ల భూములు, భవనాలు నిర్మించుకున్న భూముల, మైనింగ్ జరుగుతున్న భూముల వివరాలు రైతు భరోసా నుంచి తొలగించాలని అన్నారు. భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి 12,000 రూపాయలకు రెండు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించిందని, 2023-24 సంవత్సరానికి 20 రోజులు పని చేసిన భూమి లేని రైతు కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, జడ్పీ సీఈవో నరేందర్, ఆర్డిఓ గంగయ్య, తహసిల్దార్ కుమారస్వామి, పాల్గొన్నారు.

# నిధుల మంజూరుకై ఎమ్మెల్యేకు వినతి

**లక్షెట్టిపేట జనవరి 14 (జనంసాక్షి)**



లక్షెట్టి పేట, పట్టణంలో అసంపూర్తిగా మిగిలిన డా. బీ ఆర్ అంబేద్కర్ విజ్ఞాన భవన్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ మంగళవారం రాత్రి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు ముల్కల రాందాస్, ప్రధాన కార్యదర్శి భైరం రవి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం నుంచి అంబేద్కర్ భవన్ కు ఎలాంటి నిధులు అందలేదని, సభ్యులు సహకారంతో కొంత వరకు నిర్మాణం పూర్తి చేసుకుని అలాగే వదిలేయడం జరిగిందన్నారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న భవనానికి తగిన ప్రోత్సాహం, ఆర్థిక సహకారం లేకపోవడంతో ఏళ్ల తరబడి అలాగే ఉండిపోతుందన్నారు. దళిత, బహుజనుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మండలంలో సంఘం కార్యక్రమాలకు అందుబాటులోకి తీసుకురావాలంటే రూ. 15 లక్షల నిధులు అవసరమవుతాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వెంటనే చర్యలు చేపట్టనున్నట్లు సంఘం సభ్యులకు తెలిపారు. అంబేద్కర్ విజ్ఞాన భవన్ నిర్మాణానికి తమ పూర్తి సహకారం ఉంటుందన్నారు. అంతేకాకుండా ఇంకా ఎలాంటి సహాయానికైనా ఎల్లప్పుడూ తమను సంప్రదించవచ్చని తెలిపారు. ఎమ్మెల్యే ను కలిసిన వారిలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు శనిగారపు లింగన్న, మాజీ మండలాధ్యక్షుడు దొంత నర్సయ్య, నాయకులు అడ్లూరి దేవేందర్, మినుముల జనార్ధన్,గరిసే రవీందర్, గోడిశెల రవీందర్,పెండెం సత్తన్న,రాజు, వేముల ప్రేమ్ సాగర్, బన్న శ్రీనివాస్, సమ్మయ్య, బోనగిరి కుమార్ ఉన్నారు.

## మానసిక దివ్యాంగుల అభ్యున్నతికి పాటుపడాలి



**నర్సంపేట జనవరి 14 ( జనం సాక్షి)**

బాలసముద్రంలోని మల్లికాంబ మనో వికాస కేంద్రంలో నేడు సంక్రాంతి ఉత్సవాలను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి , వారి కుమారుడు దొంతి అవియుక్త్ రెడ్డి, వారి కూతురు దొంతి అనన్యరెడ్డి పాటు మానసిక దివ్యాంగులతో కలిసి సంక్రాంతి వేడుకలను మంగళవారం జరుపుకున్నారు దివ్యాంగులు హరిదాసుల పద్యాలు, చిన్నారుల విన్యాసాలు, తిలకించి వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ మల్లికాంబ మనోవికాస్ కేంద్రానికి విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు దివ్యాంగులకు కావలసిన టువంటి పరికరాలను అందిస్తామని, నిరంతరం వారికి కావాల్సిన బియ్యంతో పాటు నిత్యవసరాలు అందిస్తామని పిల్లల ఆరోగ్యం పట్ల వైద్యుల సౌకర్యాన్ని కూడా కనిపిస్తామని అన్నారు.

# గ్రామసభలు జవాబుదారీతనంగా నిర్వహించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య**

**వరంగల్ బ్యూరో, జనవరి 15 (జనం సాక్షి)**




రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు చేసేందుకుగాను నిర్వహించే గ్రామ సభలు జవాబుదారీతనంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అధికారులను ఆదేశించారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో మండల్ స్థాయి ఆఫీసర్స్ ( పంచాయతీ సెక్రెటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్ తో నిర్వహించిన అవగాహన సదస్సు, శిక్షణ కార్యక్రమం, గ్రామస్థాయి బృందాలు మరియు క్లస్టర్ స్థాయి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 25 వరకు నిర్వహించే గ్రామసభలు ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై నిర్దేశించిన భూములను, మైనింగ్ భూములను వివరాలు ఖచ్చితంగా సేకరించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం కొనుగోలు చేసిన భూముల వివరాలు సూచించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి సేకరించిన వివరాలను గ్రామపంచాయతీ నోటీసు బోర్డుపై వివరాలు ఉంచి అభ్యంతరాలను స్వీకరించాలని, సేకరించిన వివరాలను మండల స్థాయి అధికారులకు తెలియజేయాలన్నారు. లేఅవుట్ మినహా, పడావున్న భూములను కూడా రైతు భరోసా పథకానికి అర్హులుగా గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఆదాయ వివరాలను సేకరించి అర్హులైన రేషన్ కార్డుల జాబితాలు లబ్ధిదారులు మధ్య దళారులను ఆశ్రయించకుండా సరియైన రీతిలో అర్హులైన వారి జాబితాలు గ్రామ సభలో ప్రజలకు నివేదించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామ సభలకు ముందే ఒకరోజు ప్రజలను వచ్చి అభ్యంతరాలను సేకరించి, ఉన్నతాధికారుల సలహా మేరకు తుది జాబితాను తయారుచేసి గ్రామ సభలలో జాబితాను ప్రదర్శించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామసభలలో స్థానిక లబ్ధిదారులతోపాటు గ్రామస్థాయి ఇందిరమ్మ కమిటీలను కూడా ఆహ్వానించాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్ సర్వేలు ఉన్న యెడల రేపటి లోగా పూర్తి చేయాలని సేకరించిన డేటాను పూర్తిస్థాయిలో భద్రంగా ఉంచి కంప్యూటర్ రీజన్ చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామస్థాయి కమిటీలు, సబ్ కమిటీలు వారికి నిర్దేశించిన విధంగా పూర్తిస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో కె.నారాయణ, తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఏవో శ్రీనివాస్, ఎం పి ఓ విమల , గ్రామపంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ అధికారులు ఏఈఓ లు, ఏఈవోలు, ఆర్ ఐ లు,తదితరులు పాల్గొన్నారు

# కోరమీసాల స్వామిని దర్శించుకున్న మంత్రి

**భీమదేవరపల్లి, జనవరి 15(జనం సాక్షి)**



మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని,భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల భాగంగా మంగళవారం రవాణా బీసీ,సంక్షేమ శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్, వీరభద్ర స్వామి భద్రకాళి సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్వ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తామని హామీ ఇచ్చారు.కొత్తకొండ క్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని అన్నారు. వంగర గ్రామంలో నవోదయ గురుకుల హాస్టల్ కేంద్రమంత్రి బండి సంజయ్ సహకారంతో త్వరలో ప్రారంభిస్తామన్నారు. వీరభద్ర స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో పాడి పంటలతో ఉండాలని ఆ కోరమీసాల వీరభద్రస్వామిని కోరుకున్నాను, వర్దన్నపేట ఎమ్మెల్యే ఎల్.నాగరాజు, ఆలయ చైర్మన్ కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా, ఆలయ ఈవో పి కిషన్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిట్టెంపెల్లి ఐలయ్య, మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు జక్కుల అనిల్, మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు చిదురాల స్వరూప,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలుగూరి రాజు,ఆదరి రవీందర్,అశోక్ ముఖర్జీ,కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు ప్రకాష్, గజ్జల రమేష్,పిడిశెట్టి కనకయ్య యాటపోలు శ్రీనివాస్,మాడుగుల ఎఱ్ఱా,గజ్జల సురేష్ డబ్బా శంకర్ దూడల సంపత్, మడిపల్లి సదానందం, పొన్నాల మురళి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికి రేషన్ కార్డులు అందేలా చూడాలి

**బెల్లంపల్లి, జనవరి 15 (జనంసాక్షి)**



అర్హులందరికీ రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం ఆయన బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణతో కలిసి బెల్లంపల్లి పట్టణంలోని 11వ వార్డులో రేషన్ కార్డుల సర్వేను పరిశీలించారు. కుల గణన సర్వే ఆధారంగా బెల్లంపల్లి పట్టణంలో 1301 కుటుంబాలు రేషన్ కార్డులు లేవని దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తు చేసుకున్న కుటుంబాల జాబితాను రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హుల జాబితాను ఎంపిక చేసి కలెక్టరేట్ కు పంపించాలని సూచించారు. నిర్థిష్ట గడువు లోపల సర్వే పూర్తి చేసి అర్హుల జాబితాను రూపొందించాలని అన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేతా శ్రీధర్, కౌన్సిలర్లు నెల్లి శ్రీలత, చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకుడు గాలి శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు

**సంగారెడ్డి, జనవరి 15( జనంసాక్షి)**



**లబ్ధిదారుల ఎంపికలో ఫిర్యాదులు రావద్దు**

**నిర్మాణం పూర్తయిన ఇండ్లను లబ్ధిదారులకు అందించాలి**

**అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులో మంజూరు పథకాలు అర్హులైన పేదలకు అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లాలోని, తహసిల్దార్ లు, ఎంపీడీవోలు, వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల మంజూరు , ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు తదితర పథకాల లబ్ధిదారుల ఎంపికలో ఈ విధమైన ఫిర్యాదులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. సర్వేలో పెండింగ్ ఉన్న లబ్ధిదారుల వివరాలు సేకరించి తుది జాబితాను ఖరారు చేయాలని అధికారులకు సూచించారు. గతంలో నిర్మించి లబ్ధిదారులకు అందజేయని రెండు పడక గదుల ఇండ్లు వెంటనే లబ్ధిదారులకు అందజేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సంపూర్తి ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రెండు పడక గదుల ఇండ్ల వద్ద అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తి పరదర్శకతతో జరిగేలా గ్రామాలు వార్డులలో గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారుల వివరాలను చదివి వినిపించి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు.జనవరి 26న లబ్ధిదారులకు నూతన పథకాలుజనవరి 26న రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు అందించే కార్యక్రమాలు చెపుట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల విజయవంతం కోసం రెవెన్యూ పంచాయతీరాజ్ వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఇలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా మానవతా దృక్పథంతో పథకాల ప్రయోజనాలు పేద ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. భూభారతి పోర్టల్ లో నమోదైన పట్టాదారులు మాత్రమే రైతు భరోసా పథకం కింద అందించే ఆర్థిక సహాయానికి అర్హులని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతు భరోసా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో సమీక్ష సమావేశంలో, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, పిడి డిఆర్డిఏ జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జడ్పీ సీఈవో జానకి రెడ్డి, పిడి హౌసింగ్ చలపతిరావు రెవిన్యూ డివిజనల్ అధికారులు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తాటి చెట్టు పైనుండి పడి గీతా కార్మికుడికి గాయాలు

**గణపురం, జనవరి 15 (జనంసాక్షి):**



మండల కేంద్రానికి చెందిన పుట్ట సంపత్ గౌడ్ అనే గీతా కార్మికుడు మంగళవారం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. సంపత్ సంక్రాంతి పండగ రోజు సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో కాలుకు ఉన్న గుయ్యి జారడంతో కింద పడగా చెయ్యి, కాలు, చాతికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చుట్టుపక్కలవారు 108 వాహనంలో భూపాలపల్లిలోని వంద పడకల ఆసుపత్రి తరలించారు. గాయపడ్డ గీతా కార్మికున్ని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు మాదాసు రవి, మాజీ అధ్యక్షులు మార్క కుమార్ గౌడ్, మామిండ్ల వెంకటేశ్వర్లు, ఆరెల్లి శంకర్ గౌడ్, మార్క కొమురయ్య గౌడ్, గౌడ సంఘం కమిటీ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



# వీరభద్ర స్వామిని దర్శించుకున్న మంత్రి

**భీమదేవరపల్లి, జనవరి 15(జనం సాక్షి)**



భీమదేవరపల్లి ఏళ్ల చరిత్ర కలిగిన కొత్తకొండ వీరభద్ర స్వామి దేవాలయ ప్రతిష్టను మరింత ఇనుమడింప చేస్తామని... త్వరలోనే కొత్తకొండ మండలాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం వీరభద్ర స్వామి దర్శించుకొని ఆయన మాట్లాదారు. సంక్రాంతి పండుగ రైతుల పండుగ అని రైతులందరూ బాగుండాలని స్వామివారిని కోరుకున్నట్లు మంత్రి వెల్లడించారు. చుట్టూ ఉన్న దేవాలయాలు, పీవీ స్మారకం వరంగల్ లోని భద్రకాళి ఆలయం ముత్తారంలో ఉన్న త్రికుంటేశ్వరలయం కలుపుకొని ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్ గా అభివృద్ధి చేస్తామన్నారు. నిత్యం పెరుగుతున్న భక్తులకు అనుగు ణంగా దేవదాయ శాఖ పక్షాన అన్ని చర్యలు తీసుకుంటున్నామని వీరభద్ర స్వామి ధర్మకర్తలు హసన్పర్తి, హుజురాబాద్, ఘన్పూర్, హుస్నాబాద్ అన్ని మండలాల నుండి తీసుకున్నాం త ద్వారా దేవాలయ విస్తృతి పెరుగుతుందని అన్నారు. త్వరలోనే గుట్టపైకి మెట్ల మార్గాన్ని పూర్తి చేస్తామన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మేము సిద్ధం అని వెల్లడించారు. కొత్తకొండ మండలంగా ప్రతి పాదనలు పంపామని రాష్ట్రంలో నూతన మండలాలు ఏర్పడినప్పుడు కొత్తకొండ మండలం ఏర్పడుతుందని అలాగే పివి స్వగ్రామంలో బండి సంజయ్ సహకారంతో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, ఆలయ ఈవో కిషన్ రావు, చైర్మన్ కొమురవెల్లి చంద్ర శేఖర్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్టంపల్లి బలయ్య, యూత్ అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్, ఆదరి రవి, కొలుగూరి రాజు, ప్రకాష్ డబ్బా శంకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పాపటపల్లిలో సంక్రాంతి ముగ్గుల పోటీలు



**రఘునాథపాలెం జనవరి 15 (జనంసాక్షి)**

మండల పరిధి లోని పాపటపల్లి లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి..చిన్నా పెద్ద తేడా లేకుండా గ్రామస్తులంతా వేడుకల్లో పాల్గొన్నారు. .పండుగ ని పురస్కరించుకొని సంస్కృతీ సంప్రదాయాలని ప్రతిబింబించేలా ముగ్గుల పోటీలు నిర్వహించారు..విజేతలకి నగదు బహుమతులని అందించారు.ఇతర గ్రామాలకు చెందిన మహిళలు ఈ సంబరాలకు హాజరవ్వడంతో గ్రామం లో రోజంతా సందడి నెలకొంది.. ఈ ఉత్సవాల్లో సీనియర్ జర్నలిస్ట్ కురాకుల గోపి , మాజీ సర్పంచ్ దుంపటి నగేశ్ , గ్రామ పెద్దలు అప్పని శంకర్, చచ్చు లక్ష్మీ నారాయణ , వుయ్యూరు లక్ష్మయ్య, పావురాల ఉషాబాబు , పర్వత సైదులు తదితరులు హాజరయ్యారు..

# సంక్రాంతి పండుగ రైతుల జీవితాల్లో కాంతిని నింపాలి

**జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి**

**మంగపేట జనవరి 15(జనంసాక్షి)**



సంక్రాంతి పండుగ రైతుల జీవితాల్లో సరికొత్త కాంతిని నింపాలని జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివ రెడ్డి అన్నారు. మంగళవారం మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా వివేక ఎఫ్ పి ఓ రైతు ఉత్పత్తిదారుల సంఘం, వికాస్ అగ్రి పౌండేషన్ ల ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాలను నిర్వహించ ముఖ్యఅతిథిగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాంబశివరెడ్డి మాట్లాడుతూ పల్లెలే పట్టణాలకు పట్టుకొమ్మలని పల్లెలు అనేది అందరికీ తల్లి వంటిదని లాంటి పల్లెలను మరవద్దని అన్నారు. సంక్రాంతి పండుగ అంటే రైతుల పండుగ అని సంక్రాంతి పర్వదినం రైతుల జీవితాల్లో కాంతిని నింపే విధంగా ప్రభుత్వాలు తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. గంగిరెద్దు రూపంలో ఉన్న నందీశ్వరునికి సాంబశివరెడ్డి దంపతులు సాంప్రదాయ బద్ధంగా హారతి ఇచ్చి ఆహారం తినిపించి నూతన వస్త్రాలు సమర్పించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివేక ఎఫ్ పీ ఓ కార్యాలయ సిబ్బంది బన్నూరి దరనిధర్ రెడ్డి, జడ్డి పూర్ణ ప్రసాద్, వికాస్ అగ్రి ఫౌండేషన్ డైరెక్టర్ లు చెట్టుపల్లి తిరుపతి రావు, నేలపట్ల శేషారెడ్డి లు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన సబ్‌రిజిస్ట్రార్

- ఇంటిస్థలం సేల్ డీడ్, మార్టిగేజ్ కోసం 10 వేలు తీసుకుంటుండగా పట్టివేత



జగిత్యాల, జనవరి 15 (జనంసాక్షి) : స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖకు చెందిన ఓ అవినీతి చేప ఏసీబీకి చిక్కింది. ఇంటిస్థలం సేల్‌డీడ్, మార్టిగేజ్ కోసం రూ. 10వేలు లంచం డిమాండ్ చేసి, రూ. 5వేలు తీసుకుంటూ బుధవారం అడ్డంగా దొరికిపోయారు. డబ్బులు తీసుకున్న కార్యాలయ అటెండర్, దస్తావేజులేఖరితోపాటు సబ్‌రిజిస్ట్రార్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేయడం, జగిత్యాల జిల్లాలో కలలం రేపింది. ఏసీబీ కరీంనగర్ డీఎస్పీ రమణామూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సుంకే విష్ణు అనే బ్యాంకు ఉద్యోగి మెట్‌పల్లి పట్టణంలోని సాయిరాంనగర్ కాలనీలో 266 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన ఇంటి స్థలం సేల్‌డీడ్, మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ కోసం దస్తావేజు లేఖరి (డాక్యుమెంట్ రైటర్)తో దస్తావేజులను (డాక్యుమెంట్)తయారు చేయించారు. గత నెల 28న దస్తావేజు లేఖరి వద్ద సహాయకుడిగా పనిచేసే ఆర్మూరు రవి సబ్‌రిజిస్ట్రార్ వద్దకు సదరు దస్తావేజులను తీసుకెళ్లాడు. సేల్‌డీడ్, మార్టిగేజ్ డీడ్ రిజిస్ట్రేషన్‌కు రూ. 10 వేలు ఇవ్వమని సబ్‌రిజిస్ట్రార్ డిమాండ్ చేశారు. అయితే విష్ణు డబ్బులు ఇవ్వకపోవడంతో రిజిస్ట్రేషన్ చేయకుండా పక్కన పెట్టారు. లంచం అంత ఇచ్చుకోలేనని, రూ. 5వేలు ఇస్తానని విష్ణు చెప్పడంతో రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్‌రిజిస్ట్రార్ అంగీకరించారు. కాగా, సేల్‌డీడ్, మార్టిగేజ్ కోసం అన్ని సక్రమంగా ఉండి కూడా లంచం ఇచ్చేందుకు ఇష్టపడని అతను, ఏసీబీ అధికారులను సం ప్రదించారు. ఈ క్రమంలో డీఎస్పీ రమణామూర్తి ఆధ్వర్యంలో ఏసీబీ కార్యాలయంపై నిఘా పెట్టారు. దస్తావేజులేఖరి సహాయకుడి ద్వారా రూ. 5 వేలు లంచం డబ్బులు సబ్‌రిజిస్ట్రార్ వద్దకు తీసుకెళ్లగా, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో అటెండర్‌గా పనిచేస్తున్న బానోతు రవికుమార్‌కు ఇవ్వమని సూచించారు. సబ్‌రిజిస్ట్రార్ చెప్పినట్లుగానే అటెండర్‌కు డబ్బులు ఇస్తుండగా, ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. వెంటనే సబ్‌రిజిస్ట్రార్, అటెండర్‌తో పాటు దస్తావేజులేఖరి సహాయకుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, ముగ్గురి నిందితులను కరీంనగర్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ వివరించారు.

# అగ్రనేతలను కలిసిన షర్మిల

- ఇందిరాభవన్‌లో వైఎస్ పాదయాత్ర ఫోటోలు
- ఎంతగానో ఆకట్టుకున్నాయని షర్మిల పోస్ట్





న్యూఢిల్లీ, జనవరి15 (జనంసాక్షి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై రాహుల్, వైఎస్ షర్మిల ఇద్దరూ చర్చించారు. అలాగే ఏపీ తాజా రాజకీయ పరిస్థితులపై చర్చలు జరిపారు. అనంతరం కార్యాలయం ప్రారంభోత్సవంపై ఎక్స్ వేదికగా షర్మిల తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఏఐసీసీ కేంద్ర నూతన కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఆమె ఢిల్లీకి చేరుకున్నారు. ఉదయం 10:30 గంటలకు జరిగిన కార్యక్రమంలో షర్మిలా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ అగ్రనేతలు, ముఖ్యమంత్రులు, మంత్రులు పెద్దఎత్తున హాజరయ్యారు. కాగా, ఏఐసీసీ కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం రాహుల్ గాంధీతో షర్మిల భేటీ అయ్యారు. 'ఢిల్లీలోని కోట్లా రోడ్డులో ఆరు అంతస్తుల్లో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన కాంగ్రెస్ పార్టీ కొత్త కార్యాలయం 'ఇందిరా భవన్'ని అగ్ర నాయకురాలు శ్రీమతి సోనియా గాంధీ ప్రారంభించడం సంతోషంగా ఉంది. ఇలాంటి చారిత్రాత్మక కార్యక్రమంలో నేనూ పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ ఆరు అంతస్తుల భవనంలో 140 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ చరిత్రకు సంబంధించిన అద్భుతమైన ఫొటోలు ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్రకు సంబంధించిన ఫొటోలు కార్యాలయంలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. పాదయాత్ర ఫొటోలు కొత్త కార్యాలయంలో పెట్టడం వైఎస్ రాజశేఖర్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న గౌరవాన్ని తెలియజేస్తోంది. కొత్త ఏడాదిలో ప్రారంభించు కున్న ఈ నూతన భవనం నుంచే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందనే ధీమా వ్యక్తమవుతోంది' అంటూ ట్వీట్ చేశారు. బుధవారం ఉదయం ఏఐసీసీ నూతన కార్యాలయాన్ని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ప్రారంభించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నూతన భవనంలో పార్టీ జెండా ఎగురవేశారు. ఈ భవనానికి ఇందిరాభవన్‌గా నామకరణం చేశారు. ఈ వేడుకలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. ఏపీకి చెందిన పలువురు నేతలు సైతం హాజరయ్యారు. ప్రారంభోత్సవానికి సుమారు 400 మంది ఆహ్వానితులు వచ్చినట్లు తెలుస్తోంది. కాగా, ఆరు అంతస్తులో ఆధునిక సౌకర్యాలతో ఏఐసీసీ నూతన కార్యాలయాన్ని నిర్మించారు.

# సుప్రీంకోర్టు తీర్పు కేటీఆర్‌కు చెంపపెట్టు

- కుంభకోణం..లంబకోణం లేదంటూ వ్యాఖ్యలా?
- మండిపడ్డ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్, జనవరి15 (జనంసాక్షి) : సుప్రీంకోర్టు తీర్పు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చెంపపెట్టని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. ప్రజల సొమ్ము దోచుకున్న కేటీఆర్.. కుంభకోణం లేదు లంబకోణం లేదని అన్నారని శ్రీనివాస్ మండిపడ్డారు. ఫార్ములా–ఈ కార్ రేసు కేసులో సుప్రీంకోర్టు తీర్పుపై తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. ప్రజాధనం దుర్వినియోగం చేసిన వాళ్లపై చర్యలు తీసుకుంటే అక్రమ కేసులు అంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేసిన వారిని ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదని ప్రభుత్వ విప్ తేల్చి చెప్పారు. ఇందుకు కోర్టులూ ప్రభుత్వానికి సహకరించడం సంతోషంగా ఉందని ఆయన చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో లాగా ఇళ్ల తలుపులు విరగొట్టి మరీ అరెస్టులు చేయడం లేదని ఆయన విమర్శించారు. తనపై తప్పుడు కేసులు నమోదు చేశారని కేటీఆర్ చెప్తున్నారని, ఇప్పుడు ఉన్నత న్యాయస్థానం తీర్పుపై తెలంగాణ ప్రజలకు ఆయన ఏం సమాధానం చెప్తారంటూ ప్రశ్నించారు. ఫార్ములా–ఈ కార్ రేసు కేసులో ఏసీబీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని హైకోర్టును కేటీఆర్ ఆశ్రయించారని, అందుకు న్యాయస్థానం నిరాకరించిందని శ్రీనివాస్ గుర్తు చేశారు. దీనిపై ఆయన ఉన్నత న్యాయస్థానానికి వెళ్లినా సుప్రీంకోర్టు తన తీర్పుతో కేటీఆర్‌కు చెంపదెబ్బ కొట్టినట్లయ్యిందని ఆయన ఎద్దేవా చేశారు. ఏసీబీ, ఈడీ నమోదు చేసిన కేసుల్లో న్యాయం ఉందని అందుకే కోర్టులు కేటీఆర్‌కు అనుకూలంగా తీర్పు ఇవ్వలేదని శ్రీనివాస్ చెప్పారు. కేసుల్లో కేటీఆర్ ఇప్పటివరకూ చేసిన హంగామాకు, చేస్తున్న దానికి సైతం బహిరంగ క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాగా, ఏసీబీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని, హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై నేడు విచారణ చేపట్టిన ధర్మాసనం హైకోర్టు తీర్పుపై జోక్యం చేసుకోలేమంటూ కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసింది.

# దిగజారి మాట్లాడుతారని ఊహించలేదు

- ఎంపి ధర్మపురి వ్యాఖ్యలపై మంత్రి తుమ్మల అభ్యంతరం
- బహిరంగ లేఖ రాసిన మంత్రి తుమ్మల



హైదరాబాద్, జనవరి15 (జనంసాక్షి) : నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకటించిన సందర్భంగా తనపై ఎంపి అర్వింద్ చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ.. కేంద్రం సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని స్థానిక బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం స్పందించారు. ఆ క్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్‌కు ఆయన బహిరంగ లేఖ రాశారు. నిజామాబాద్ రైతుల సుదీర్ఘ పోరాటం, చిరకాల నిరీక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగానే కాకుండా.. ఒక రైతుగా తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. ఈ సందర్భంగా.. పార్టీ, ప్రభుత్వంతో నిమిత్తం లేకుండా ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి తాను ధన్యవాదాలు తెలియజేశానని తెలిపారు. ఈ సందర్భంగా తన రాజకీయ జీవితం గురించి మీరు చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం... ఆక్షేపణీయంగా ఉన్నాయంటూ ఎంపీ దర్మపురి అరవింద్‌కు తెలియజేశారు. ఈ స్థాయికి దిగజారి మీరు మాట్లాడతారని తాను ఊహించలేదని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానం పట్ల అవగాహన రాహిత్యమో, సమాచార లోపమో తెలియదు కానీ మీ వ్యాఖ్యలు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కానివని స్పష్టం చేశారు.

# టెకీ ప్రాణాల మీదికు తెచ్చిన చైనా మంజా

- సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో తప్పిన ప్రాణాపాయం

హైదరాబాద్, జనవరి15 (జనంసాక్షి) : గాలి పటాల పండుగ ఏమోకానీ.. చైనా మాంజా దారం ప్రాణాలు తీస్తోంది. గాల్లోకి ఎగిరిన గాలి పటాలు.. కిందకు దిగిన తర్వాత.. వాటికి ఉన్న చైనా దారాలు జనం గొంతులు కోస్తున్నాయి. నిన్నటికి నిన్న ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ ప్రాణాల మీదకు తెచ్చిన చైనా మాంజా.. ఇప్పుడు ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి గొంతును కోశాయి. హైదరాబాద్ సిటీలో కుషాయిగూడ నాగార్జున కాలనీకి చెందిన 29 ఏళ్ల సాయి వర్ధన్ సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఇంటి నుంచి బైక్ పై ఆఫీసుకు బయలుదేరిన సాయివర్ధన్.. ఉప్పల్ మెట్రోస్టేషన్ దగ్గరకు రాగానే తన మెడకు చైనా మాంజా తగిలింది. బైక్ పై వెళు తుండటంతో.. మాంజా దెబ్బకు గొంతు కోసుకుపోయింది. ఆ వెంటనే కింద పడిపోయాడు. స్థానికులు వెంటనే గమనించి.. దగ్గరలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన డాక్టర్లు.. గొంతుకు కుట్లు వేశారు. పెద్ద ప్రమాదం తప్పిందని చెబుతున్నారు డాక్టర్లు. ఇంకొంచెం బలంగా మాంజా తగిలినా ప్రాణాలకే ముప్పు ఉండేదని స్పష్టం చేశారు. చైనా మాంజా అమ్మకాలపై నిషేదం ఉన్నా.. అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.. కొనుగోళ్లు తగ్గటం లేదు అనటానికి ఈ ఘటనే నిదర్శనం. ఇప్పటికే వందల సంఖ్యలో పోలీసులు కేసులు నమోదు చేసినా.. ప్రతిఏటా ఈ చైనా మాంజా పీడ మాత్రం పోవటం లేదు. చైనా మాంజా అమ్మకాలు సాగించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటేకానీ ఇలాంటి ప్రమాదాలకు ఫుల్ స్టాప్ పెట్టలేం..

## రాజ్యాంగంపై ప్రమాణం చేసి

# ఇలాంటి వ్యాఖ్యలా?

- రాహుల్ వ్యాఖ్యలై మండిపడ్డ బిజెపి నేతల ఆగ్రహం

న్యూఢిల్లీ, జనవరి15 (జనంసాక్షి) : ప్రతిపక్షం భాజపాతో మాత్రమే కాదు.. దేశంతోనూ కాంగ్రెస్ పోరాడుతోందని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను పలువురు కేంద్రమంత్రులు తప్పుబట్టారు. కాంగ్రెస్ అసలురూపం ఈ వ్యాఖ్యలతో బహిర్గతమైందని భాజపా జాతీయాధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా వ్యాఖ్యానించారు. దేశంపై ప్రతిపక్షం పోరాడుతోందని చెబుతున్న రాహుల్ రాజ్యాంగాన్ని పట్టుకొని ఎందుకు తిరుగుతున్నారని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశ్నించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన విపక్ష నేత దేశంతో పోరాడుతున్నామని చెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. దిల్లీలో కాంగ్రెస్ నూతన ప్రధాన కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'ఆరెస్సెస్ వంటి మా భావజాలం వేల సంవత్సరాల నాటిది. భాజపా, ఆరెస్సెస్ దేశంలోని ప్రతి సంస్థను తమ గుప్పిట్లో పెట్టుకున్నాయి. మేము ఇప్పుడు భాజపా, ఆరెస్సెస్‌తోపాటు భారత దేశంపై కూడా పోరాడుతున్నాం' అని వ్యాఖ్యానించారు.

# కెటిఆర్ క్వాష్ పిటిషన్‌పై తప్పుడు ప్రచారం

- కాంగ్రెస్ నేతల తీరుపై బిఆర్ఎస్ ఆగ్రహం

హైదరాబాద్, జనవరి15 (జనంసాక్షి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతలు విష ప్రచారం చేస్తుందంటూ బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై జరిగిన విచారణపై కాంగ్రెస్ నేతలు, కొన్ని మీడియా సంస్థలు తప్పుడు వార్తలు ప్రసారం చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. క్వాష్ పిటిషన్‌పై ఈ దశలో జోక్యం చేసుకోవడం సరికాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. సుప్రీం సూచన మేరకు వెంటనే కేటీఆర్ లీగల్ టీమ్ పిటిషన్‌ను విత్ డ్రా చేసుకుంది. అక్రమ కేసులను న్యాయబద్ధంగానే ఎదుర్కొంటామని కేటీఆర్ చెప్పారు. అందులో భాగంగానే సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. క్వాష్ పిటిషన్ వేసే నాటికి ఎఫ్ఐఆర్ దశలోనే ఫార్ములా ఈ కార్ కేసు ఉంది. సుప్రీంలో విచారణకు ముందే ఏసీబీ విచారణకు కేటీఆర్ సహకరించారు. సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా ఫార్ములా ఈ రేస్ కేసు విషయాలను న్యాయస్థానం దృష్టికి కేటీఆర్ లీగల్ టీమ్ తీసుకెళ్లారు. సుప్రీంకోర్టు సూచన మేరకు కేటీఆర్ లాయర్లు పిటిషన్‌ను విత్ డ్రా చేసుకున్నారు. దీనిపై కాంగ్రెస్ నేతలు, గుంపు మీడియా తప్పుడు ప్రచారం చేస్తోంది. కేటీఆర్‌కు ఎదురుదెబ్బ అంటూ దిక్కుమాలిన వ్యాఖ్యానాలు చేస్తోంది. నేషనల్ హెరాల్డ్ కేసులో తమ అప్పీల్‌ను సోనియా గాంధీ, రాహుల్ గాంధీ వెనక్కి తీసుకున్నారు. సోనియా, రాహుల్‌కు కూడా ఎదురుదెబ్బ తగిలినట్టేనా..? చరిత్రను కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకోవాలని బీఆర్ఎస్ నేతలు సూచించారు. కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ కాలేదు అని కేటీఆర్ అడ్వకేట్ మోహిత్ రావు స్పష్టం చేశారు. మా లీగల్ ఒపీనియర్ ప్రకారం కేసు విత్ డ్రా చేసుకున్నాం. ఈ కేసుకు సంబంధించి ఏ కోర్టులోనైనా అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. ఏసీబీ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నవి ప్రొసీజర్‌లోని ఇరెగ్యులారిటీకి సంబంధించిన అంశాలు. ఫార్ములా ఈ కార్ కేసు విషయమైన సుప్రీంకోర్టులో కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ ప్రసన్న వర్లే ధర్మాసనం విచారణ జరిపింది. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై ఆర్యమా సుందరం, సిద్ధార్థ దవేలు వాదనలు వినిపించారు. ఈ కేసులో సెక్షన్ 13.1ఏ సీపీ యాక్ట్ వర్తించదని వాదనలు వినిపించాం అని మోహిత్ రావు పేర్కొన్నారు. క్వాష్ పిటిషన్‌ను విత్ డ్రా చేసుకోవడం వేరు.. కొట్టివేయడం వేరు : న్యాయవాది సోమ భరత్ ప్రపంచం మొత్తంలో 9 నగరాల్లోనే ఫార్ములా ఈ రేసు జరుగుతోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌కు ఫార్ములా ఈ రేసును రప్పించి.. కేటీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. హైదరాబాద్ ప్రతిష్ట పెంచేందుకే ఫార్ములా ఈ రేసు నిర్వహించారు. రాజకీయ కక్షతోనే కేటీఆర్‌పై బూటకపు కేసు పెట్టారు. కేటీఆర్ ఎప్పుడూ విచారణను వ్యతిరేకించలేదు. న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందని కేటీఆర్ ఎప్పుడూ చెబుతుంటారు. ఫార్ములా కేసులో క్రిమినల్ ఆధారాలు లేవని కోర్టు నమ్మింది. క్వాష్ పిటిషన్ విత్ డ్రా చేసుకోవడం వేరు.. కొట్టివేయడం వేరు. అబద్దాలు, అసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. సోనియా, రాహుల్‌లో నేషనల్ హెరాల్డ్ కేసు అప్పీల్‌ను విత్ డ్రా చేసుకున్న సందర్భం ఉంది. సుప్రీంకోర్టు చెప్పినందుకే కేటీఆర్ క్వాష్ పిటిషన్ విత్ డ్రా చేసుకున్నారు. మీడియా అనేది ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాలి. విచారణకు పూర్తిగా సహకరిస్తానని కేటీఆర్ చెప్పారని న్యాయవాది సోమ భరత్ తెలిపారు.

# ఊరంతా సంక్రాంతి పండగ

- ఏటేటా మూడ్రోజుల పాటు పండగే పండగ
- ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంప్రదాయం



నిజామాబాద్, జనవరి15 (జనంసాక్షి) : ఆ ఊరిలో సంక్రాంతి సంబరాలు కలసికట్టుగా, ఏటేటా నిర్వహిస్తు న్నారు. ఎవరెక్కడ ఉన్నా తప్పకుండా సొంతూరుకు వచ్చి మూడ్రోజులు గడిపి పండగ చేసుకోవడం ఆనవాయితీగా చేసుకున్నారు. కన్న తల్లిని, జన్మభూమిని ఎప్పటికీ మరవద్దన్న ఆదర్శాన్ని ఆ గ్రామస్తులు పాటిస్తున్నారు. దేశ, విదేశాల్లో ఎక్కడున్నా ప్రతి సంక్రాంతికి స్వగ్రామానికి చేరుకొని అంతా కలిసి ఘనంగా వేడుకలు జరుపుకుంటున్నారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామానికి చెందిన వారంతా జన్మభూమి చారిటబుల్ ట్రస్ట్ పేరిట 12ఏళ్లుగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. మనుషుల మధ్య సంబంధాలు తెగిపోయి ప్రజలు తమ మూలాలు మర్చిపోతున్నారు. జన్మభూమిని, కన్న తల్లిదండ్రులను, చిన్ననాటి జ్ఞాపకాలను మర్చిపోవద్దనే ఉద్దేశ్యంతో జన్మభూమి ట్రస్ట్‌ను నెలకొల్పామని తెలిపారు. 12ఏళ్లుగా సంక్రాంతి సంబరాలను స్వగ్రామంలో చిన్ననాటి మిత్రుల మధ్య జరుపుకుంటున్నాం. దేశ, విదేశాల్లో ఉన్నవారంతా ఊరికి తరలివచ్చి పండగలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఏటా సంక్రాంతిని ఊరూరా పెద్దలు, పిన్నలు, మహిళలు అంతా కలిసి సంప్రదాయ బద్దంగా జరుపుకున్నారు. ఈ యేడు కూడా అదే సంప్రదాయం కొనసాగించి, పల్లె వాతావరణాన్ని పరిమళింప చేశారు. గ్రామానికి చెందిన ఉద్యోగులు, గ్రామస్తులు కలిసి 2013 జనవరిలో జన్మభూమి చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. గ్రామ యువత, పిల్లలు గ్రామీణ ప్రాంత పండుగలు, సంస్కృతి సాంప్రదాయాలను మర్చిపోకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ ట్రస్టును ఏర్పాటు చేసినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. జన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా సంక్రాంతి పండుగను సంబురంగా జరుపుకుంటున్నారు. మూడు రోజులపాటు స్వాగత తోరణాలు, డీజే పాటలతో ఊరంతా సందడిగా మారుతుంది. మంగళవారం సంక్రాంతి పండగను, బుధవారం కనుమ పండగను అందరం కలసి జరుపుకున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.. గ్రామానికి చెందిన వారు చాలామంది విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంకా కొందరు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ స్థిరపడ్డారు. ఎవరు ఎక్కడున్నా ఏడాదికి ఒకసారి సంక్రాంతికి సొంతఊరికి రావాలని నిర్ణయించుకున్నారు. 12 ఏండ్ల కింద ఈ నిర్ణయం తీసుకోగా ప్రతిఒక్కరూ విధిగా పండుగకు ముందు ఊరికి చేరుకుంటున్నారు. ఈ యేడు కూడా ఎక్కడెక్కడో ఉన్నవారంతా సంక్రాంతికి రెండు రోజుల ముందే గ్రామానికి చేరుకున్నారు. యోగక్షేమాలతు, పలకరింపులతో సరదాగా గడిపారు. ఏడాదంతా పనుల్లో తీరిక లేకుండా గడిపిన వారంతా బంధువులను, పాత మిత్రులను కలుసుకుని సంబరపడ్డారు. చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. పండుగ వేడుకల్లో భాగంగా వివిధ రకాల పోటీలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీ, తాడాట, కుర్చీలాట, పురుషులకు ఖోఖో, కబడ్డీ, రన్నింగ్, షటిల్ లాంటి పోటీలు పెట్టారు. కనుమ నాడు ఊరంతా ఒకదగ్గరే భోజనాలు చేపట్టారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు.

## మొసళ్ల అభయారణ్యంలో

# అక్రమంగా చేపలవేట






చెన్నూర్, జనవరి 15 (జనం సాక్షి): నియోజకవర్గంలోని జైపూర్ , చెన్నూరు మండలంలోని గోదావరి పరీవాహక ప్రాంతాలైన శివారం , సోమనపల్లి లో ముసళ్ళ అభయారణ్యం వాటి సంరక్షణ కేంద్రం తీర్చిదిద్దడం జరిగింది. ఈ ప్రాంతంలో చేపలు పట్టడం ,వేటాడడం నిషేధించడం జరిగింది. వన్య ప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం వన్యప్రాణులను వేటాడిన చాపలను పట్టిన శిక్ష హర్హులు అని నిబంధనలో ఉన్నప్పటికిని చాపల వేట నిత్యం వేమనపల్లి మండలం నుండి వచ్చి రాత్రులు పగలు తేడా లేకుండా చాపలను వేటాడడం జరుగుతుంది. సంబంధిత ఫారెస్ట్ అధికారులు ఎప్పుడో ఒకనాడు పై అధికారులు వస్తున్నారంటే చాపలకు వెళ్లకూడదు అని ముందే సమాచారం ఇవ్వడం అధికారులు వెళ్లిన తర్వాత మళ్లీ తిరిగి చాపలు పట్టడం కొనసాగిస్తున్నారు. మొ సళ్ళ ఆవాస కేంద్రమైన ఎల్ మడుగులో పెద్దపెద్ద వలలు వేసి చాపలు పట్టే సమయంలో చిన్న చిన్నమొసల్లు కూడా ఎన్నోసార్లు వలలకు చిక్కుకున్న సందర్భాలు ఉన్నాయి చాపల వేట వలన మొసళ్ళకు ఆహారమైన చాపలు వాటికి దొరకకుండా అంతరించిపోయే ప్రమాదం ఉన్నందున సంబంధిత అధికారులు వాటి సంరక్షణ కొరకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370